



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 51 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 14 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




ఓట్ల లెక్కింపునకు

## రంగం సిద్ధం

- తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు
- 243 రిటర్నింగ్ అధికారులు, 243 పరిశీలకుల ఈ ఓట్ల లెక్కింపును పర్యవేక్షించనున్నారు
- ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో-అబ్జర్వర్లతో సిబ్బందిని ఏర్పాటు
- ఎన్నికల సంఘం 4,372 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు

6



## బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు

- 17న హసీనాపై తీర్పు వేళ లాక్‌డౌన్‌కు ఆమె పార్టీ పిలుపు
- చాలా ప్రాంతాల్లో అల్లర్లు, దాడులు
- తీర్పును వెలువరించే ప్రాంతంలో గత ఘటనలు దృష్టిలో ఉంచుకుని భారీ బందోబస్తు
- అనుమానిత ప్రాంతాల్లో భద్రత పటిష్ఠం

# పెట్టుబడుల పండగ

- నేడు, రేపు విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు
- ఉప రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభం
- గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తల హాజరు
- పూర్తైన ఏర్పాట్లు.. 8 హాళ్లు సిద్ధం
- ప్రధాన వేదికముందే ఎంవోయూల వేడుక

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

మరికొన్ని గంటల్లోనే రాష్ట్రంలో పెట్టుబడుల పండగ మొదలవుతోంది. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల మైదానాన్ని దీనికోసం సర్వాంగ సుందరంగా సిద్ధంచేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే పెట్టుబడుల వాతావరణాన్ని పునరుద్ధరించింది. వైసీపీ హయాంలో రాష్ట్రం వదిలిపోయిన సంస్థలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ముందుకొస్తున్నాయి. గూగుల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డేటా సెంటరు ఏర్పాటుకు భారీ పెట్టుబడులతో ముందుకు రావడం గేమ్ చేంజర్‌గా మారింది. ఏడాదిన్నరగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ దేశ విదేశాల్లో పర్యటిస్తూ, సాగిస్తున్న పెట్టుబడుల వేట ఫలితంగా ఏపీ బ్రాండ్ తిరిగి నిలబడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తొలిసారి పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సిద్ధమైంది. సదస్సు విజయవంతానికి ఏర్పాట్లు భారీ స్థాయిలో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) - మిగతా2లో



## రెన్యూ పవర్ 82 వేల కోట్ల పెట్టుబడి

- ఇందులో రూ.22 వేల కోట్ల పెట్టుబడికి గతంలోనే ఓకే.. మరో రూ.60 వేల కోట్లు పెట్టేందుకు 4 ఒప్పందాలు
- పెట్టుబడులన్నీ పునరుత్పాదక ఇంధన రంగంలోనే..గూగుల్ డేటా విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సిద్ధం
- సీఎంతో భేటీలో సంస్థ చైర్మన్ సుమంత్ సిన్హా వెల్లడి.. ఏపీ అప్రోచ్ చాలా బాగుందని ప్రశంసలు

2

## ద్రవ్యోల్బణం తగ్గినా ఊరట లేదు

- అక్టోబర్‌లో కనిష్ఠ స్థాయికి చేరిక
- అయినా తగ్గని నిత్యావసరాల రేట్లు
- ఇళ్ల అద్దెలను పరిశీలిస్తే నెలనెలకు 0.9 శాతం పెరుగుతున్నది
- అదే సమయంలో ఫ్లాట్ నిర్వహణ, విద్యుత్, ఎల్పీజీ ఖర్చులు స్థిరంగా ఉన్నాయి.

6



# క్రెడిట్ చోర్ చంద్రబాబు



- చంద్రబాబు క్రెడిట్ చోరీపై వైఎస్ జగన్ ఆగ్రహం
- "మీరు ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా మీరు ఇవ్వలేదు
- ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదు
- ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవే

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

చంద్రబాబూ.. మీ కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న "క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుందంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చురకలు అంటించారు. క్రెడిట్ చోర్ చంద్రబాబు అనే హ్యాష్ ట్యాగ్‌తో వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. "పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించకుండా.. ఒక్కరికి ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వకుండా.. దీనికోసం ఒక్కపైసా కూడా ఖర్చుచేయకుండా.. ఒక్కరికి ఒక్క ఇల్లుకూడా మంజూరు చేయకుండా.. గత ప్రభుత్వం అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి స్థలాల్లోనే, వైఎస్సార్‌సీపీ గతంలో శాంక్షన్ చేయించిన ఇళ్లను మా ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్నవాటిని పట్టుకుని "ఇళ్లన్నీ మేమే కట్టేశాం" అంటూ పచ్చి అబద్ధాలను కళ్లార్పకుండా, ఏ మాత్రం సిగ్గుపడకుండా, బల్లగుద్దీ మరీ చెప్తూ ఆ క్రెడిట్ మీదేనంటూ మీరు చేస్తున్న క్రెడిట్ - మిగతా2లో



## పార్టీ ఫిరాయించిన బెంగాల్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు

- గెలిచిన నెలకే బీజేపీ నుంచి టీఎంసీలోకి ముకుల్ రాయ్
- శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ గురువారం కలకత్తా హైకోర్టు తీర్పు
- ఫిరాయింపుల నిషేధం చట్టం కింద నిర్ణయాన్ని వెలువరించిన కోర్టు
- ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు మాత్రం లేవు
- అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండమే ఇందుకు కారణం.

2


# 32 చోట్ల మారణహోమానికి స్కెచ్



- 4 ప్రధాన నగరాలుసహా పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లకు పక్కా ప్రణాళిక
- అల్-ఫలాహ్ వర్సిటీ బాయ్స్ హాస్టల్ 13వ నంబర్ గదిలో పథక రచన
- గదిలో కీలక డైరీలు లభ్యం - డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్
- అందులో పాతిక మంది అనుమానిత ఆత్మాహుతి బాంబర్ల వివరాలు
- స్విట్జర్లాండ్ యాప్‌లో రహస్య చాటింగ్
- సొంతంగా సిగ్నల్ యాప్ గ్రూప్ సృష్టించిన ఆత్మాహుతి బాంబర్ ఉమర్
- బాంబుల తయారీ కోసం 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువుల కొనుగోలు
- మరో ఇద్దరు డాక్టర్ల అరెస్ట్ - రూ.26 లక్షల నిధులను సమీకరించిన ఉమర్
- తీగ లాగేకొద్దీ బయటపడుతున్న ఢిల్లీ పేలుడు కుట్ర రహస్యాలు
- వర్సిటీలో దొరికిన ఉమర్ మూడో కారు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

దశాబ్దాల క్రితం బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా, తాజాగా ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్‌లో జైషే మొహమ్మద్ కీలక నేతల మరణాలకు కక్షసాధింపుగా నిద్రాణ ముష్కరమూకలు తలపెట్టిన మారణకాండ గుట్టు రట్టవుతోంది. ఎర్రకోట వద్ద కారును పేల్చేసిన ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీ హాస్టల్ గది వేదికగా పేలుళ్ల కుట్రకు ఉగ్రవాదులు పథక రచన చేశారని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు గురువారం తేల్చారు. ఫరీదాబాద్‌లోని అల్%-%ఫలాహ్ విశ్వవిద్యాలయంలోని బాయ్స్ హాస్టల్ 17వ భవంతిలోని 13వ నంబర్ గదిని ఉగ్రవాదులు తమ రహస్య అడ్డాగా ఉపయోగించుకున్నారు. ఇక్కడి నుంచే అన్ని చోట్లా దాడులకు వ్యూహం పన్నారు. 32 పాత, కొత్త కార్లలో బాంబులను అమర్చి దేశంలోని నాలుగు ప్రధాన నగరాలతోపాటు 32 ప్రాంతాల్లో పేల్చేసి పెను విధ్వంసం సృష్టించాలనేది - మిగతా6లో



## ఎర్రచందనం స్మగ్లింగ్.. ఆ పాత్ర ఎంతో ఆకట్టుకుంది

- 'కొంతకాలం క్రితం నేను ది వైల్డ్ ఈస్ట్ చదవడం మొదలుపెట్టాను.
- ఆ పుస్తకంలోని వివరాలు ఎంతో ఆశ్చర్యకరమైనవి
- ఈ పుస్తకం శేషాచలం ప్రాంతం, తూర్పు కనుమలలో ఎర్రచందనం దోపిడీ గురించి చెబుతుంది.
- రాజకీయాల వెనుక దాక్కున్న కొంతమంది నాయకులు పూర్తి స్థాయి మాఫియా బాస్‌లాగా ఎలా వ్యవహరించారో ఇది వెల్లడిస్తుంది.

2

# వైసీపీని కార్నర్ చేస్తున్న జనసేనాని

**విజయవాడ :** ఏపీలో ఆ మూడు పార్టీలు కలవడానికి.. పవర్‌లోకి రావడానికి..కూటమి లాంగ్ లీవ్ స్లోగన్ బలంగా వినపడానికి ఆయనే కారణం. జనం మెచ్చిన నేతగా.. హైందవ సేనానిగా..మీరా మీరా మీసం తెప్పే భగత్‌సింగ్‌లాగా..ఏపీ పాలిటిక్స్‌లో నిత్యం ఓ వెలుగు వెలుగుతున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఆయన ఏం మాట్లాడిన..ఏ అంశం మీద రియాక్ట్ అయిన చర్చనీయాంశమే. లేటెస్ట్‌గా తిరుమల కల్తీ నెయ్యి ఎపిసోడ్‌పై పవన్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది.శ్రీవారి లడ్డూ కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి సంబంధించిందన్న పవన్..దర్యాప్తులో బయటపడుతున్న అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ అనేది హిందూ సమాజాన్ని గ్భ్రాంతికి గురి చేస్తుందని..సనాతన పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిందే అంటూ మరోసారి వాయిస్ రేజ్ చేశారు. తిరుపతి లడ్డూ కేవలం తీపి పదార్థం కాదని..అది ఒక భక్తి భావన, ఆధ్యాత్మిక భావోద్వేగం అంటూ సెన్సేషనల్ ట్వీట్ చేశారు. లడ్డూ కానీ తిరుమల పవిత్రతను కానీ కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు పవన్.తిరుమల లడ్డూ ఇష్యూపై దర్యాప్తు స్పీడప్ అయింది. కీలక వ్యక్తుల దర్యాప్తు వేళ..పవన్ ట్వీట్ చేయడం సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. అయితే తిరుమల కల్తీ నెయ్యి ఎపిసోడ్ అందరి వేళ్లు..అప్పటి ప్రభుత్వంపై, గత టీడీపీ పాలకులవైపే చూపిస్తున్నాయి. ఓవైపు సిట్ టీమ్ దర్యాప్తు డిటేయిల్స్..న్యూస్ హెడ్‌లైన్‌గా మారగా..వైసీపీ కార్నర్ అవుతోంది. ఇప్పటికే అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి విచారణకు హాజరవగా..టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సిట్ నుంచి పిలుపురావడం కలకలం రేపుతోంది.సేమ్‌టైమ్ ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారి వాంగ్మూలం ఇచ్చారన్న ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో పవన్ రియాక్ట్ అవడం అంటే..గత ప్రభుత్వంపై మరోసారి అటాక్‌కు దిగినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. హిందుత్వ ఎజెండాతోనే పవన్ ట్వీట్ చేసినా..అది పూర్తిగా వైసీపీ తీరును ఎండగట్టేలా..హిందువుల మనసు గెలుచు కునేలా ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే వరుస కేసులు, నేతల అరెస్టులతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. లేటెస్ట్‌గా నకిలీ లిక్కర్ కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ అయ్యారు. ఇక తర్వాత ఎవరు అనే చర్చ మొదలైంది. అయితే ఈసారి వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరును ప్రస్తావిస్తున్నారు కూటమి నేతలు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పెద్దిరెడ్డిని గట్టిగానే టార్గెట్ చేశారన్న ప్రచారం సాగుతోంది.చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి ఆక్రమించిన అటవీ భూముల ఫొటోలను తీసినట్లు మొన్న క్యాబినెట్ భేటీలో చెప్పుకొచ్చారు. పెద్దిరెడ్డి లెక్కలన్నీ తీస్తున్నామని కూడా పవన్ అన్నట్లు తెలుస్తోంది. అయితే పవన్ కల్యాణ్ ఎవరిపై వ్యక్తిగతంగా టార్గెట్ చేయరు. కానీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెద్దిరెడ్డిని నిన్ను వదలా అంటున్నారు.నిజానికి పెద్దిరెడ్డి, చంద్రబాబుకు మధ్య ఏళ్ల నాటి వైరం ఉందంటారు. కానీ సీబీఎన్ రాజకీయ ప్రత్యర్థిపై పవన్ ఫోకస్ పెట్టడం చర్చనీయాంశంగా మారుతోంది. 2024 ఎన్నికల్లో పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు పెద్దిరెడ్డి ఫ్యామిలీ..ఎస్పెషల్‌గా ఎంపీ మిథున్ రెడ్డి ప్రయత్నం చేశారని గుర్తు చేస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో కూడా పవన్ మిథున్‌రెడ్డి పేరును ప్రస్తావించారు. ఆ తర్వాత పవన్ గెలిచారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఏరి కోరి అటవీ శాఖను తీసుకున్నారు పవన్. పెద్దిరెడ్డి లెక్క తేల్చడానికి పవన్ అటవీశాఖను తీసుకున్నారన్న ప్రచారం కూడా ఉంది. ఆ ప్రచారానికి తగ్గట్టుగా ఇప్పుడు దూకుడు కనిపిస్తోంది. ఇలా ఆల్ రౌండర్‌గా టీమ్ కూటమిని ఎప్పుడూ లైమ్‌లైట్‌లో ఉంచుతున్నారు సేనాని. ఆయన దూకుడు..అంతకు మించి వ్యూహం..కూటమికి ఇంకెంత అడ్వాంటేజ్‌గా మారుతుందో చూడాలి మరి.



# ఆత్మ పరిశీలనలో తప్పొప్పులు గుర్తించిన ప్రవీణ్ ప్రకాష్

**విజయవాడ :** మాజీ అధికారి ప్రవీణ్ ప్రకాష్ జగన్ హయాంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలపై మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు , మాజీ అధికారి జాస్తి కృష్ణకిషోర్‌లకు పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న ప్రవీణ్ ప్రకాష్, తన తప్పులను ఒప్పుకుంటూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. 30 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధం కలిగి ఉన్నాను. ఒక్క రూపాయి కూడా అవినీతి ద్వారా సంపాదించలేదు. ఎప్పుడూ చట్ట విరుద్ధంగా ఫైల్‌లలో నోటింగ్ చేయలేదు, అనుమతి ఇవ్వలేదు. నా జూనియర్లకు కూడా అలాంటి సూచనలు చేయలేదు అని అన్నారు. గత ఏడాది జూన్-జూలైలో విజయవాడలో ఉండగా సోషల్ మీడియాలో తీవ్ర ట్రోలింగ్‌కు గురికావడంతో మానసికంగా కుంగిపోయానని, అది ఎఖీూ తీసుకోవడానికి కారణమైందని వెల్లడించారు. అక్టోబర్‌లో ఢిల్లీకి వచ్చిన తర్వాత ఏడాది పాటు ఆత్మపరిశీలన చేశానని, తన తప్పులను గుర్తించానని చెప్పారు.2000-2004 మధ్య గుంటూరు, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ప్రజల నుంచి ఎంతో ప్రేమ, ఆదరణ, హీరో వర్షిప్ లభించిందని ప్రవీణ్ ప్రకాష్ గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, కెనడాలలో కూడా గుంటూరు-విజయవాడ ప్రజలు నన్ను గుర్తుపట్టి ఆప్యాయంగా మాట్లాడేవారు. అది నాకు ఆక్సిజన్ లాంటిది, పని చేయడానికి ప్రేరణ అని అన్నారు. అయితే, సడెన్‌గా ఆ ఆదరణ ట్రోలింగ్‌గా మారడం తనలో మానసిక ఆందోళన కలిగించిందని, ఆత్మపరిశీలనలో సమాజం తనపై పెట్టుకున్న అంచనాలకు తగ్గట్టు వ్యవహరించలేకపోయానని గ్రహించానని చెప్పారు.ముఖ్యంగా 2020లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫైల్ గురించి ప్రవీణ్ ప్రకాష్ వివరించారు. డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆ ఫైల్‌లో అడిషనల్ ఏబీ వెంకటేశ్వరరావు (1989 బ్యాచ్ ఎఖూ)పై డిసిప్లినరీ యాక్షన్ సిఫార్సు చేసిన అంశానికి సంబంధఇంచినది. "చార్జెస్ ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా కనిపించాయి. కానీ ప్రాక్టీస్‌లో అలాంటివి ఆమోదయోగ్యమే. ఉదాహరణకు, గవర్నమెంట్ వాహనాన్ని ప్రైవేట్ పనికి ఉపయోగించినప్పుడు చెల్లింపు చేయాలని రూల్ ఉంది. కానీ 30 ఏళ్ల కెరీర్‌లో ఎవరూ అలా చేయరు, అది సాధారణమే" అని వివరించారు.అయితే, ఆ ఫైల్‌ను చట్టపరమైన దృక్కోణం నుంచి మాత్రమే పరిశీలించి, యాక్షన్ సిఫార్సు చేశానని, ఇప్పుడు అది తప్పని గ్రహించానని ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. "ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో ఉన్న నాకు సమాజం ఎక్స్‌పెక్టేషన్ ఎథిక్స్, మొరాలిటీ లెన్స్‌తో ఫైల్‌లు పరిశీలించాలి. రోల్ రివర్సల్ టెస్ట్ అప్లై చేస్తే ? ఆ చార్జెస్ నాపై ఉంటే న్యాయమా? ? అని ఆలోచిస్తే, ఆ ప్రతిపాదనను తిరస్కరించాల్సింది" అని చెప్పారు. ఇలాంటి పరిస్థితే జాస్తి కృష్ణకిషోర్ కేసులో కూడా జరిగిందని, ఆ ఇద్దరికీ తన నిర్ణయాల వల్ల మానసిక, సామాజిక బాధలు కలిగాయని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. "ఏబీ వెంకటేశ్వరరావు , కృష్ణకిషోర్ లకు ఫోన్ చేసి సారీ చెప్పాను. కానీ మనిషి సామాజిక జీవి కాబట్టి, పబ్లిక్‌గా కూడా క్షమాపణలు చెబుతున్నాను. మీరు మీ మనసులో నన్ను క్షమించండి" అని భావోద్వేగంగా అన్నారు. ఢిల్లీలోని స్నేహితులు ఈ అపాలజీపై ప్రశ్నించగా, "ఇది నా స్వార్థపరమైన చర్య కాదు. వారి బాధలను తిరిగి తీసుకురాలేను, కానీ నా మనసు శుభ్రం చేసుకోవాలి. భవిష్యత్తులో నా కెరీర్ 2.0లో ఎథిక్స్, మొరాలిటీ లెన్స్‌తోనే నిర్ణయాలు తీసుకుంటాను" అని సమాధానమిచ్చారు.



## ఎర్రచందనం స్మగ్లింగ్.. ఆ పాత్ర ఎంతో ఆకట్టుకుంది

అమరావతి

ఎర్రచందనం అక్రమ రవాణాపై తాను చదివిన ఓ పుస్తకం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అక్రమ రవాణాలో ఓ వ్యక్తి తనను తాను ఎలా కింగ్ పిన్‌లా మార్చుకున్నాడో చూసి షాక్ అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్. 'కొంతకాలం క్రితం నేను ది వైల్డ్ ఈస్ట్ చదవడం మొదలుపెట్టాను. ఆ పుస్తకంలోని వివరాలు ఎంతో ఆశ్చర్యకరమైనవి. ఈ పుస్తకం శేషాచలం ప్రాంతం, తూర్పు కనుమలలో ఎర్రచందనం దోపిడీ గురించి చెబుతుంది. మన విలువైన సహజ వనరులను వ్యవస్థ ముందే ఎలా దోచుకున్నారో చూపిస్తుంది. రాజకీయాల వెనుక దాక్కున్న కొంతమంది నాయకులు పూర్తి స్థాయి మాఫియా బాస్‌లాగా ఎలా వ్యవహరించారో ఇది వెల్లడిస్తుంది. వారిలో ఒక పాత్ర నా దృష్టిని ఆకర్షించింది. దాదాపు ఒక సినిమాలాగా ఎర్రచందనంపై దురాశతో అధికారాన్ని వాడుకుని ఓ చిన్న కాంట్రాక్టర్ మొత్తం నేర సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించాడో చూపించాడు రచయిత. మీరు ఆ పుస్తకం చదివినప్పుడు, నేరాన్ని అర్థం చేసుకోలేరు. భూమి, అడవులు, ప్రకృత, ప్రజలపై ద్రోహాన్ని అనుభవిస్తారు' అని పవన్ కల్యాణ్ తెలిపారు. కాగా, గత శనివారం నాడు తిరుపతి మంగళంలో ఎర్రచందనం గోడౌన్లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. గ్రేడ్ల వారీగా ఎర్రచందనం వివరాలను అధికారులను అడిగి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. స్మగ్లింగ్‌కు గురికాకుండా ఎర్రచందనాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించారు. వైసీపీ పాలనలో రూ.5వేల కోట్ల మేర ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగి ఉంటుందని ఆరోపించారు. దాదాపు లక్షా 30 వేల చెట్లను నరికేశారని తెలిపారు. స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని.. ఆ చెట్లను అందరం కలిసి కాపాడుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. అందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సైతం ఏర్పాటు చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేశారు.

## ఏపీలోనూ ఢిల్లీ ఉగ్రలింక్‌లు

**విజయవాడ :** ఢిల్లీలోని రెడ్ ఫోర్ట్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసును ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో వెలుగులోకి వచ్చిన వివరాలతో పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద సానుభూతిపరులను పట్టుకుంటోంది. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ విస్తృత సోదాలు చేపట్టింది. గుంటూరు, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉగ్ర మూలాలు, రాడికలైజేషన్ నెట్‌వర్క్‌లపై అనుమానంతో అధికారులు దాడులు చేశారు. 5 మందిని డిటేన్ చేసి, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, రాడికల్ మెటీరియల్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఏపీలో -కొరసాన్ మూలాలు బయటపడ్డాయి. ఢిల్లీ పేలుడుకు ఏపీ లింక్ ఉందా అనే అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ ఆదిశగా విచారణ చేస్తోంది. రాష్ట్ర పోలీస్, యీలతో కలిసి ఈ ఆపరేషన్ జరుగుతోందిఢిల్లీ హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చిన స్పెషల్ టీమ్‌లు మంగళవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఏపీలోని మూడు కీలక ప్రాంతాల్లో సోదాలు ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. గుంటూరులో అహ్మద్ అలీ అనే యువకుడి ఇంటిపై దాడి చేసి, మోమో ప్రచార మెటీరియల్, టెలిగ్రామ్ చాట్ లాగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అతన్ని డిటేన్ చేసి, విచారణ చేస్తున్నారు. గతంలో ఈ యువకుడు రాడికలైజేషన్ గ్రూపుల్లో చాట్‌లు చేసినట్టు తేలింది. విజయనగరం మదరసాలో మూలాలు ఉన్నాయనే ఇంటెలిజెన్స్ ఆధారంతో జాతీయ దర్యాప్తు సంస్థటీమ్ సోదాలు చేసింది. ముగ్గుర్ని డిటేన్ చేశారు. విశాఖపట్నం మధురవాడ, మునసవాడలో రెండు ఇళ్లలో దాడులు చేశారు. ఇద్దరు బ్రోకర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరు రాడికలైజ్డ్ యువకులను రిక్రూట్ చేసి, ఢిల్లీ పేలుడుకు లాజిస్టిక్ సపోర్ట్ ఇచ్చినట్టు అనుమానం. గత నెలలో ఏపీలోని విజయనగరంలో కాన్స్పిరసీ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ ఫైల్ చేసింది. ఇక్కడ ఇద్దరు మౌల్వీలు ఆన్‌లైన్ రాడికలైజేషన్ చేసి, యువకులను రిక్రూట్ చేసినట్టు తేలింది. గుంటూరు, విశాఖలో కూడా మూలాలు బయటపడినందున విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఏపీ డీజీపీ ఆదేశాల మేరకు బాంబ్ స్క్వాడ్‌లు, యీ టీమ్‌లు విజయవాడ, విశాఖ, తిరుపతి వంటి ముఖ్య నగరాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పబ్లిక్‌కు "సస్పిషియస్ ఆబ్జెక్టులు కనిపిస్తే 100 డయల్ చేయండి" అని సూచించారు. రాడికలైజేషన్ గ్రూపులు, ఫండింగ్ సోర్సెస్‌పై ఎన్‌ఐఏ దృష్టి పెట్టింది.

## రెన్యూ పవర్ 82 వేల కోట్ల పెట్టుబడి

అమరావతి

పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు కంటే ముందుగానే రాష్ట్రప్రభుత్వం భారీ ఎత్తున ఎంవోయూలను కుదుర్చుకుంటోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలోనే ప్రముఖ సంస్థగా ఉన్న రెన్యూ పవర్ ఏపీలో రూ.82వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. గురువారం ఆ కంపెనీ ఛైర్మన్ సుమంత్ సిన్హా.. సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యా రు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ ముందంజలో ఉందని, పర్యావరణ పరిరక్షణతోపాటు వినియోగదారులకు విద్యుత్తును తక్కువ ధరకు అందించడమే తమ లక్ష్యమని సీఎం వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో రెన్యూ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎకానమిక్ డెవల్‌పమెంట్ బోర్డు (ఈడీబీ)తో రూ.60వేల కోట్ల విలువైన 4ఎంవోయూలను కుదుర్చుకుంది. కాగా, ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్ ఫొటోవోల్టాయిక్(పీవీ) ఇంగోట్-వేఫర్ ప్లాంట్, 2 గిగావాట్ పంప్డ్ హైడ్రో ప్రాజెక్టు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వంటి వాటిల్లో 5 గిగావాట్ హైబ్రిడ్ ప్రాజెక్టులను రెన్యూ సంస్థ ఏర్పాటు చేయనుంది. తాజా ఎంవోయూల ద్వారా 10వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధికి అవకాశముంది.

**సదస్సుకు వస్తే పెట్టుబడులు వచ్చినట్టా..!**

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 2023 మార్చి 3న విశాఖపట్నంలో ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించింది. ఈ సమ్మిట్‌కు రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీతోసహా పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా ఈ సమావేశానికి హాజరై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ ఆ తర్వాత సుమంత్ సిన్హా సహా ఒక్క పారిశ్రామికవేత్త కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టలేదు. కానీ వైసీపీ మాత్రం....రెన్యూ సంస్థను తామే తీసుకొచ్చామని ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటోంది.

గతంలో 22వేల కోట్లు పెట్టుబడి..

రెన్యూ సంస్థ ఈ ఏడాది మే 16న అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో రూ.22వేల కోట్లతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టుకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశా రు. ఇది దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టు. ఇందులో 1.8 గిగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను రెన్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది.

రైతులతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

రాష్ట్రంలో వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, బీడు భూముల్లో రైతులు స్వయంగా సోలార్, విండ్ విద్యుదుత్పత్తి చేస్తే ఎంతమేర లాభదాయకంగా ఉంటుంది... ఎకరానికి ఎంత ఆదాయం వస్తుందనే దానిపై రెన్యూ పవర్ ఛైర్మన్ సుమంత్ సిన్హాతో సీఎం చర్చించారు. సౌర పలకల ధరలు అధికంగా ఉన్నందున వాటి తయారీ యూనిట్లను ప్రోత్సహిస్తామని సీఎం వెల్లడించారు.

## పెట్టుబడుల పండగ

-మొదటిపేజీ తరువాయి

సంయుక్తంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ, విదేశాల నుంచి మంత్రులు, దిగ్గజ కంపెనీలు తరలివస్తున్న ఈ సదస్సును శుక్రవారం ఉదయం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్, ఇంకా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు పారిశ్రామిక దిగ్గజాలు, సీఐఐ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. సదస్సులో ప్రధాన వేదిక (హాల్ నంబర్ 5)గా ఏపీ ప్రభుత్వ పెవిలియన్ ప్లీనరీ ఉంటుంది. మరో ఏడు హాళ్లలో వేర్వేరుగా సదస్సులు, గోష్ఠుల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సీఎం, కేంద్ర వాణిజ్య మంత్రికి చాంబర్లు, శంకుస్థాపనకు ఒక హాలు సిద్ధం చేశారు. ప్రధాన వేదికపై ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. తొలిరోజు రాత్రి 8 గంటల వరకూ పలు ప్లీనరీలు నిర్వహించనున్నారు. రెండోరోజు శనివారం ఉదయం 9.30 గంటలకు తిరిగి ప్లీనరీలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 గంటల వరకూ జరగనున్న ముగింపు సభ ఉంటుంది. ఈ సదస్సుఉ 35 దేశాలకు చెందిన మంత్రులు, ప్రతినిధులు పాల్గొంటున్నారు.

**పెట్టుబడుల సందడి**

భాగస్వామ్య సదస్సులో పారిశ్రామిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం విశాఖ నోవాటెల్ హోటల్‌లో చంద్రబాబు సమక్షంలో పరిశ్రమల శాఖ తొమ్మిది, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మూడు, ఇంధన శాఖ ఆరు, సీఆర్‌డీఏ 8 ఒప్పందాలు చేసుకున్నాయి. ఆహార శుద్ధి రంగంలో మరో 4 ఒప్పందాలు కుదిరాయి. కాగా, శుక్రవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రధాన వేదిక వద్ద పరిశ్రమల శాఖ నుంచి 14, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ 15, ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) ఆరు, ఇంధన శాఖ నుంచి 21 ఒప్పందాలు జరగనున్నాయి. మొత్తం ఒప్పందాల మేరకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

**ప్రధాన వేదికపై 21 మంది..**

భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ ప్రధాన వేదిక (హాల్ నంబరు-5)పై ముందువరుసలో 21 మంది వరకు ఆశీనులవుతారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు పీయూశ్ గోయల్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమాని, ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్లా, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు తదితరులు కూర్చుంటారు.

## క్రెడిట్ చోర్ చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

చోరీ స్కీం హేయంగా ఉంది. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు.. నాటకాల రాయుడు అంటారు" ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. "మీరు ప్రారంభించామని చెప్పుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా మీరు ఇవ్వలేదు. ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవే. మరో 87,380 ఇళ్లు శ్లాబ్ లెవల్ వరకూ మా హయాంలోనే కట్టించినవే. శ్లాబ్ కంటే కింద స్థాయిలో మరో 66,845 ఇళ్లు మా హయాంలో నిర్మాణంలోఉన్నవే. ఇవికాక అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లలో ఒకేరోజు గృహప్రవేశాలతో మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ఇన్ని వాస్తవాలు కళ్ళముందే ఉన్నా%% అసలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, మీరే అన్నీ చేసినట్టుగా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్న మీ స్కీం చాలా హేయం! ..మా హయాంలో 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఇచ్చి, వారి పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించాం. 21.75 లక్షల ఇళ్లను శాంక్షన్ చేయించి%%కోవిడ్‌లాంటి మహమ్మారి ద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ 9 లక్షలకుపైగా ఇళ్లను మా హయాంలోనే పూర్తిచేసినా, అన్నీ మీరే చేశారన్నట్టుగా మీరు చెప్పడమే కాకుండా, మీ ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేయించుకుని, ఆ క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్న మీ స్కీం చాలా హేయం

..చంద్రబాబూ.. మేము 31.9 ఇళ్ల పట్టాలను ఇచ్చి, అందులో 21.75లక్షల ఇళ్లు శాంక్షన్ చేయించి కట్టడం మొదలుపెట్టాం. మిగిలిన ఆ 10 లక్షల ఇళ్ల స్థలాల్లో పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చే కార్యక్రమానికి పూనుకోకుండా, ఆ ఖాళీ స్థలాలను లాక్కునే కార్యక్రమం చేస్తున్న మీరు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి, నిస్సిగ్గుగా క్రెడిట్ చోరీకి పాల్పడ్డం అత్యంత హేయం!. ఒకరి కష్టాన్ని కొట్టేయడంలో, ఒకరి ఐడియాను మీదిగా చెప్పుకోవడంలో, ఆ పేదల ఇళ్లస్థలాలను సైతం లాక్కునే ప్రయత్నం చేయడం, అసలు ఆ క్రెడిట్ చోరీలో మీకు మీరే సాటి" అంటూ వైఎస్ జగన్ నిలదీశారు.

# ఓటు వేయలేదు.. పైసలు తిరిగి ఇచ్చేయండి బాస్



ప్రతిష్ఠాత్మకంగా సాగిన జూబ్లీహిల్స్ ఉపపోరులో కీలక అంకమైన పోలింగ్ ముగియటం.. ఫలితం కోసం ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. రేపు (శుక్రవారం' ఈ ఉపపోరు ఫలితం వెలువడనుంది. ఉదయం తొమ్మిది గంటల సమయానికి ట్రెండ్ ఎలా ఉందన్నది అర్థమయ్యే పరిస్థితి. మరి పోటాపోటీగా సాగితే తప్పించి.. మామూలుగా అయితే 11.30 గంటల సమయానికి గెలుపు ఎవరిదన్న విషయంపై క్లారిటీ వచ్చేసే పరిస్థితి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం కోసం ప్రధాన రాజకీయ పార్టీలు పడిన శ్రమ అంతా ఇంతా కాదు. డబ్బులకు వెనుకాడకుండా భారీగా ఖర్చుపెట్టేయటం తెలిసిందే. ఓటరుకు రూ.2500 చొప్పున పంచేయటమే కాదు.. పట్టుచీరను కూడా నజరానాగా ఇవ్వటం తెలిసిందే. భారీగా సాగిన ఓట్ల కొనుగోలు నేపథ్యంలో గతానికి భిన్నంగా భారీ ఎత్తున పోలింగ్ జరుగుతుందని ఆశించారు. అందుకు భిన్నంగా ఎప్పటిలానే పోలింగ్ శాతాలు నమోదయ్యాయి. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ నమోదైన ఓట్లతో పోలిస్తే.. సుమారు ఒక శాతం పోలింగ్ పెరిగినట్లు చెబుతున్నా.. పెరిగిన ఓట్ల సరాసరితో పోలిస్తే.. అదేమంత పెద్ద పెరుగుదల కాదన్న మాట వినిపిస్తోంది. హోరాహోరీగా సాగిన ఉప ఎన్నికల్లో గెలుపు కోసం భారీగా ఖర్చు పెట్టిన పార్టీలు.. ఇప్పుడు పోలింగ్ సరిగా కాని నేపథ్యంలో.. తాము డబ్బులు పంచిన వాళ్లలో ఎవరు ఓటు వేయలేదన్న విషయాన్ని గుర్తించే పనిలో పడ్డారు. బూత్ ఇంఛార్జులుగా వ్యవహరిస్తున్న వారు.. ఓటు వేయాలంటూ డబ్బులు పంచిన వారు కలిసి.. ఏ కాలనీలో.. ఏ అపార్టుమెంట్ లో ఓటు పడింది? ఎవరు ఓటు వేయలేదన్న విషయంపై ఆరా తీయటం షురూ చేశారు. ఎవరైతే ఓటు వేయలేదో.. వారంతా తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బుల్ని ఆయా పార్టీల అభ్యర్థుల కోసం కాకున్నా..డబ్బులు తీసుకొని మరీ బాధ్యత లేకుండా వ్యవహరించిన వారు డబ్బులు ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

ఇంతకూ డబ్బులు తీసుకొని ఓటు వేయలేదన్న విషయాన్ని ఎలా గుర్తిస్తారు? అన్న విషయంలోకి వెళితే.. పోలింగ్ వేళ అభ్యర్థి తరఫున ఏజెంట్ గా కూర్చున్న వ్యక్తి ఓటేసేందుకు వచ్చిన వారిని గురతించి.. ఓటరు లిస్టులో పేరును రౌండ్ చేసుకుంటారు. ఇలా ఏజెంట్ వద్ద ఉన్న ఓటేసిన వారి జాబితా.. పోలింగ్ కు ముందు ఓటరు లిస్టు ఆధారంగా డబ్బులు పంచిన లిస్టును సరి చూసుకోవటం ద్వారా.. పైసలు తీసుకొని ఓటు వేయని వారిని గుర్తించారు. ఉదాహరణకు ఎస్పీఆర్ హిల్స్ లోని ఒక ఇంట్లో 18 ఓట్లకు రూ.45 వేలు తీసుకోగా.. అందులో నాలుగు ఓట్లు మాత్రమే పోలైనట్లుగా గుర్తించారు. దీంతో.. మిగిలిన 14 ఓట్లకు తామిచ్చిన డబ్బుల్ని తిరిగి ఇవ్వాలంటూ ఆ ప్రాంతానికి పైసలు పంచిన పార్టీ ఇంఛార్జికి సమాచారం ఇచ్చారు. వారు.. వెళ్లి ఆ ఇంట్లోని వారిని ప్రశ్నించి.. డబ్బులు తిరిగి ఇచ్చేస్తే.. అపార్టెమంట్ అసోసియేషన్ కు చందా కింద రాసి ఇస్తామని పేర్కొంటున్నారు. బస్తీల్లో అయితే.. స్థానిక ఇంఛార్జిగా ఉన్న వ్యక్తిని ఆ డబ్బులు వసూలు చేసుకొని తీసుకోవాలని చెప్పినట్లుగా తెలుస్తోంది. ఇలా ఓటు వేయని వారిని గుర్తించే వైనం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా చూస్తే.. డబ్బులు తీసుకొని మరీ ఓటు వేయని వారు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవటమే మంచిదన్న మాట వినిపిస్తోంది. అలా అని డబ్బులు తీసుకొని ఓటు వేసే విధానానికి మేం వ్యతిరేకమన్న విషయాన్ని మర్చిపోవద్దు.

# గులాబీ మైండ్ గేమ్‌ను కాంగ్రెస్ అర్థం చేసుకోలేదా..?

ఓడి గెలవటం అన్న మాట తరచూ క్రీడల్లో వింటుంటాం. ఆ తరహా క్రెడిట్ కోసం గులాబీ పార్టీ జూబ్లీహిల్స్ ఉప పోరు వేళ ప్లాన్ చేసిందా? అంటే.. అవునన్న మాట వినిపిస్తోంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జూబ్లీ ఉపపోరుకు సంబంధించి కీలకమైన పోలింగ్ వేళ.. అధికార కాంగ్రెస్ అధిక్యత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తే.. నియోజకవర్గంలో తనకున్న పట్టును ప్రదర్శించే విషయంలో గులాబీ పార్టీ చేజార్చుకున్నట్లుగా కనిపించింది. ఇదే విషయాన్ని పోలింగ్ ముగిసిన తర్వాత వివిధ సంస్థలు వెలువర్చిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు స్పష్టం చేశాయి. జూబ్లీ ఉపపోరు పోలింగ్ ఆద్యంతం ప్రశాంత వాతావరణంలో సాగినప్పటికి.. పోలింగ్ ముగిసే సమయంలో మాత్రం అనూహ్య పరిణామాలు చోటు చేస్నుకోవటం గమనార్హం. పోలింగ్ వేళ అధికార పార్టీ అధికార దుర్వినియోగం చేస్తుందని.. దొంగ ఓట్లు వేయిస్తుందని పేర్కొంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మధ్యాహ్నం ప్రెస్ మీట్ పెట్టటం.. అనంతరం ఒక పోలింగ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. పోలింగ్ పూర్తయ్యే సమయానికి యూసఫ్ గూడలోని కాంగ్రెస్ అభ్యర్థికి చెందిన పార్టీ కార్యాలయం వద్ద వెయ్యి మందికి పైగా స్థానికేతరులు ఉన్నారని.. వారితో దొంగ ఓట్లు వేయించినట్లుగా పేర్కొంటూ ఆందోళన షురూ చేశారు. అప్పటికే తమ మీద అదే పనిగా ఆరోపణలు చేయటం.. ప్రతి మీటింగ్ లోనూ రౌడీ.. రౌడీ.. అంటూ తమ అభ్యర్థిని




ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలపై ఆగ్రహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు.. బీఆర్ఎస్ అభ్యర్థితో పాటు.. ఆ పార్టీకి చెందిన నేతలు పలువురు కలిసి చేస్తున్న ఆందోళన వేళ.. అంతే దూకుడుగా స్పందించారు. దీంతో.. ఒక్కసారిగా వాతావరణం మారిపోవటమే కాదు.. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదంతా ఎందుకన్న అంశాన్ని ఎగ్జిట్ పోల్స్ విడుదలైన తర్వాత కాంగ్రెస్ నేతలు కొందరికి అర్థమైంది. ఊహించని విధంగా ఓటమి పలుకరించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్న వేళ.. తమకు ఎదురైన ఓటమి కాంగ్రెస్ కున్న అధికారం కారణమే తప్పించి.. ఓటర్లు తమను ఓడించలేదన్న భావన కలిగేలా చేసేందుకే ఈ హడావుడి చేశారన్న మాట బలంగా వినిపించింది. అయితే.. గులాబీ పార్టీ మైండ్ గేమ్ ను సరైన రీతిలో కాంగ్రెస్ అర్థం చేసుకొని ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నువ్వెంత? అంటూ రెచ్చగొడితే.. అంతేలా రెచ్చిపోవటంలో అర్థం లేదన్న విషయాన్ని అధికార పార్టీ గుర్తించి ఉంటే బాగుండేదంటున్నారు. ఏమైనా.. పోలింగ్ చివర్లో గులాబీ పార్టీ మైండ్ గేమ్ ను అర్థం చేసుకోవటంలో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందన్న మాట బలంగా వినిపిస్తోంది.


## జొన్నాడ గ్రామోద్యోగ్ వికాస్ యోజనపై

# అవగాహన సదస్సు




**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** చేతి వృత్తి ద్వారా మహిళలు ఉపాధి పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని ఏపీ కెవిఐసి డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ అన్నారు. మండలంలోని జొన్నాడలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ చైర్మన్ ఏం.రాజబాబు అధ్యక్షతన గ్రామోద్యోగ్ వికాస్ యోజన పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ రహమ్ తుల్లా, లీడ్ జిల్లా మేనేజర్ కేశవ వర్మ (యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా), జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఏపివి మాధవి హాజరయ్యారు.వారు మాట్లాడుతూ గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కొరకు గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక, అదునికికరణ, శిక్షణ మెదలైన వాటిని అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు శిక్షణ సాధనాలను అందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కెవిఐసి నోడల్ అధికారి డి. సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ ఎన్.నాగమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ న్యాయవాది రామ్మోహన్ రావు ఆకస్మిక మృతి...



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్,అడ్వకేట్ వేగుళ్ల రామ్మోహన్ రావు గురువారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. న్యాయవాదిగా విశిష్ట సేవలందిస్తున్న రామ్మోహన్ రావు మృతి పట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ యరమాటి వెంకటరాజు, మామిడి శ్రీను,టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, టిడిపి పట్టణ అధ్యక్షులు మచ్చా నాగు, మెకానిక్ కరీం, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

# అందెశ్రీ సంస్మరణ సభలో ఘన నివాళి



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ స్థానిక ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు గురువారం ఉదయం కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్ ఏ.వెంకటరమణ అధ్యక్షతన ప్రజా గాయకుడు లోక కవి అందెశ్రీ సంస్మరణ సభను నిర్వహించారు.ముందుగా అధ్యాపకులు,విద్యార్థులు రెండు నిమషాలు మౌనం పాటించి అందెశ్రీ కి నివాళులు అర్పించారు. అనంతరం ఇన్ ఛార్జీ ప్రిన్సిపాల్ ఏ. వెంకట రమణ మాట్లాడుతూ కవిత్వమే శాశ్వతమని నమ్మిన ప్రజా గాయకుడు లోక కవి అందెశ్రీ అన్నారు.అందెశ్రీ కవిత్వం మానవ విలువల పునాదిపై నిలిచిన ఒక సాంస్కృతిక చరిత్ర అని పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకుడు పి.భాస్కరరావు మాట్లాడుతూ గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించిన అందెశ్రీ తన ఆరేళ్ల వయసు నుంచే ఆశువుగా పాటలల్లడం మొదలుపెట్టాడనీ. అతని లోని ప్రతిభను గుర్తించిన శృంగేరి మఠ పీఠాచార్యులు స్వామి శంకర్ మహారాజ్ అందెశ్రీనీ చేరదీసాడు అని తెలిపారు."మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు"అంటూ మారుతున్న కాలంలో మానవ సంబంధాలు ఎలా మంట గలిసి పోతున్నాయో అంటూ ఆవేదన చెందిన గొప్ప దార్శనికుడు అందెశ్రీ అన్నారు. అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణా జననీ జయకేతనం" గీతం నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా విరాజిల్లుతోంది అని కొనియాడారు. "నా కవిత్వం సామాన్యుడి గుండె చప్పుడు" అంటూ " నేను ప్రజల పక్షం నాది ప్రజా మార్గం అని ఎలుగెత్తి చాటిన ప్రజా కవి అందెశ్రీ అన్నారు.పాటల పూదోట "లలిత గీతాల"సంపుటిని అలాగే "అందెల సందడి " మరొక సంపుటిని రాశారు.అందెశ్రీ నేటి కవులకు,కళాకారులకు,విద్యార్థులకు ఆదర్శ ప్రాయుడని,అందెశ్రీ పాట ఉన్నంత కాలం ప్రజల హృదయల్లోనే ఉంటాడన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ కె.అలీముద్దీన్, కె.పెద్దబ్బులు, వై.శివకుమారి, సి.శాంతి సుధ,కె.వెంకట రావు, డి.భాస్కర రావు, కె.గంగాధర్, వై.రాజేష్ బాబు, ఏసురత్నం, పి.సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా? అయితే కష్టమే...



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ముఖ్యంగా ఏపీ వాసులు పెద్ద పండుగగా భావించే సంక్రాంతికి ఊరెళ్లేందుకు అప్పుడే జాగ్రత్తలు పడుతున్నారు. హైదరాబాద్ తోపాటు ఇతర నగరాల్లో నివసిస్తున్నవారు సంక్రాంతికి సొంతూళ్లు వెళ్లేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే పలు ట్రైన్లు టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి. రైలు టికెట్లను రెండు నెలలు ముందుగానే రిజర్వు చేసుకునే వెసులుబాటు ఉండటంతో జనవరి 9 నుంచి ప్రయాణాలకు ఇప్పటి నుంచి రిజర్వేషన్లు చేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లే పలు రైళ్లు ఇప్పటికే రిగ్రీట్ అయినట్లు చూపుతున్నాయి. ఈ రైళ్ల టికెట్లు అన్నీ అమ్ముడుపోగా, వెయిటింగ్ లిస్టు కూడా పూర్తయినట్లు చెబుతున్నారు. వెయిటింగు లిస్టు టికెట్ల అమ్మకాన్ని కూడా క్లోజ్ చేయడాన్ని రిగ్రీట్ అంటారు. సహజంగా స్లీపర్, ఏసీ రైళ్ల టికెట్లు అమ్ముడైన తర్వాత 200 నుంచి 300 వరకు వెయిటింగు లిస్టులో టికెట్లు విక్రయిస్తారు. ఇవి కూడా అమ్ముడైన తర్వాత రిగ్రీట్ పెడతారు.

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖ వైపు వెళ్లే పలు రైళ్లు రిగ్రీట్ జాబితాలో చూపిస్తున్నారు. జనవరి 9, 10, 11 తేదీల టికెట్లు ఇప్పటికే అమ్ముడైపోయాయి. కోణార్క్, ఈస్ట్ కోస్ట్, గోదావరి, విశాఖ, మహబూబ్ నగర్, జన్మభూమి, ఫలక్‌నుమా, ఎల్టీటీ, గరీబ్ రథ్ రైళ్ల టికెట్లు అన్నీ అమ్ముడైపోయాయి. ఈ సారి జనవరి 13, 14, 15 తేదీల్లో సంక్రాంతి పండుగ జరగనుంది. దీంతో హైదరాబాద్ లో స్థిరపడిన వారు పండుగకు ముందుగా సొంతూళ్లు వెళ్లేలా ప్లాన్ చేసుకుంటున్నారు.

ప్రస్తుతానికి ట్రైన్ టికెట్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు స్పెషల్ ట్రైన్లు వేస్తారేమోనని ఎదురుచూస్తున్నారు. పండగ సీజన్ లో బస్సు సర్వీసులకు అదనపు చార్జీల బాదుడు ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే హైదరాబాద్ తోపాటు ఏపీలోని ఇతర నగరాల్లో కూడా కోస్తా జిల్లాల వారు లక్షలాదిగా ఉండటం, ఆ మేరకు ప్రయాణ సౌకర్యాలు లేకపోవడంతో విపరీతమైన డిమాండ్ ఉంటోందని అంటున్నారు. కాగా, గతంలో ఐఆర్‌సీటీసీ ఖాతా ఉంటే టికెట్లు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు ఉండేది. కొందరు ఏజెంట్లు ఒక్కో ఖాతా నుంచి ఎక్కువ బుక్ చేస్తూ దుర్వినియోగానికి పాల్పడుతుండడంతో సాధారణ ప్రయాణికులకు తత్కాల్ టికెట్లు లభించడం గగనంగా మారేది. ఈ నేపథ్యంలో జులై 1 నుంచి ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న మొబైల్ నంబరుతో ఆధార్ కార్డు అనుసంధానమై ఉంటేనే తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునేలా రైల్వే శాఖ నిబంధనలు మార్చింది. అంతేకాకుండా అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఇదే విధానాన్ని వర్తింపజేసింది. ఆధార్ అథంటికేషన్ పూర్తైన ఐఆర్‌సీటీసీ ఖాతాలు కలిగిన వారు మాత్రమే ఉదయం 8 గంటలకు రిజర్వేషన్ టికెట్లు తీసుకునేలా మార్పు చేసింది. లింక్ చేసుకోని వారు 8.15 గంటల తర్వాత మాత్రమే టికెట్లను పొందవచ్చు. దీంతో ట్రైన్ టికెట్ల కోసం ప్రయాణికులు నానా హైరానా పడాల్సివస్తోందని వాపోతున్నారు.

# ఎడిటర్ వాయిస్

## భారత్‌పై యుఎస్ టారీఫ్‌ల ఎఫెక్ట్

భారత ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. దేశ జీడీపీ మీద, ఉత్పత్తి, ఉపాధి అవకాశాల ప్రభావం దేశంలోని కొన్ని కేంద్రాల్లో తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు పది శాతంతో ప్రారంభమై ఆగస్టు 7 నాటికి 25 శాతం, ఆగస్టు 25 నాటికి 50శాతానికి చేరుకున్నాయి. వీటివల్ల గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రిపోర్ట్ ప్రకారం 2025 మే నుండి సెప్టెంబర్ నాటికి అమెరికాకు మన దేశం చేసే ఎగుమతులు 37.5శాతానికి పడిపోయాయి. అమెరికాకు భారతదేశం ప్రతి సంవత్సరం సగటున 86.51 బిలియన్ డాలర్ల విలువ గల సరుకులను ఎగుమతులు చేస్తున్నది. ఇందులో 43శాతం అంటే 49.6 బిలియన్ డాలర్ల విలువ గల సరుకుల ఎగుమతులు పడిపోయాయి. వీటివల్ల అనేక రకాలుగా నష్టం జరిగింది. 2025 మేలో 8.8 బిలియన్ డాలర్ల విలువ గల సరుకులు ఎగుమతి చేస్తే, సెప్టెంబర్‌లో 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దేశ జీడీపీలో 0.9శాతం తగ్గుదలకు అవకాశం ఏర్పడింది. జీడీపీ 6.5శాతం నుండి 5.6శాతానికి తగ్గే పరిస్థితి ఏర్పడింది. అమెరికాకు ఎగుమతులు తగ్గడంతో ఉత్పత్తి చేసే కంపెనీలలో సరుకులు గోడౌన్‌లలో మూలుగుతున్నాయి. సరుకు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. ఫలితంగా కార్మికులకు ఉపాధి తగ్గి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా దేశంలో నిరుద్యోగం పెరగడానికి ఆర్థిక మందగమనం పెరగడానికి సంక్షోభానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి నివారణకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికాను ఎదిరించే దమ్ము లేక దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నది. అమెరికా సుంకాల వల్ల కీలక రంగాలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయి. మే నుండి సెప్టెంబర్ వరకు ఫార్మాస్యుటికల్ ఎగుమతులు 15.7శాతం పడిపోయాయి. వాటి విలువ సుమారు 745.6 మిలియన్ డాలర్ల నుండి 628.3 మిలియన్ డాలర్లకు తగ్గింది. ఇండిస్టియల్ మెటల్స్ ఆటో పార్ట్స్ ఇతరాలు ప్రపంచవ్యాప్తంగానే 16.7శాతం ఎక్స్‌పోర్ట్ తగ్గాయి. మన దేశం నుండి ఎగుమతయ్యే అల్యూమినియం ఎక్స్‌పోర్ట్ 37శాతం, కాపర్ 25శాతం, ఆటో పార్ట్స్ 12శాతం, ఐరన్ మరియు స్టీల్ 8శాతం ఎగుమతులు తగ్గాయి. ఉత్పత్తి రంగంలోని కార్మికులు ఉపాధి పొందుతున్న రంగాలలో వస్త్రాలు, రసాయనాలు, వ్యవ సాయ, ఆహార పరిశ్రమలు, యంత్రాలు, రత్నాలు, ఆభరణాలు రంగాల యొక్క ఎగుమతులు 33శాతం పడిపోయాయి. ఇందులో మే నెలలో 4.8 బిలియన్ డాలర్ల నుండి సెప్టెంబర్ నాటికి 3.2 బిలియన్ డాలర్లకు తగ్గాయి. రత్నాల ఆభరణాల ఎగుమతులు 59.2 శాతం తగ్గి సుమారు 500.2 మిలియన్ డాలర్ల నుండి 202.8 మిలియన్ డాలర్ల విలువ గల సరుకులు తగ్గి పోయాయి. ఆ మేరకు వియత్నాం, థారులాండ్‌లు అమెరికా ఆర్డర్స్ పొంది లాభపడ్డాయి. సోలార్ ప్యానల్స్ ఎగుమతులు కూడా 60.8శాతం పడిపోయాయి. అంటే సుమారు 202.6 మిలియన్ డాలర్ల నుండి 79.4 మిలియన్ డాలర్ల విలువ నష్టపోవడం జరిగింది. ప్రధానంగా స్మార్ట్ ఫోన్ ఎగుమతులు కూడా భారీగా తగ్గాయి. గత సంవత్సరం ఇదే కాలంలో 197శాతం ఎగుమతులు పెరిగితే, ఈ మే నుండి 58 శాతం పడిపోయాయి. 2.2 బిలియన్ డాలర్ల నుండి 884.6 మిలియన్ డాలర్లకు పడిపోయాయి. వీటన్నింటిని బట్టి మనకు అర్థమయ్యేదేమంటే అమెరికా ట్రంప్ సుంకాల వల్ల మన దేశం ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆర్థికంగా నష్టం జరిగింది. మన దేశం అమెరికాకు సుమారు 86 బిలియన్ డాలర్ల విలువగల సరుకులు ఎగుమతి చేస్తున్నది. ఈ సంవత్సరం 50 బిలియన్ డాలర్లకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేయబడింది. ఈ ఐదునెలల్లో 4.36 లక్షల కోట్ల విలువ గల సరుకులు ఎగుమతి ఆగిపోయి దేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దేశంలో తయారీ, సేవల రంగాలు వాటి కార్యకలాపాలు తీవ్రంగా మందగిస్తున్నాయి. దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ఇదేవిధంగా సుంకాలు కొనసాగితే టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలలో దాదాపు లక్ష ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. రత్నాలు ఆభరణాలు, సుమారు 80 నుంచి 90 వేల మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. సూరత్ ముంబై వాణిజ్య కేంద్రాలలో డిమాండ్, ప్రొడక్షన్స్ తగ్గాయి. తోలు పరిశ్రమలో 20 నుండి 30 వేల ఉద్యోగాలు, ప్రాసెస్ చేసిన ఆహారం, రొయ్యలు వంటి రంగాల్లో 20 వేలు, రసాయనాలు, ఔషధాలు, ఆటో విడిభాగాల వంటి వాటిలో 40 నుంచి 50 వేల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలలో పదివేల ఉద్యోగాలు పోతాయి. ఈ సుంకాల ప్రభావం వల్ల గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని ప్రధానమైన నగరాలలో వీటి ప్రభావం ఉంటుంది. ఇంత నష్టం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది. సుంకాల విధింపులకు కొద్ది నెలల ముందు ఫిబ్రవరిలో మోడీ అమెరికా పర్యటనలో 'మిషన్ 500' అని ఒప్పందం చేసుకొని 2030 నాటికీ 500 బిలియన్ డాలర్లు ఎగుమతి లక్ష్యంగా ప్రకటించింది. ఇదంతా జరగాలంటే రష్యాతో ఆయిల్ కొనరాదని, చైనాతో వ్యాపార సంబంధాలు ఉండరాదని, ముఖ్యంగా బ్రిక్స్ దేశాలలో సఖ్యత వాణిజ్యం తగ్గించుకోవాలని, డాలర్‌కు పోటీగా స్థానిక కరెన్సీలో వాణిజ్యం చేయరాదని అమెరికా కోరుకుంటున్నది. ముఖ్యంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ పరోక్షంగా పాల్గొంటుందని, రష్యాతో ఆయిల్ కొనడం వల్లే రష్యా యుద్ధం చేస్తున్నదని ఆరోపించింది. మన దేశం వీటిని ఖండించినా ప్రతిఘటించడం లేదు. చైనాపై వేసిన సుంకాలకు అమెరికాకు ధీటుగా జవాబు చెప్పి ప్రత్యామ్నాయంగా వేరే దేశాల్లో తన సరుకులు ఎగుమతి చేసుకొని లాభపడుతున్నది. చివరికి వియత్నాం, థారులాండ్ లాంటివి కూడా లాభపడ్డాయి. భారత్ తీవ్రంగా నష్టపోయింది. మన వాణిజ్య సంబంధాలు అమెరికా కన్నా రష్యాతో ఉండడం వల్ల మనకు లాభం కలిగింది. ఈ కాలంలో రష్యాలో ఆయిల్ కొనడం వల్ల మన దేశం చాలా లాభపడింది. 2025 సంవత్సరంలో రోజుకు రెండు మిలియన్ బ్యారెల్స్ ఆయిల్ దిగుమతి చేసుకున్నాము. మొత్తం చమురులో 40 శాతం ఇది. ఒక బ్యారెల్ మీద 15 నుండి 20 డాలర్లు డిస్కౌంట్ లభిస్తున్నది. ఈ సంవత్సరం 3.8 బిలియన్ డాలర్లు అదా చేసుకున్నాం. మొత్తంగా 2022 నుండి ఇప్పటివరకు 10 బిలియన్ డాలర్లు ఆదా అయింది. అంటే మన రూపాయలలో రూ.88,732 కోట్లు. ఇది భారతదేశ స్కూల్ ఎడ్యుకేషన్ బడ్జెట్ కన్నా రూ.10 వేల కోట్లు ఎక్కువే. తెలంగాణ బడ్జెట్‌లో 40శాతం అని చెప్పవచ్చు. రష్యాలో చమురు కొనడం వల్ల మనకు కలిగిన లాభం ఇది. ఈ సొమ్ము కూడా దేశ ప్రజలకు ఉపయోగపడడం కన్నా దేశంలోని అంబానీ లాంటి బడా పెట్టుబడుదారులకు లాభం కలిగింది. రష్యాతో వ్యాపారం వల్ల మిగిలిన సొమ్ములో ఒక రిలయన్స్‌కే



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# దేశ విదేశాల్లో రాణించిన టంగుటూరి

భానుమతి వలెనే టంగుటూరి సూర్యకుమారి కూడా బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆమె నాట్య కారిణి, నటి, గాయని మాత్రమే కాదు మంచి వక్తగా కూడా గుర్తింపు తెచ్చుకుంది, తెలుగు పాటని, తెలుగు భాషని, భారతీయ నృత్యాలను స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం పొంద డానికి ఆవిడ చేసిన కృషి అపూర్వం. అనన్య సామాన్యం. ప్రాచ్య, పాశ్చాత్య నృత్య, సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తినందిన మధురగాయని ఆమె. టంగుటూరి సూర్యకుమారి (నవంబర్ 13, 1925 – ఏప్రిల్ 25, 2005) అలనాటి తెలుగు సినిమా నటి, ప్రసిద్ధ గాయకురాలు. ఆమె నవంబర్13,1925లో రాజమండ్రి లో జన్మించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు తమ్ముడు టంగుటూరి శ్రీరాములు కూతురు. మూడో ఏట నుంచే పాటలుపాడేది. 1937లో మద్రాసు చేరుకుని, పన్నెండు, పదమూడేళ్ళ ప్రాయం లోనే సినీరంగ ప్రవేశము చేసి, 'రైతుబిడ్డ' సినిమాలో నటించింది. 1952లో ఆమె తొలి మద్రాసు అందాల సుందరి (మిస్ మద్రాసు)గా ఎంపికైంది. సూర్యకుమారి రూపం, కంఠస్వరం రెండూ బాగా ఉండడం చేత, అప్పటికే పెదనాన్న ప్రకాశం సభల్లో ప్రార్థన గీతాలు పాడుతూం డడం చేత సినిమావారి పిలుపు వచ్చింది. సాంప్రదాయ నియమ, నిష్టలుగల కుటుంబం కావడం చేత కొంత వ్యతిరేకత ఎదురయ్యింది. సూర్యకుమారి కంఠం, రంగూ, రూపం ఆకర్షణీయంగా ఉన్నా, మామూలు అమ్మాయిల కంటే కొంచెం పొడవుగా ఉండటం చేత, సినిమా రంగంలో సమస్య ఎదురైంది. ఆనాటి సగటు హీరోలు ఆమె కంటే పొట్టిగా ఉండటం కారణం. అదీ కాక ఆమె బ్రాహ్మణ, పేరుపొందిన రాజకీయ కుటుంబం నుంచి రావటమే కాదు, ప్రేమ సన్నివేశాలలో హీరోయిన్ మీద హీరో చెయ్యి వెయ్యడం, ఇత్యాదివి ఒప్పుకొనే వారు కాదు. గొప్ప చాతుర్యం ఉండి కూడా ఆమె సినిమాల్లో సుస్థిరత పొందలేక పోయింది. అయినా సూర్యకుమారి సినిమాల్లోకి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ నాలుగు భాషల్లోనూ మొత్తం ఇరవై ఆరు సినిమాల్లో నటించింది. విప్రనారాయణ' ఆమె తొలిచిత్రం. అదృష్టం, జయప్రద దేవత, చంద్రహాసన, దీనబంధు. భక్త పోతన, భాగ్యలక్ష్మి, కృష్ణప్రేమ, గీతాంజలి, అదృష్ట దీపుడు, మరదలి పెళ్లి, భక్తరామదాసు తదితర తెలుగు చిత్రాల్లో ఉడన్', 'ఖటోలా' తదితర హిందీ చిత్రాల్లో, 'కటకం', 'నేంసారనౌక మొదలైన తమిళ చిత్రాల్లో నటించింది. అలాగే కన్నడ చిత్రం భారతి'లో, ఆంగ్ల చిత్రం 'బాంటే వయిటి లోనూ నటించింది. సూర్యకుమారి, లండన్లో నాట్య ప్రదర్శనలు నిర్వహిస్తూ, కాళికా దేవిగా నాటకాల్లో నటించేది. లలిత గీతాలు యాభై, దేశభక్తి గీతాలు యాభై మొత్తం నూరు గ్రామఫోను రికార్డులు ఇచ్చింది. అలాగే ఒక యాభై దాకా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాల్లో తన గొంతుతో పాడిన పాటల రికార్డులు ఉన్నాయి.నటన కంటే సూర్యకుమారి పాడిన దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, అష్టపదులు వంటివాటికి ఎక్కువ ప్రజాదరణ లభించడంచేత ఆమె పాట కచ్చేరీలు తరుచూ చేస్తూండేది. ఆంధ్రలోని చాలా ఊళ్ళలో లలిత సంగీత కచ్చేరీలు చేసింది. పేరు ప్రతిష్టలు,



ప్రజాదరణ ఆమెకు తృప్తినివ్వ లేదు. ఏదో ప్రత్యేక కృషి చెయ్యాలన్న తపన, మూడు నాలుగేళ్ళపాటు కరతాళ ధ్వనులకు, ప్రశంసలకు దూరంగా ఉండి, చదువుమీద దృష్టి కేంద్రీక రించి, ప్రైవేటుగా కేంబ్రిడ్జి సీనియర్ పరీక్ష వ్రాసి, ప్రథమశ్రేణిలో పాసైంది.పలు భాషా చిత్రాలలో నటించిన సూర్యకుమారి మంచి గాయకు రాలు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయములో మా తెలుగు తల్లికి మల్లెపూదండ, దేశమును ప్రేమించుమన్నా మొదలైన అనేక దేశభక్తి గీతాలు పాడింది. ప్రకాశం పంతులు ఆమె కళాభిరుచిని బాగా ప్రోత్సహించి, శాస్త్రీయ సంగీతం నేర్పించాడు. ఆయన ఏ సభకు వెళ్ళినా ఆమెను తీసుకెళ్ళి జాతీయ గీతాలు పాడించేవాడు. 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్టావతరణ సభలో నెహ్రూ, రాజాజీ, ప్రకాశం ప్రభృతుల సమక్షంలో, వందే మాతరం, మా తెలుగు తల్లికి మల్లె పూదండ పాటలు ఆలపించి అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వీటితో పాటు 'స్వప్నజగతిలో ఛాయావీణ' మొదలైన లలిత గీతాలు, అడవి బాపిరాజు 'ప్రభువు గారికీ దణ్ణం పెట్టూ', 'రావోయి చిన్నవాడా' మొదలైన జానపద గీతాలు కూడా పాడుతుండేది. హెచ్.ఎం.వి. తదితర గ్రామఫోన్ కంపెనీలు ఈమె పాటలను రికార్డు చేశాయి. ఆమె పాడిన పాటలు గ్రాంఫోన్ రికార్డులుగా వెలువడి విరివిగా అమ్ముడు పోయేవి. ప్రత్యేకంగా రాయించుకున్న పాటలు ఆమెతో పాడించి మరీ గ్రామఫోన్ రికార్డులుగా తీసుకు రావడానికి అప్పటి గ్రాంఫోన్ కంపెనీ హెచ్.ఎం.వి. విశేష ఆసక్తి ప్రదర్శించేది, అలా ఆమె పాడిన పాటల్లో జాతీయ గీతాలు, భావగీతాలు, అష్టపదులు ఇలా చాలా రకాలు ఉన్నాయి. శంకరం బాడి సుందరాచారి రచించిన 'మా తెలుగుతల్లికి మల్లె పూదండ..' పాటని ఆమె పెదతండ్రి టంగుటూరి ప్రకాశం పంతులుతో వివిధ రాజకీయ సభల్లో పాడి ప్రాచుర్యం తెచ్చింది. ఆ సభల్లో వక్తగానూ ఆమెకు పేరుండేది. వెండి కంచాలలో వేడి బువ్వుందోయ్, పసిడి కంచాలలో పాల బువ్వుం దోయ్, తిందాము రావోయ్ జాబిలి, ఆడుకుందాము రావోయ్ జాబిలీ' అంటూ నటిస్తూ పాడిన 'దేవత' చిత్రంలోని పాట, నారదుడుగా 'శ్రీకృష్ణ ప్రేమ'లో నటిస్తూ 'రేపే వస్తాడంట గోపాలుడు మాపే వస్తాడంట గోపాలుడు...' ఇలా చాలా పాటలు ప్రజాదరణ పొందాయి. 1958లో భారత చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధుల బృందంలో ఒక ప్రతినిధిగా అమెరికాను సందర్శించి, తన ఉపన్యాసాలతో ఆకట్టుకుంది. అలా వారితో ఏర్పడిన సంబంధాలు 1959లో కొలంబియా యూని వర్సిటీ ట్యూటర్ గా వెళ్లి, పాశ్చాత్య సంగీతం, పాశ్చాత్య నృత్యాల్లో శిక్షణ పొంది వచ్చింది. సూర్యకుమారి ఆరోజుల్లోనే హాలీవుడ్ కి వెళ్లి ప్రముఖ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్ కాక్ వద్ద పని చేసింది. ఇంగ్లండ్లో సిరపడి ప్రముఖ పెయింటర్ హెరాల్డ్ ఎల్విన్ ను వివాహం చేసుకుని ఇండియా పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' అనే సంగీత నాట్య పాఠశాలను నిర్వహించింది. ఇందులో భారతీయ పాశ్చాత్య కళలను, కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, పరస్పర సదవగాహన పెంపొందించం ముఖ్య ఆశయం. 1968లో ఆమె కృషిని బ్రిటిషు రాణి గుర్తించింది. 1969లో గాంధీజీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ సెయింట్ పాల్ కెథెడ్రల్ లో గానం చేసిన ప్రథమ భారతీయ వనిత ఆమె. నార్వే, స్వీడన్, హాలెండ్, స్పెయిన్, కెనడా, అమెరికా మొదలైన పలు దేశాలలో భారతీ య సంగీత శిక్షణాలయాలు నెలకొల్పి, వందలాది కళాకారు లను తయారు చేసింది. అమెరికాలో బ్రాడ్వే థియేటరులో విశ్వకవి రవీంద్రుని 'కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంబర్' నాటకంలో రాణి పాత్ర ధరించి, బ్రాడ్వే అవార్డు పొందిన మొదటి భారతీయ నటి. ఆ నాటకాన్ని న్యూయార్కులో ఎనిమిది నెలల పాటు ప్రదర్శించి, అటు తరువాత ఆఫ్రికాలో నాలుగు నెలలు పర్యటించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసి 'ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛాంజర్' నాటకంలో నటించింది. ఆ నాటకానికి దేశ విదేశాలలో విశేష ఆదరణ లభించడమే కాకుండా విదేశీయుల అభిమానాన్ని కూడా చూర గొ నే అవకాశం కలిగింది. కొలంబియా యూనివర్సిటీలో, లండను యూనివర్సిటీ విద్యా సంస్థలలో, బ్లాక్ థియేటరులోను భారతీయ నృత్యకళ సంగీతంపై వర్క్ షాపులు నిర్వహించింది. 1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఆమె సేవలను గుర్తించి సత్కరించింది. 1979లో రాజ్యలక్ష్మి అవార్డుతో ఆమెను గౌరవించింది. ఆమె ఏప్రిల్ 25, 2005 న లండనులో మరణించింది.

# మధుమేహం పట్ల అప్రమత్తత ఏదీ?

చక్కెర వ్యాధి... ఈ వ్యాధికి పేరులోనే చక్కెర... దాని ఫలితమంతా ఎంతో చేదు. ఆ వ్యాధి వస్తే చక్కెరకు ఇక దాదాపుగా దూరమైపోయినట్లే. షుగర్ వ్యాధిని ఆధునిక యుగపు మహమ్మారిగా భావించవచ్చు. అత్యంత వేగంగా పరుగెడుతున్న కాలంతో పాటే అనివార్యంగా జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పులే షుగర్ వ్యాధికి అసలు కారణం. మౌలికంగా ఇది జీవన శైలి సమస్య.వేదకాలంలో మధుమేహ ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని 'అశ్రవ' అనే పేరుతో గుర్తించారు.ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత, శుశ్రవ సంహిత, నాగభట్ట గ్రంథాలలో వివరించారు. క్రీస్తు శకానికి వెయ్యి సంవత్సరాల కిందటనే ఈ వ్యాధి వర్ణన ఉండడం విశేషం. యజ్ఞ సమయాలలో దేవతలకు సమర్పించే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు పేర్కొన్నారు. దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్టాంగ హృదయ అనే గ్రంథంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్థుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన. 1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధిని పత్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచవచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం. అంత ర్జాతీయ మధు మేహ సమాఖ్య, ప్రపంచ ఆరోగ్య సంస్థలు 1991 నుండి ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదిని మధుమేహ దినంగా పాటిస్తున్నాయి. 1922లో ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బేంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న మధుమేహ దినంగా పాటిస్తున్నారు. 2006 డిసెంబర్ 20న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లి ఆమోదించిన తీర్మానం ప్రకారం మధుమేహ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, ఆందోళనకర దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి 2007నుండి మధుమేహ దినాన్ని ప్రజల్లో అవగాహం , చైతన్యం పెంచే కార్యక్రమాలతో సభ్యదేశాలన్ని అధికారికంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. డయాబెటీస్ ఎలా వస్తుంది , దానివలం వచ్చే ముప్పు ఏమిటి , రాకుండా ఏమి చేయాలి , వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీలుకోవాలి అనే అంశాలను ప్రచారము చేసే ప్రయత్నమే ఈ డయాబెటిక్ డే ముఖ్య ఉద్దేశము. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. మధుమేహ సమస్య భారత్‌లో అత్యధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో 15 కోట్ల మంది, దేశంలో 4 కోట్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. 2025 నాటికి భారత దేశంలో ఈ వ్యాధిపీడితుల సంఖ్య 7 కోట్లకు చేరుకోగలదని భావిస్తున్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో



పోలిస్తే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది. మధుమేహం కారణంగా ప్రతీ నిమిషానికి ఆరుగురు మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 20 మరణాల్లో ఒకటి మధుమేహం కారణంగానే చోటు చేసుకుంటున్నది. మధుమేహం, సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మంది మరణిస్తున్నారు. మధుమేహం ను నిశ్శబ్దహంతకిగా అభివర్ణిస్తారు. దీన్ని నివారించడం అంత తేలిక కానప్పటికీ, కొన్ని రకాల విధివిధానాలు పాటించడం ద్వారా దీన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యభాషలో "డయాబెటిస్ మెల్లిటస్" అని వ్యవహరిస్తారు. డయాబెటిస్ అని కూడా వ్యవహరించే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. అతిమూత్రం (పాలీయూరియా), దాహం ఎక్కువగా వేయడం (పాలీడిప్సియా), అతిగా ఆకలి వేయడము (పాలీ ఫేజియా), మంద గించిన చూపు, కారణం లేకుండా బరువు తగ్గడం, బద్ధకం దీని ముఖ్య లక్షణాలు. మధు మేహం లేదా చక్కెర వ్యాధిని సాధారణంగా రక్తంలో మితి మీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో అత్యధికంగా ఈ వ్యాధి ప్రబలి ఉన్నది. ఈ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు లేవు. జీవితాంతం తగిన జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే దీన్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యం. 1921లో ఇన్సున్ అందుబాటులోకి రావడంతో అన్ని రకాలను నియంత్రించడం సాధ్యమయ్యింది. ఆహార అలవాట్ల మార్పు కూడా భాగమయినప్పటికీ, ఇన్సులిన్ ఉత్పత్తి లేని మొదటి రకాన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వటం తప్పనిసరి మార్గం. రెండవ రకం ఆహార అలవాట్ల మార్పు, ఆంటీ డయాబెటిక్ మందుల వాడకం వల్ల, అప్పుడప్పుడు ఇన్సులిన్ వాడకం వల్ల నియంత్రించవచ్చు. చక్కెర శాతం 400 మి.గ్రా. కన్నా ఎక్కువ కావడం...దీనినే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అని కూడా అంటారు. ఈ స్థితిలో ఎక్కువగా దాహం, నాలుక తడారి పోవడం, మత్తుగా ఉండడం, వాంతులు, పొత్తి కడుపునొప్పి, తలనొ ప్పి, తలతిరగడం, విపరీతమైన నీరసం, ఒళ్ళు నొప్పులు లక్షణాలుగా ఉంటాయి. ఈ సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ దశలో కూడా తాత్సారం చేస్తే మరణానికి దారి తీయవచ్చు. రక్తంలో చక్కెర శాతం 60 మి.గ్రా కన్నా తగ్గడం..షుగర్ లేదా హైపోగ్లైసి మియా అంటారు. మధుమేహ వ్యాధిని రక్త, మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. సాధారణంగా రక్తంలో చక్కెర శాతం 80 నుంచి 140 మి.గ్రా వరకు ఉంటుంది. ఇంత కన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. ఖాళీ కడుపుతో ఉన్న ప్పుడు చక్కెర శాతం 60 నుంచి 90 ఎంజీ / డీఎల్, తిన్న తరువాత 110 నుంచి 140 ఎంజీ / డీఎల్ ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. చక్కెర వ్యాధికి ఆయుర్వేద మందులు కూడా ఉన్నాయి. భారతీయ ఆహారంలో తీపి, ఉప్పు, పులుపు, వగరు, చేదు, కారం లాంటి ఆరు రుచుల గురించి ప్రధానంగా పేర్కొన్నారు. ఆహారంలో తప్పని సరిగా ఆరు రుచులు ఉండాలన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కారం, వగరు, చేదు, రసాలు కలిగిన కూరగాయలు బాగా తీసుకోవలసి ఉంటుంది. శక్తిని ఇచ్చే అన్నం ఎక్కువగా తీసుకోకుండా, పొట్టు కలిగిన జొన్నరొట్టె, గోధుమ పుల్కాలు, సజ్జ రొట్టె తీసుకుంటే రక్తంలో చక్కెర శాతం పెరగకుండా ఉంటుంది. అలజడి, కోపం తగ్గించుకొని మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. యోగా, ధ్యానం, నడక లాంటివి చక్కెర వ్యాధి రాకుండా నిరోధిస్తాయి.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 14 నవంబర్ 2025
www.viswamvoice.com





# కలెక్టరేట్ నందు నవంబర్ 18న జాబ్ మేళా : కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జోయా లుకాస్ జ్యూవెలరీ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీ చేయుటకై ఈనెల 18 వ తేదీ మంగళ వారం స్థానిక కలెక్టరేట్లోని వికాస కార్యాలయం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్న ట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు జోయా లుకాస్ జ్యూవెలరీలో సేల్స్ ఎగ్జిక్యూ టివ్స్ పోస్టుల కోసం భర్తీ జాబ్ మేళా జరుగుతోంద న్నారు. ఈ జాబ్ మేళాలో ఫ్రెషర్లు, అనుభవం ఉన్న వారు రెండూ రిక్రూట్ మెంట్ల కొరకు దర ఖాస్తు చేసుకోవచ్చునన్నారు.స్థానిక పట్టణంలో నూతనంగా ప్రారంభించనున్న జోయాలుకాస్ జ్యూవెలరీ బ్రాంచ్ నందు పనిచేయుటకుగాను సేల్స్ ఎగ్జిక్యూ టివ్ పోస్టులకు 200 వరకు ఖాళీలు ఉన్నాయన్నారు ఫ్రెషర్లు, అనుభవ జ్ఞులు ఇద్దరూ దరఖాస్తు చేసుకొనవచ్చునన్నారు డిగ్రీ, లేదా సమానమైన డిప్లొమా కలిగి ఉండాలన్నారు. పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకొ నవచ్చు నన్నారు ఎంపిక విధానం వాక్-ఇన్ ఇంటర్వ్యూల ద్వారా జ్యూవెలరీ నేరుగా ఇంట ర్వ్యూకు హాజరు కావచ్చును న్నారు.రిక్రూట్మెంట్ డ్రైవ్ ద్వారా సేల్స్ ఎగ్జి క్యూటివ్ పోస్టులు నింపడం జరుగు తుందన్నారు.విద్యార్హత ధ్రువపత్రాలు ఆధార్ నేటివిటీ ఎక్స్పీరియన్స్ తదితర ధ్రువ పత్రాలు తప్పనిసరిగా తీసుకుని వచ్చి ఈనెల 18 న మంగళ వారం ఉదయం 10 గంటలకు వికాస కార్యాలయా నికి హాజరు కావాలన్నారు.నిరుపేద,చిన్న పట్టణాల అభ్యర్థులకు మంచి అవకాశమన్నారు ప్రారంభ జీతం రూ 20 వేల నుండిరూ 32వేల వరకు ఉంటుందన్నారు వీటితో పాటుమెడికల్ బెనెఫిట్స్, పిఎఫ్ అలవెన్సెస్, ప్రమోషన్ అవకా శాల్లో మెరుగైన వాతావరణం ఉందన్నారు.ఉద్యోగం సురక్షితంగా, అధిక వృద్ధి అవకాశా లతో ఉంటుం దన్నారు. మరిన్ని వివరాల కొరకు జోయా లుకాస్ వెబ్సైట్ నందు సంప్రదించి తెలుసుకొన వచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఇ వో సేభాష్టియన్, వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు లేక మృతదేహాన్ని తీసుకెళ్లడంలో

# ప్రజలు అవస్థలు ...

### పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామంలో ఎవరైనా చనిపోయిన మృతదేహాలను స్మశానానికి మోసుకుని వెళ్లాలంటే నరకం అనుభవించడం తప్పడం లేదని తమ గోడు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు ఓట్లు వేసి మమ్మల్ని గెలిపిస్తే మీ గ్రామాలు అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేస్తారు,హామీలు ఇస్తారు.గెలిచిన తరవాత ప్రజల సమస్యలు పట్టించుకోరు అని ఆరోపిస్తున్నారు.ఒక పక్క పంట బోదు, మరో పక్క ఆక్వా చెరువులు మధ్యలో రహదారి స్థలం ఉన్న రోడ్డు సదుపాయం లేకపోవడం వలన ప్రజలు చనిపోయిన మృత దేహాలను తీసుకెళ్లడం లోని రైతులు కొబ్బరి, ఆక్వా సాగు చేసిన సరుకు తెచ్చుకోవడం లోని ఇబ్బందులు పడుతున్నారు. ఒక చనిపోయిన మృతదేహాన్ని మోకాళ్ల లోతు గొయ్యల్లో వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు పడుతూ మృత దేహాన్ని తీసుకెళ్తున్నారు. ఇప్పటికైనా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మించాలని దేవగుప్తం, డి.రావులపాలెం ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనే

# ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించిన వైయస్సార్సీపి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం నియోజకవర్గంలో రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వ నిర్ణయాన్ని, ప్రజల ఆస్తులు ప్రజలకే దక్కాలనే ఉద్దేశ్యంతో శాంతియుతంగా తహసిల్దార్కి రిప్రజెంటేషన్ ఇవ్వడానికి బయలుదేరిన కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, పి.గన్నవరంలో నాలుగు మండలాలు వైయస్ఆర్సీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం, ఫోన్లు స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలను నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం వైఎస్ఆర్సిపి అంబాజీపేట మండల అధ్యక్షులు విత్తనాల శేఖర్ నివాస గృహం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గ వైకాపా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా హక్కుల కోసం పోరాడేవారిని అణచివేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, పేదలు వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. సీఎం రిలీఫ్ ఫండ్లో అవినీతి జరుగుతోందని, ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను వాడుతున్నారని చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల ఆస్తులను రక్షించాలని, మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కి జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.

**ఇళ్ల పట్టాలు గృహప్రవేశాలపై వ్యాఖ్యలు**

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కాలంలో 32 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని గుర్తుచేసి, ఇప్పుడు అదే ఇళ్లలో ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇళ్లకు తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లి "సామూహిక గృహప్రవేశాలు చేశామని" చెప్పుకోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. "మీరు నిజంగా ప్రజల పక్షాన ఉంటే, జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన స్థలాల్లాగే మీరు కూడా అంతమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వండి," అని చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు ప్రజా ప్రయోజనాల కోసం జరుపుతున్న ఉద్యమాలపై పోలీసుల దమనకాండను నిలిపివేయాలని, మెడికల్ కాలేజీలను ప్రజల ఆస్తులుగానే కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యే పాములరాజేశ్వరి, పీకే రావు, కొర్లపాటి కోట బాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి హరి, ఎంఎం శెట్టి, చెట్ల రామారావు, నీతి పూడి విలసిత మంగతాయారు, బెల్లం ప్రసాద్, సుదాబత్తుల రాము, కుడిపూడి ప్రభాకర్, యన్నబత్తుల ఆనంద్, పి.గన్నవరం నియోజకవర్గ 4 మండలాల వైయస్ఆర్సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి...

### ద్వారపూడి గ్రామ వైఎస్ఆర్సీపీ నూతన కమిటీ నియామకం




**ద్వారపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, పి.ఏ.సి కమిటి మెంబర్ మరియు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులతో సమావేశమై నూతన కమిటీని నియమించడం జరిగింది. గ్రామ అధ్యక్షునిగా యరగతపు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సత్తి సత్తిబాబు, కొమరపు సంజీవ లను నియమించారన్నారు. ప్రధాన కార్యదర్శులుగా నామాల పెద్ద వెంకన్న, చింతలపూడి ఈశ్వరుడు, తలాడి గౌరీ నాయుడు, తాండ సత్తిబాబు, మహమ్మద్ అమీర్, బడుగు రాజు లతో పాటు కార్యదర్శులు గా యాతం వీరభద్రరావు, సుబ్బరాజు, కొత్త వీరభద్రరావు, గుర్రాని శ్రీను, కేవీ రమణ, పైడిమల్ల గౌతమ్, పుట్టపూడి సత్తిబాబు లను నియమించారన్నారు. గ్రామ బీసీ సెల్ అధ్యక్షులు పాంద్రంకి జతాదరుడు, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు తిర్రి వరప్రసాద్, గ్రామ సోషల్ మీడియా అధ్యక్షులు పలివెల సుబ్బారావు, గ్రామ విద్యార్థి విభాగం అధ్యక్షులు మామిడి అజయ్ కుమార్, రైతు విభాగం అధ్యక్షులు లక్ష్మీ బంగారు రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు గుర్రాని ఉమాదేవి, గ్రామ యువజన విభాగ అధ్యక్షులు నామాల దుర్గాప్రసాద్ లు నియమితులైనట్లు ప్రధాన కార్యాలయం నుండి తెలిపారు. నియమితులైన గ్రామ కమిటి, అనుబంధ విభాగాల అధ్యక్షులను మరియు సభ్యులకు తోట త్రిమూర్తులు శుభాకాంక్షలు తెలిపి పార్టీ పూర్వవైభవానికి కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తోట నాయకత్వంలో పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

### మంచినీరు పేరుతో

# ఉప్పునీరు రొయ్యల సాగు...

### ఫిర్యాదు చేసిన స్పందించని అధికారులు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో మంచినీరు పేరుతో ఉప్పునీరు రొయ్యల సాగు చేస్తున్నారు. దానివల్ల తమ పంట పొలాలు నష్టం జరుగుతుందని 2019 నుండి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదులు చేయడం ఇప్పుటి వరకు జరుగుతుందనీ, ఉప్పునీరు బోర్లను తొలగించకుండా రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు కాలయాపన చేస్తున్నారు అని అన్నారు. దాని వల్లన లక్షలాది రూపాయలు భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంది. ప్రతి సోమవారం ఉప్పునీరు బోర్లను తొలగించాలని అధికారులకు తుమ్మలపల్లి రైతులు ఫిర్యాదులు చేస్తూ ఉన్నారు. ఉప్పునీటి బోర్డులు మాత్రం తొలగించట్లేదు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని రైతులు నాగా బత్తుల గణపతి రావు తోపాటు రైతులు కోరుతున్నారు.

# అమలాపురంలో ఘనంగా దయ దినోత్సవ వేడుకలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచం దయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అనాతవరం సంసిద్ స్కూల్ విద్యార్థులు అమలాపురం హరిమనోవికాస కేంద్రం లోని విద్యార్థులకు ఫ్రూట్స్ మరియు కిరాణా సామాగ్రిని గురువారం పంపిణీ చేసారు. సంసిద్ మూల లక్ష్యాలు అయిన ప్రేమ, దయ, కరుణల విలువలు విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. సంసిద్ స్కూల్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు, డైరెక్టర్ వాసా మాధవి, సీఈఓ ఇందు సాను, సంసిద్ స్కూల్ యాజమాణ్యానికి హరిమనోవికాస కేంద్రం మేనేజర్ అశోక్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంసిద్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పలపాటి జానికయమ్మ అన్నదాన సత్రం

# కార్తీక వన సమారాధన



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లారావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలోని శ్రీ ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం నేతృత్వంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, స్థానిక స్కూల్ విద్యార్థులకు స్కాలర్షిప్లను అందజేశారు. గ్రామాభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని సంజీవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ తో ఆకుల రామకృష్ణ, చిలువూరు సతీష్ రాజు, పొడగట్లపల్లి గ్రామ నాయకులు, సత్రం చైర్మన్ గోపిశెట్టి సత్తిబాబు, పిఎసిఎస్ చైర్మన్ అల్లూరి కృష్ణంరాజు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకం చేసిన కౌన్సిలర్ మహాలక్ష్మి...

### అడుగడుగునా కూటమీ పిపిపికి ఎదురుదెబ్బ...

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండపేటలో ఉత్సాహంగా కొనసాగుతోంది. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతోంది. మండపేట నియోజకవర్గంలో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో వైసీపీ కౌన్సిలర్లు, ఆయా వార్డుల ఇన్చార్జిలు ప్రతీ ఇంటిని సందర్శించి ప్రజలు, విద్యార్థుల నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కళాశాలలు కొనసాగాలని కోరుతూ మద్దతూ సంతకాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో 12వ వార్డు ఇన్చార్జి శిరంగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆ వార్డు కౌన్సిలర్ మలసాని సీతా మహాలక్ష్మి నివాసాన్ని సందర్శించి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని ఆమెకు వివరించగా సీతామహాలక్ష్మి ఏకీభవిస్తూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మద్దతు సంతకం చేశారు. ఎన్నికల తరువాత అధికార కూటమి ప్రభుత్వం వైపు మొగ్గు చూపి టీడీపీ తీర్థం పుచ్చుకున్న మహాలక్ష్మి ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం స్థానిక కూటమి నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది.



కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి యాంద్ర ప్రభాకరరావు, జిల్లా పార్టీ సెక్రటరీ టేకిముడి శ్రీనివాస్, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ జొన్నపల్లి సత్తిబాబు, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ వీరి కిరణ్ కుమార్ గౌడ్, పలివెల ప్రసాద్, చిన్న, జి.మహేష్, వంశీ, ఫణి, పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన

### రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.మాధవి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక మండల పరిధి లో నగరం 1 అండ్ 2, గెద్దాడ గ్రామాలలో ఓఎన్జీసి అద్దె స్థలాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మెటీరియల్ స్టోర్స్,ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ కేంద్రాల ఏర్పాటు కొరకు ప్రాథమిక పరిశీలన చేసినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారిని కె.మాధవి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిధిలో నగరం గెద్దాడ గ్రామాలలో రాష్ట్ర తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో కలిసి ఆర్డిఓ తాసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సర్వేయర్లు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు మెటీరియల్ స్టోర్ కొరకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షకు ఇంజనీర్ బి.రాజేశ్వరి, తాసిల్దార్ సునీల్ కుమార్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



### తుని జనసేన పార్టీ అస్థిరతకు

# చోడిశెట్టి గణేష్ కుట్ర...!



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** తుని జనసేన పార్టీ అస్థిరతకు నిత్యం తన శాయశక్తులా కృషి చేస్తున్న పార్టీ కాంటాక్ట్ పర్సన్ చోడిశెట్టి గణేష్ చేస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తుని జనసేన పార్టీ ముక్త కంఠంతో ఖండిస్తున్నది. పార్టీలో ఉంటూనే పార్టీ లక్ష్యానికి గండి కొడుతూ పార్టీలో అంతర్గత కృత్రిమ కలహాలను సృష్టిస్తున్న చోడిశెట్టి గణేష్ ను తన అంతర్గత శత్రువుగా తుని జనసేన పార్టీ భావిస్తోంది. చోడిశెట్టి గణేష్ తన వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాల కోసం తుని జనసేన పార్టీ సామూహిక ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, పార్టీ ప్రతిష్టను మంటగలుపు తున్నాడు. జనసేన పార్టీలోకి చేరక ముందు నుంచీ కూడా కాకినాడ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు అనుకూలంగా మెలుగుతూ, వారితో మద్యం వ్యాపారం లావాదేవీల్లో అంతర్గత భాగస్వామిగా ఉంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాతో ఉన్న లోపాయికారీ ఒప్పందం మేరకు జనసేనలోనే ఉంటూ ఒక పక్క జనసేన పార్టీని అస్థిరత్వానికి గురిచేస్తూ మరో పక్క ఎన్.డి.ఎ. కూటమి పాలనను కూడా అప్రతిష్ట పాలు చేయడానికి అర్థ రహితమైన, రుజువులకు నిలబడని నిందారోపణలు చేస్తూ పార్టీలో వెగటు పుట్టిస్తూ, పక్కలో బళ్ళెం లాంటి అంతర్గత శత్రువైన చోడిశెట్టి గణేష్ పార్టీ వ్యతిరేక చర్యలను ఇకపై నియోజకవర్గ జనసేన పార్టీ సహించబోదని పార్టీ ప్రకటించింది. ఇతని రాజకీయ అరాచకాల చిట్టా విప్పితే అంతూ దరి ఉండదు. కూటమిలోని జనసేన పార్టీలో కాంటాక్ట్ పర్సన్ గా ఉండి కూడా 2024 తుని శాసనసభ ఎన్నికల్లో యనమల దివ్య ఓడిపోతారని జనసేన పార్టీ వారితోనే పందెం వేసి ఓడి అప్రతిష్ట పాలయ్యాడు. కూటమిలో ఉంటూనే వైసీపీ నాయకులతో జతకట్టి వైసీపీకి మద్దతుగా నిలిచిన గణేష్ చేస్తున్నది ముమ్మాటికీ రాజకీయ వ్యభిచారమే. కూటమిలో ఉంటూనే వైసీపీ నాయకులతో బ్రాందీ షాపుల మద్యం సిండికేట్ వ్యాపార లావాదేవీలను ఇప్పటికీ నడుపుతూ అధిక మొత్తం సొమ్మును ఆశించిన చోడిశెట్టి గణేష అక్కడ కూడా కొంత చెరుపు తెచ్చుకున్నాడు. కూటమిలో ఉండి జనసేన పార్టీ తరపున పని చేస్తున్నానని చోడిశెట్టి గణేష్ తనకు తానుగా చెప్పుకోవడమే తప్ప నిజానికి తాను ఏ ఒక్క రోజు కూడా జనసేన పార్టీ తరపున కూటమికి మద్దతుగా పని చేయలేదు. ఇతను చేస్తున్న తప్పులు ప్రజలకు తెలియవు అనుకుని శ్రీరంగ నీతులు చెప్పుతన్న నయా గురువింద పూసే ఈ గణేష్. ఇతని మాటలను పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలూ ఖాతరు చెయ్యాల్సిన పని లేదని తుని నియోజకవర్గ జనసే పార్టీ ప్రకటించింది. జనసేన పార్టీ నాయకుడినని చెప్పుకుంటూ చోడిశెట్టి గణేష్ ఇటీవల తునిలో జనసేన ఆత్మీయ సమావేశాన్ని తనంత తానుగా నిర్వహించి కూటమిలోని టీడీపీ సీనియర్ నాయక, మాజీ మంత్రి యనమల రామ కృష్ణుడుని శాసన సభ్యురాలు యనమల దివ్యను ఉద్దేశించి లేనిపోని వ్యాఖ్యలు చేసి కూటమిలో అపోహలకు తావిచ్చిన మహా ఘనుడు. తుని నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయం గురించి గానీ ఏదైనా విషయం గురించి యనమల రామకృష్ణుడుకు, యనమల దివ్యకూ నేను అనేక సార్లు చెప్పినా వాళ్ళు పట్టించు కోవటం లేదు. ఇదే విషయాన్ని జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబుకి, కాకినాడ జిల్లా ఎంపీ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కీ చెప్పినా కూడా వారు కూడా పట్టించుకోవడం లేదని వారి పైన కూడా మొన్న తుని సమావేశంలో గణేష్ నోరు పారేసు కున్నాడు. అంతే కాకుండా ఈ ఆత్మీయ సమావేశంలో కూడా లోకల్ నాన్ లోకల్ అంటూ జనసేన నాయకుల్లోనే చీలికలు తెస్తూ మాట్లడాడు. ఇలానే తుని నియోజకవర్గంలో మండల నాయకులు దగ్గర నుంచి కింద స్థాయి నాయకులు వరకు కూడా ఇతను లేనిపోని ఆరోపణ చేస్తూ రోజూ ఏదో గొడవ పెడుతూ కూటమిలో ఏదో అన్యాయం జరిగిపోతోందని లేనిపోని అపోహలు, అనుమానాలు సృష్టించడమే పనిగా పెట్టుకొన్నాడు గణేష్. వైసీపీకి తొత్తుగా మారిన ఇతను డైరెక్టుగా ఇన్ డైరెక్టుగా వారితో పని చేయించు కుంటున్నాడు. పార్టీ పదవిని ఉపయోగించుకుంటూనే జనసేన పార్టీని నాశనం చేసే కుట్రలో భాగంగానే ఇతను సొంత ఎజెండాతో వ్యక్తిగతంగా ముందుకు వెళ్తున్నాడు. అయితే ఈ విషయాన్ని గమనించిన మరి కొందరు జనసేన నాయకులు ఇతని వ్యాఖ్యలను, తీరునూ ఖండిస్తుంటే వారిపై కూడా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడు ఈ చోడిశెట్టి గణేష్. తుని నియోజకవర్గంలో చోడిశెట్టి గణేష్ ని కూటమి ప్రభుత్వంలోని టిడిపి, బీజేపీ నాయకులు ఇతన్ని లెక్కచేయట్లేదంటే దానికి కారణం ఇతను చేస్తున్న కూటమి పార్టీల, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు, విధానాలూ, తప్పిదాలే దానికి కారణం. అంతే కాదు జనసేన పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, వీర మహిళలు, అభిమానులు అందరూ కూడా ఇతను చేస్తున్న తప్పులకు భారీగా నష్టపోయే పరిస్థితి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే చోడిశెట్టి గణేష్ తప్పిదాల వల్లనే ఈయనకి గౌరవం ఇవ్వడం లేదనే విషయం చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ విషయాల్లో ఏదీ కూడా నిజం కాదని చోడిశెట్టి గణేష్ నిరూపించు కోవాలని తుని కూటమి నాయకులు, పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇతని వ్యక్తిగత ప్రయోజనాల కోసం సొంత స్వలాభం కోసం కూటమిలో లేనిపోని ఆరోపణ చేసి జనసేనలో చీలికలు తీసుకొచ్చే పరిస్థితిని కల్పించిన చోడిశెట్టి గణేష్ ను పార్టీకి దూరం పెట్టాలని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు తుని సేన విజ్ఞప్తి చేయనున్నది.!

### అనాథ కుటుంబాన్ని

## ఆదుకున్న తలపంటి బుజ్జి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, నెల్లిపూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) తన సామాజిక సేవా పరంపర సంప్రదాయాన్ని కొన్నేళ్లుగా యధావిధిగా కొనసాగిస్తూనే ఉన్నారు. తన స్వగ్రామం నెల్లిపూడిలో ఎవరికి ఏ సమయంలోనైనా సరే ఏ కష్టం, నష్టం వచ్చినా పార్టీలు, సామాజిక వర్గాల పట్టింపులకు అతీతంగా ఎన్.డి.ఏ. భాగస్వామ్య ఉమ్మడి పార్టీల్లోని తోటి తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీల కన్నా మిన్నగా ముందుగానే జనసేన పార్టీ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలను సాహసంతో బుజ్జి ఎంతో వ్యయంతో ఓపికగా కొనసాగిస్తూ ఉన్నారు. ఆపన్నుల పాలిట బుజ్జి ఓ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం తాజాగా మరో కుటుంబాన్ని బుజ్జి ఆదుకున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పల్లేటి అర్జునుడు ఇటీవల కాలంలో మూత్రపిండాల అనారోగ్యంతో అకాలంగా కాలం చేశారు. ఇతనికి భార్య సోనియా, కుమారుడు రాంబాబు ఉన్నారు. ఈ కుటుంబ ఏకైక పోషకుడు అర్జునుడి అకాల మరణంతో కుటుంబ సభ్యుల జీవనం కష్టతరమైంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మీకు నేను తోడున్నానంటూ బుజ్జి ఆ కుటుంబానికి ఆపన్న హస్తం అందించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లీ, కుమారుల ఇంటికి తన కార్యకర్తలతో చేరుకుని దుఃఖి?తులను పరామర్శించారు. మీకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ధైర్య వచనాలు చెప్పారు. అంతే గాకుండా ఆ కుటుంబానికి తక్షణ ఉపశమన సాయంగా తన సొంత సొమ్ముల నుంచి 50 కేజీల బియ్యాన్ని, తగిన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బుజ్జి వెంట తలపంటి వీరబాబు, పాస్టర్ మోషే, నొప్పి వీరబాబు, నొక్కి కొండయ్య, మద్దిల రాజు, మద్దిల బాబ్జి, జక్కల రమణ, బండి నాగేశ్వరరావు ఉన్నారు.

## ముందుగానే పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

### పాడేరు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,బాలికల ఆశ్రమ పాఠశాల, ఏపీ ఆర్ఎస్ ఎర్రంపేట ,మోతుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లలో మార్చి 2026 లో 10వ తరగతి పరీక్షలు జరిగే పరీక్ష కేంద్రాలను పాడేరు అసిస్టెంట్ కమిషనర్ శశి కుమార్ సందర్శించి పరీక్షా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఉన్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసినారు, పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులతో, సమావేశమై ఈ సంవత్సరం మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత పొందడానికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల విద్యాశాఖ అధికారి జి.వెంకటేశ్వర్లు, కూనవరం మండల విద్యాశాఖ అధికారి టి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : పంచాయితీ సెక్రటరీ ప్రసాద్



**నెల్లిపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లిపాక పంచాయితీ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించిన నెల్లిపాక పంచాయితీ సెక్రటరీ ప్రసాద్ తన సిబ్బందితోటి శుభ్రం చేయించడం జరిగింది.అదేవిధంగా చెట్లు,పొదలతో ఉన్న ప్రదేశాలను కూడా శుభ్రం చేయించారు. పంచాయితీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

### వెదురును ఓసారి సాగుచేస్తే

# 40 ఏళ్ళ పాటు దిగుబడి...!

ఒక ఎకరాకు రెండేళ్ళకు రూ. 24,000 రాయితీ

సాగులో అంతరపంటలతో అదనపు ఆదాయం

నాలుగు రకాల వెదురు జాతులు సాగుకు సిద్ధం

రాజమండ్రి అటవీ శాస్త్రవేత్త నాగప్రతాప్ వెల్లడి




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలు, కమతాల్లో వెదురును ప్రధాన పంటగా, చుట్టూ రక్షణ పంటగా సాగు చేసుకుంటే మూడో సంవత్సరం నుంచే పంట దిగుబడిని పొందొచ్చని రాజమ హేంద్రవరం ప్రాంతీయ అటవీ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త నాగప్రతాప్ తెలిపారు. తక్కువ పెట్టుబడితోనే వెదురు సాగు పూర్తవుతుందని, ఆపై 40 సంవత్సరాల వరకు ప్రతి ఏటా పంటను కోత కోసుకొని మార్కెటింగ్ చేయవచ్చని ఆయన వివరించారు. జాతీయ వెదురు (నేషనల్ బాంబూ) మిషన్ పథకంలో కాకినాడ జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియో జకవర్గం శంఖవరం మండలం పెదమల్లాపురం లోని అల్లూరి సీతా రామరాజు కళా వేదిక వద్ద స్థానిక ఔత్సాహిక రైతులకు వెదురు సాగు విధానం, వెదురు పంటల రకాలు, మార్కెటింగు అవకాశాలపై వగాహనకు రైతు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య వక్తగా శాస్త్రవేత్త నాగప్రతాప్ ప్రసం గించారు. ఒక ఎకరం పొలంలో 5×5 మీటర్ల దూరంలో 160 వెదురు మొక్కలను నాటు కోవచ్చని, వెదురు సాగులో చీడ పీడలు తక్కువని, అందువల్ల సస్యరక్షణ వ్యయం కూడా పెద్దగా ఏం ఉండదని చెప్పారు. వెదురు పంట వేసిన 2 సంవత్సరాల వరకు అంతర పంటలుగా అల్లం, పసుపు, అశ్వగంధ వంటి ఔషధ మొక్కలు వేసుకొని, అదనపు ఆదాయం పొందొచ్చు అన్నారు. ప్రస్తుతం రైతులు విరివిగా సాగు చేస్తున్న సరుగుడు పంట కంటే వెదురు పంట సాగు చాలా లాభదాయకమని వివరించారు. రాజమండ్రి అటవీ పరిశోధన స్థానంలో నాలుగు రకాల వెదురు జాతుల మొక్కలు రైతులు సాగుచేసు కునేందుకు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఉద్యాన శాఖ ద్వారా వెదురు సాగు చేయటానికి రైతులకు మొదటి రెండేళ్ళకూ కలిపి ఎకరానికి రూ. 24,000 ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రాయితీగా ఇస్తోందని తెలిపారు. సాగైన వెదురు బొంగులను కొనుగోలు చేసేందుకు ప్రైవేటు సంస్థలతో పాటు కాకినాడ, రాజమహేంద్రవరంలలో వెదురు కొనుగోలు, మార్కెటింగు కేంద్రాల సౌకర్యం కూడా అం దుబాటులో ఉన్నాయనీ, అందువల్ల ఔత్సాహిక రైతులు అందరూ నిస్సందేహంగా భేషుగ్గా వెదురు మొక్కలను సాగు చేయాలని రాజ మహేంద్రవరం ప్రాంతీయ అటవీ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త నాగప్రతాప్ పిలుపును ఇచ్చారు. మామిడి, జీడి మామిడి తోటల్లో పూత, కాయ దశల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టి నట్లయితే నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. చల్లా వెంకట నరసింహరావు తెలిపారు. జీడిమామిడిలో కొత్త చిగురు వేసేటప్పుడు మోనోక్రోటోఫాస్ 1.6 మి లీ, పూత సమయంలో లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ , బటాణి గింజ దశలో ప్రొఫెనోఫాస్ 2 మిలీ, కార్బన్డిజం 1 గ్రాము చొప్పున 1 లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి అన్నారు. శంఖవరం మండల ఉద్యానవన శాఖ అధికారిణి కె.దివ్యశ్రీ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉద్యాన సహాయకులు శ్యామ్ సుందర్ (గొంధి కొత్తపల్లి), సువర్ణ రాజు, ప్రసాద్, సత్యనారాయణ, రాజు, గోవింద రాజులు, గ్రామ పెద్దలు చెంచుబాబు, అభ్యుదయ రైతులు నాగేశ్వరావు, రైతులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల ధర్నా పోస్టర్ విడుదల

**కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి...**

**భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, ఏపీ డీసీఎం పవన్ స్పందించాలి...**

**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కరానికై నవంబర్ 20 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగబోయే ధర్నా ను జయప్రదం చేయాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సిహెచ్ రాజకుమార్ అన్నారు. గురువారం పిఠాపురం నందూరి ప్రసాదరావు భవన్ లో మూడు మండలాల కార్మిక సంఘం ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిహెచ్ రాజ్ కుమార్ హాజరయ్యి మాట్లాడుతూ నిర్మాణారంగ కార్మికుల సంక్షేమ బోర్డ్ ను తక్షణమే పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేసి, పెండింగ్ క్లైములు పరిహారాలు విడుదల చేయాలని, 50 ఏళ్లు పైబడిన కార్మికులకు పెన్షన్ అమలు చేసి, ఇంటి నిర్మాణాలకు స్థలాలు, రుణాలు మంజూరు చేయడంతో పాటుగా తదితర సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 20 తేదీన కాకినాడ కలెక్టర్




కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పిఠాపురం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రెసిడెంట్ పప్పుల వీరబాబు, యు కొత్తపల్లి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రెసిడెంట్ సిహెచ్ సాంబశివ, భవన నిర్మాణ సంఘం జిల్లా కోశాధికారి నందీశ్వరరావు, పిఠాపురం మండలం కార్పెంటర్స్ యూనియన్ సెక్రెటరీ జి.వీర బాబు, గౌరవ సలహాదారి కె విశ్వనాథం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటి మెంబర్ వి.సత్యనారాయణ, సిఐటియు పిఠాపురం మండల కన్వీనర్ కె.చిన్న పాల్గొన్నారు.



# యథావిధిగా డుమ్మా.. వైసీపీ అధినేతలో మార్పు రాదా?

వైసీపీ గతంలో విద్యార్థుల సమస్యపై ఫీజు పోరు అనే కార్య క్రమం నిర్వహించింది. అదేవిధంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ పెద్ద ఎత్తున ధర్నాలకు పిలుపునిచ్చింది. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి వ్యవహారశైలిపై ఆ పార్టీ వర్గాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆయన పిలుపునిచ్చిన ఆందోళన కార్యక్రమాలకు హాజరుకాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధినేత పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా కేడర్ రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తే, అధినేత జగన్ ఇంటికే పరిమితమైపోవడం, కనీసం కార్యక్రమం ఎలా జరుగుతుందనేది తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని క్షేత్రస్థాయిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆందోళన కార్యక్రమాల్లో అధినేత ఎక్కడో ఒక చోట పాల్గొంటే కార్యకర్తలకు మరింత ఉత్సాహం వచ్చేదని, కానీ ఆయన అలా చేయకుండా ఎప్పట్లానే ఇంటికే పరిమితమైపోవడంపై కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. జగన్ తోపాటు అధిష్టానం ముఖ్యులు ఎవరూ ఈ ఆందోళనల్లో కనిపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నందున అధినేత ముందుండి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే కేడర్ లో మరింత ఉత్సాహం వస్తుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. కానీ, మాజీ సీఎం జగన్ ఆందోళనలకు పిలుపునివ్వడమే కానీ, ఆయన దూరంగా ఉంటూ వస్తుండటాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. గతంలో కూడా వైసీపీ పలు ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో ఏ ఒక్క కార్యక్రమానికి జగన్ హాజరుకాలేదని గుర్తు చేస్తున్నారు. ఈ విషయంలో ఎదురవుతున్న విమర్శలకు తాము సమాధానం చెప్పుకోలేకపోతున్నామని కొందరు నేతలు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ గతంలో విద్యార్థుల సమస్యపై ఫీజు పోరు అనే కార్యక్రమం నిర్వహించింది. అదేవిధంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ పెద్ద ఎత్తున ధర్నాలకు పిలుపునిచ్చింది. ఇక జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజున 'వెన్నుపోటు దినం'గా పరిగణించాలని ఓ కార్యక్రమాన్ని రూపొందించింది. అదేవిధంగా విద్యుత్ చార్జీలు భారంగా మారాయని కూడా ఓ ఆందోళన చేసింది. అయితే ఈ కార్యక్రమాల్లో ఒక్క దాంట్లో కూడా జగన్ కానీ, అధిష్టానం పెద్దలు కానీ పాల్గొనలేదని కార్యకర్తలు విమర్శిస్తున్నారు. అదే సమయంలో పార్టీ అధినేతపై గౌరవంతో ఆయన ఇచ్చిన ఒక్క పిలుపుతో కేడర్ రోడ్డెక్కుతున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధాన్ని దాటుకుని తామంతా రోడ్డెక్కుతుంటే, అధినేత జగన్ మాత్రం ఇంటికి పరిమితవడం వల్ల ఆందోళనలపై ప్రజల్లో పెద్దగా చర్చ జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోందని అంటున్నారు. ప్రతిపక్షం గళాన్ని ఎంత గట్టిగా వినిపించినా, జగన్ మిస్ అయితే విలువ ఉండటం లేదన్న చర్చ నడుస్తోంది. జగన్ రోడ్డెక్కితే వచ్చే స్పందనకు తాము చేసే ఆందోళనలకు చాలా ఉంటుందని కొంతమంది సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అధినేత ప్రజల్లోకి వచ్చి ప్రభుత్వ విధానాలను వేలెత్తి చూపితే బాగుంటుందని అంటున్నారు. కానీ, అధినేత తీరులో ఇప్పటికీ మార్పు రావడం లేదని వాపోతున్నారు. అధికారం కోల్పోయి 18 నెలలు అవుతోందని, అధినేత బయటకు వస్తేనే పార్టీ బలపడే అవకాశం ఉంటుందని తెగేసి చెబుతున్నారు.



### పీతా రామకృష్ణతో

# నా కుటుంబానికి ప్రాణహాని ఉంది

◆ నా కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలి
◆ పరంపర అగ్రిమెంట్‌లో ప్రవీణ్ చౌదరి ద్వారా రూ.కోటి 50లక్షలు నేనే అందించా..
◆ బుర్రిలంక ఇసుక ర్యాంపు నుంచి నెలకు రూ.25 లక్షలు వంతున ముట్ట చెప్పా..
◆ భరత్ అనుచరుడు పీతా రామకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా..
◆ పాత్రికేయుల సమావేశంలో రామ్ శర్మ వెల్లడి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ఆర్సిపి జాతీయ అధికార ప్రతినిధి నగర అధ్యక్షుడు మార్గాని భరత్ రామ్ అనుచరుడు పీతా రామకృష్ణ నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని చందాసత్రం మాజీ చైర్మన్ రామ్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. పీతా రామకృష్ణ మా ఇంటి వద్దకు వెళ్ళి వృద్ధులు అయిన మా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఉదయం పాత్రికేయుల సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేసి రామ్ శర్మ మాట్లాడుతూ తాను ఇవ్వాల్సిన రూ.నాలుగు లక్షల కోసం పీతా రామకృష్ణ తాను నగరంలో నేను లేని సమయంలో ఒక మహిళతో కలిసి తమ ఇంటికి వెళ్ళి ఉదయం నుంచి రాత్రివరకు అక్కడే గడిపాడని ఆయన ఆరోపించారు.తన తల్లిదండ్రులు భయంతో ఉంటున్నారని ఆయన తెలిపారు. ఇవన్నీ తెలిసి కూడా భరత్ పీతా రామకృష్ణను మందలించడం లేదంటే ఇవన్నీ అతడి ప్రమేయంతోనే జరుగుతున్నాయని భావిస్తున్నట్లు రామ్ శర్మ అన్నారు.పీతా రామకృష్ణపై ప్రకాష్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు భరత్ ఏదో కబుర్లు చెబుతున్నాడు కాని ఎంపీగా ఉన్న ఐదేళ్ళూ అతను ఎంత ఎంత సొమ్ము ముడుపులుగా తీసుకున్నాడో తనకు తెలుసని తీవ్రంగా ఆరోపించారు.భరత్ స్నేహితుడని అతడిని నమ్మి ఐదేళ్ళపాటు ఎంపీగా ఉన్న సమయంలో అతడికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించానని, ఆఖరికి అనేక మంది ఇచ్చిన ముడుపుల సొమ్ము రూ. కోట్లు భరత్ తీసుకువెళ్ళి ఇచ్చానని ఆయన చెప్పారు. పేపరుమిల్లు కార్మిక నాయకుడు ప్రవీణ్ చౌదరి ఇచ్చిన రూ.కోటి 50 లక్షలు మూడు ధఫాలుగా రూ.50 లక్షల వంతున భరత్ తానే స్వయంగా అందచేశానని రామశర్మ తెలిపారు. అలాగే బుర్రిలంక ఇసుక ర్యాంపు నిర్వాహకుల నుంచి నెలకు రూ.25 లక్షల వంతున భరత్‌కు అందచేసే వాడినని ఆయన వివరించారు. మరోచోట గ్రావెల్ సంబంధించి కూడా ముడుపుల సొమ్ము అందచేసేవాడినని ఆయన చెప్పారు. కొవ్వూరు ఇసుక ర్యాంపు తనకు ఇచ్చినందుకు భరత్‌కు రూ.25 లక్షలు ముట్టచెప్పానని కాని కరోనా వల్ల అక్కడ కొన్ని రోజులు కూడా ఇసుక తవ్వకాలు చేయలేక నష్టపోయినట్లు రామశర్మ చెప్పారు.బాల్య స్నేహితుడైన ఇన్నమూరి దీపును బెదిరించి వైసీపీలో చేరేలా భరత్ చేశాడని రామశర్మ మండిపడ్డారు. వైసీపీ అగ్రనేతలు మిధున్ రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి వంటి వారు రాజమండ్రి వస్తే ఆ ఖర్చంతా తానే చేసేవాడినని, భరత్ ఆ భారం తనమీదే వేసేవాడని రామశర్మ చెప్పారు. జగన్ పర్యటన జరిగినా ఫ్లెక్సీలు,ఇతర ఖర్చు భారం తనదేనని అలా తనను వాడుకుని అప్పులపాలు అయ్యేలా చేశాడని ఆయన ఆరోపించారు.తాను ఐపీ పెట్టలేదని, తాను డబ్బివ్వాల్సిన వారంతా కొంత గడువు ఇస్తే కష్టపడి అందరి బాకీలు తీర్చుతానని రామశర్మ హామీ ఇచ్చారు. పాత్రికేయుల సమావేశంలో న్యాయవాదులు అనిల్, నవీన్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కలసికట్టుగా పనిచేద్దాం..

- రూరల్ నియోజక వర్గాన్ని అగ్రగామిగా నిలబెడదాం - మరో రూ.30కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నాం
- కార్యకర్తలు తీసుకొచ్చే సమస్యపై స్పందిస్తా.. - కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు వస్తుంది
- జనసేన, బీజేపీ శ్రేణులతో సమన్వయంతో వెళ్దాం.. - వైసిపి వాళ్ళ విమర్శలను తిప్పి కొట్టాలి
- రూరల్ నియోజక వర్గ టిడిపి కమిటీల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అందరం కలసికట్టుగా కృషిచేసి రూరల్ నియోజక వర్గాన్ని అగ్రగామిగా నిలబెడదామని టిడిపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపు నిచ్చారు. కార్యకర్తలే పార్టీకి బలమని, కార్యకర్తలు పనిచేయడం వల్లనే ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగలిగానని అన్నారు. కార్యకర్తలు ఏ సమస్య తీసుకొచ్చినా తక్షణమే స్పందిస్తానని ఆయన అన్నారు. అయితే రాతపూర్వకంగా సమస్య తన దృష్టికి తీసుకు రావాలని ఆయన సూచించారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో రాజమండ్రి రూరల్ నియోజకవర్గం బూత్, యూనిట్, క్లస్టర్, గ్రామ, మండల, వార్డు అలాగే అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం గురువారం సాయంత్రం కోలాహల వాతావరణంలో జరిగింది. నూతన కమిటీల చేత ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ అరాచకాలపై సమిష్టిగా పోరాటం చేశామని గుర్తు చేసారు. అరాచకాలను ఎత్తిచూపిస్తూ సహేతుకంగా విమర్శలు చేశామన్నారు. ముందు వరుసలో ఉండి పోరాటం చేశామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం మనపై ఒక్క కేసు కూడా పెట్టలేకపోయిందన్నారు. కార్యకర్తలపై ఈగ వాలకుండా చూశానని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని, ఆర్థికంగా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆర్థిక ఇబ్బందులున్నా సరే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని ఆయన అన్నారు. ముఖ్యంగా రూరల్ నియోజక వర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయల పనులు జరుగుతున్నాయని, మరో 30కోట్ల రూపాయల పనులు మంజూరు అవుతున్నాయని, త్వరలోనే అంచనాలు రూపొందించి పనులు చేపడతారని ఎమ్మెల్యే గోరంట్ల చెప్పారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలను ప్రచారం చేయడంతో పాటు, వైసిపి విమర్శలను తిప్పికొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. జనసేన, బిజెపి శ్రేణులను కూడా కలుపుకుని సమన్వయంతో పనిచేద్దామని ఎమ్మెల్యే గోరంట్ల సూచించారు. ఈ కలయిక కలకాలం ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పకుండ గుర్తింపు వస్తుందని, ఇప్పటికే చాలామందిని కమిటీలలోకి తీసుకున్నామని, జిల్లా కమిటీలో కూడా అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. వివిధ కార్పొరేషన్లలో అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యకర్తల్లో పేదలకు కూడా ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడడం, వయస్సు మళ్ళిన కార్యకర్తలు కష్టాల్లో ఉంటె ఆదుకోవడం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. ఎంతో అభిమానంతో రూరల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే గా గెలిపించినందుకు కార్యకర్తల గౌరవం పెంచేలా నడుచుకుంటానని ఆయన అన్నారు. కార్యకర్తలకు గౌరవం దక్కాలనే ఉదేశ్యంతో పార్టీ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి, ఎలా పరిష్కరించాలో కూడా సూచనలు చేస్తున్నానని గోరంట్ల చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి,ఎం.పీ.పీ వెలుగు బంటి సత్య ప్రసాద్, రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, ఏఎంసి వైస్ చైర్మన్ బోడపాటి గోపి, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణి, డైరెక్టర్ కర్రీ అప్పలస్వామి, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ,అన్నదేవుల చంటి, కురుకూరి కిషోర్, చెల్లుబోయిన శ్రీనివాస్, ప్రత్తిపాటి రామారావు చౌదరి, కామిని భాస్కర్ చౌదరి, శీలం గోవిందు, వాసంశెట్టి నాగబాబు, పెన్నమరెడ్డి ఈశ్వరుడు, గంగిన జాహ్నవి, పిల్ల తనూజ, గంగిన నాని, అద్దాల శ్రీను, బొప్పన శ్రీను, దండమూడి బాపినీడు, వట్టికూటి దత్తుడు, షేక్ సిద్దయ్య, రొంపిచర్ల అంటోని, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ, పల్లి సాయి, కొప్పిశెట్టి చిన్ని, బంగారు రాజు, పాలిక వెంకటరమణ, మరియు గ్రామ, మండల, వార్డు అనుబంధ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమలు చంద్రబాబుపై

# నమ్మకంతో వస్తున్నాయి

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెట్టుబడుల హబ్‌గా మన రాష్ట్రం నిలుస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో రీన్యూ పవర్ పెట్టుబడులు పెడుతోందని, రీన్యూ పవర్ రూ.82 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైనట్లు ప్రకటించడమే అందుకు నిదర్శనమన్నారు. కాగా.. 2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం.. వచ్చీ రావడంతోనే పీపీఏలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని, దీనితో నాడు రెన్యూ ఎనర్జీ సంస్థ.. పీపీఏల రద్దు దుమారంతో రాష్ట్రానికి గుడ్ బై చెప్పేసిందని, టీడీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న పీపీఏ ఒప్పందాలను కక్ష పూరితంగా, కుట్ర పూరితంగా నాడు జగన్ ప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రం నుంచి పారిశ్రామికవేత్తలను వెళ్లగొట్టేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. పీపీఏల రద్దు వ్యవహారం నుంచే రాష్ట్రం ఇమేజ్ నాడు జాతీయంగా, అంతర్జాతీయంగా డామేజ్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీపీఏల రద్దు విషయంలో నాడు జగన్ ప్రభుత్వం వ్యవ హరించిన తీరు సరికాదని... ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం చెప్పినా, హెచ్చరించినా పట్టించు కోని పరిస్థితి అని అన్నారు. అమర్ రాజా బ్యాటరీస్, కియా అనుబంధ సంస్థలు, జాకీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ, బిఆర్‌షెట్టి గ్రూప్, ట్రైటాన్ ఎలక్ట్రానిక్స్, వంటి పరిశ్రమలతో పాటు ఫార్చ్యూన్ వంటి 500 కంపెనీలను కూడా జగన్ బలవంతంగా పక్క రాష్ట్రాలకు తరిమేశారని మండిపడ్డారు. అలా నాడు వెళ్ళిపోయిన సంస్థను మళ్లీ కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చేలా చేయడంతో పారిశ్రామిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల సుధీర్ఘ అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేయిస్తున్నారని, అంతర్జాతీయంగా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్ అని.. ఆయన సీఎంగా ఉన్నారంటే పారిశ్రామికవేత్తలకు ఒక నమ్మకం, గౌరవమని చెప్పుకొవచ్చున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో 9.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయ న్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ పని చేస్తున్నారని వెల్లడిం చారు. ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ ఎంఈ పాలసీ, ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీలతో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని, రాష్ట్రం నుంచి జగన్ వల్ల నాడు వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి వస్తుండడంతో బ్రాండ్ ఏపీ తిరిగి నిలబడిరదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు దోహదపడే

# ఎలక్ట్రికల్ వాహనాలు

డి.ఎస్.ఆర్. ఈవీ మొబైలిటీ, గ్రీన్ పరివార్ ఎంటర్ ప్రైజెస్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాతావరణ కాలుష్యం నివారించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఎలక్ట్రికల్ సరుకు రవాణా(ఆటో) వాహన విక్రయాల షోరూం డి.ఎస్.ఆర్. ఈవీ మొబైలిటీ, గ్రీన్ పరివార్ ఎంటర్ ప్రైజెస్‌ను ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు.వెంకటేశ్వర నగర్ జాతీయ రహదారిపై నెలకొల్పిన ఈవీ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో గోదావరి జిల్లాలలోని పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పర్యావరన పరిరక్షణకు,పచ్చదనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని,అందుకు తగినట్లుగా ఎలక్ట్రికల్ వాహన విక్రయాల షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో తణుకు ఆంధ్రా షుగర్స్ జె.ఎం.డి పి.అచ్యుతరామయ్య డి.ఎస్.ఆర్.మొబైల్ ప్రైవేటు లిమిటెడ్ ఫౌండర్ ఎండి ధనశేఖరరెడ్డి, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటరాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ ఎం.బాపిరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నిమ్మలపూడి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్ రాఘవకుమారి

# అవినీతి, అక్రమాలు బట్టబయలు

- హితకారిణి సమాజం కమిటీ పలు ఆరోపణలు
- ఎస్‌కేఆర్ విద్యార్థినుల హాస్టల్‌ను హితకారిణి సమాజం స్వాధీనం
- పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి దానవాయిపేటలో ఎస్‌కేఆర్ మహిళా కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న విద్యార్థినుల హాస్టల్ ను ఆర్డీఓ,ఆర్జేడీ సమక్షంలో హితకారిణి సమాజం స్వాధీనం చేసుకుందని, వారి వద్ద నుంచి రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నామని యాళ్ల ప్రదీప్ కుమార్ తెలిపారు. ఎస్ఆర్ కళాశాల ఎంబిఎ విభాగం కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం హితకారిణి సమాజం చైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 2022లో ఇచ్చిన జి.ఓ ప్రకారం హితకారిణి సమాజం నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో ఉన్న 7 సంస్థలలో, 2 మాత్రమే విద్యాశాఖకు అప్పగించారని, మిగిలిన 5 తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం హాస్టల్‌ను స్వాధీనం చేసుకుందని జిఓ 28ని చూపుతూ ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రాఘవకుమారి అక్రమాలకు పాల్పడి కందుకూరి ఆశయాలను భంగం కలిగేలా వ్యవహరించా రన్నారు.జిఓపై ఎటువంటి ప్రోసీడింగ్స్ జరగకపోయినా గత పాలకమండలి పట్టించుకోలేదన్నారు. కందుకూరి ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా తాము పనిచేస్తామని, బోర్డులో తీర్మానం చేసి హాస్టల్ ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నామని వెల్లడించారు. సెక్రటరీ, కరస్పాండెంట్ జె.వినోద్ కుమార్, ట్రస్టు బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ఎన్.వి.బి వెంచర్స్ నల్లమిల్లి వెంకన్నబాబు సహకారంతో భిక్షా

- దైవాదీక్ష తీసుకున్న స్వాములకు 41రోజుల పాటు అల్పాహార దీక్ష - భవాని,స్వాములకు చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం
- బిక్ష స్థలాన్ని సందర్శించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు - హిందూ ధర్మ పరిరక్షణ కోసం తనవంతు కృషి - ఎన్‌విబి వెంచర్స్ అధినేత నల్లమిల్లి వెంకన్నబాబు



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అయ్యప్ప,భవానీ మరియు దైవ దీక్షలు తీసుకున్న స్వాములకు ఎన్ వి బి వెంచర్స్ 41రోజులు పాటు ఉదయం, సాయంత్రం అల్పాహార భిక్ష ఇవ్వడం సంతోషదాయకమని పలువురు కొనియాడారు. రాజమహేంద్రవరం రూరల్ రాయుడుపాకలు గ్రామంలో ఎన్ వి బి వెంచర్స్ అధినేత నల్లమిల్లి వెంకన్నబాబు సహకారంతో ప్రతీ ఏడాది రాజమహేంద్రవరం చుట్టు ప్రక్కలవారికి అయ్యప్ప, భవానీ మరియు దైవదీక్షలు తీసుకున్న స్వాములకు ఎన్ వి బి అధినేత నల్లమిల్లి వెంకన్నబాబు సహకారంతో భిక్షా కార్యక్రమం జరుగుతోంది. ఈ ఏడాది 4 సంవత్సరాలు పూర్తి చేసుకుని 5వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భం గా రాయుడుపాకలు మరియు చుట్టుప్రక్కల గ్రామాల అయ్యప్ప మరియు ఇతర దైవాదీక్ష తీసుకున్న స్వాములకు అక్టోబర్ 6వ తేది నుండి 41 రోజులపాటు అల్పాహార దీక్ష అందిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం కొంతమూరు గ్రామానికి చెందిన వారాహిదేవి పీఠం వ్యవస్థాపకులు పామర్తి బాబురావు, కొంతమూరు షణ్ముఖ లయన్స్ క్లబ్ అధ్యక్షులు పామర్తి నాగరాజు, వల్లీ ప్రమోటర్స్ అధినేత కొండేటి మనోహర్ తదితరులు భిక్షా శిబిరాన్ని సందర్శించి వెంకన్నబాబు చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రోత్యహించడంతోపాటు హిందూ ధర్మ పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్

- అత్యధిక కేసులను పరిష్కారానికి కృషి చెయ్యాలి
- అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి - సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్. శ్రీలక్ష్మి గురువారం స్థానిక న్యాయ సేవాధికార కార్యాలయంలో వివిధ చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థలకు సంబంధించిన న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్లో అత్యధిక కేసులను పరిష్కరించి, బాధితులకు త్వరిత న్యాయం మరియు తగు పరిహారం అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న చిట్‌ఫండ్ సంస్థల సివిల్ మరియు కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి, వాటి జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని ప్రతినిధులకు సూచించారు. అలాగే రాజీ పడ్డగిన ఇతర కేసులను కూడా గుర్తించి, పరస్పర అంగీకార పద్ధతిలో పరిష్కారం దిశగా న్యాయవాదులు కృషి చేయాలని తెలిపారు. ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ లోక్ అదాలత్లు ప్రజలకు సులభమైన, త్వరితమైన మరియు తక్కువ వ్యయంతో న్యాయం అందించే వేదిక అని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను పరస్పర అంగీకార పద్ధతిలో పరిష్కరించుకోవడం ద్వారా న్యాయ వ్యవస్థపై భారం తగ్గుతుందని, సమాజంలో సౌహార్ద వాతావరణం నెలకొంటుందని వివరించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, వివిధ చిట్ ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# రైతుల పొలాల్లో కరెంటు పంట..

## సీఎం చంద్రబాబు వినూత్న ఆలోచన



మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. రెన్యూ పవర్ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచన చేస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యం కాని భూములను వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రతిపాదనను ఆయన సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. విశాఖలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా రెన్యూ పవర్ తో ఎంవోయూ కుదుర్చుకున్న సమయంలో సీఎం చంద్రబాబు తన మదిలో ఉన్న అదిరిపోయే ఆలోచనను బయటపెట్టారు. రాష్ట్రంలో వ్యవసాయానికి యోగ్యం కాని బీడు, బంజరు భూముల్లో రైతులతో సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని సీఎం భావిస్తున్నారు. ఇలా చేస్తే ఎంతమేర రైతులకు లాభదాయకంగా ఉంటుంది? ఎకరానికి ఎంత ఆదాయం వస్తుందనే దానిపైనా రెన్యూ పవర్ చైర్మన్ సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చర్చించారు. సోలార్ ప్యానెల్స్ ధరలు అధికంగా ఉన్నందున వాటి తయారీ యూనిట్లను రాష్ట్రంలో పెద్దఎత్తున నెలకొల్పే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కాగా, పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే ప్రముఖ సంస్థ రెన్యూ పవర్ రాష్ట్రంలో రూ. 82,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు గురువారం విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. రెన్యూ పవర్ చైర్మన్, సీఈవో సుమంత్ సిన్హాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ ముందంజలో ఉందని, పర్యావరణ పరిరక్షణతో పాటు తక్కువ ధరకు కరెంటు సరఫరా చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల విషయంలో అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోందని, వేగవంతమైన అనుమతులిస్తూ ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా సుమంత్ సిన్హా కొనియాడారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తున్న నేపథ్యంలో భారీగా తలెత్తే విద్యుత్ డిమాండ్ తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సుమంత్ వెల్లడించారు. ముందే ప్రకటించిన మంత్రి లోకేష్ మంత్రి లోకేష్ బుధవారం ఎక్స్‌లో ప్రకటించినట్లుగానే ఇంధన రంగంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన రెన్యూ పవర్ సంస్థ తిరిగి కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలు కుదుర్చుకుంది. గతంలోనే రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన రెన్యూ పవర్... మొత్తంగా రూ. 82,000 కోట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనుంది. ఒప్పందంలో భాగంగా 6 గిగావాట్ల ఇంగాట్-వేఫర్ ప్లాంట్, 2 గిగావాట్ల పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం, 5 గిగావాట్ల విండ్-సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ హైబ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ఉద్యోగాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రంలోని యువతకు దక్కనున్నాయి. రెన్యూ పవర్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో భారతదేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఒకటైన 2.8 గిగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో 1.8 గిగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్ ఉంది. అలాగే 2 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తుంది.

# వాహనదారులకు హై అలెర్ట్..

## ఏపీ నంబర్‌తో తెలంగాణలో తిరిగితే..?




తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు భద్రతను పటిష్టం చేసేందుకు రవాణా శాఖ చేపట్టిన నూతన ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు వేగం పుంజుకున్నాయి. ఇతర రాష్ట్రాల నెంబర్లతో ముఖ్యంగా ఏపీ నెంబర్లతో తిరుగుతున్నవారు, అలాగే రోడ్డు నియమాలను ఉల్లంఘించే వాహనదారులంతా అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా కొత్త ప్లాన్ ఆఫ్ యాక్షన్ అమల్లోకి రావడంతో తనిఖీలు భారీగా పెరగనున్నాయి.

### పటిష్టమైన ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు

ప్రమాదాలను తగ్గించడానికి రవాణా శాఖ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. జిల్లా స్థాయిలో 33 ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ బృందాల ఏర్పాటు చేసింది.. రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ప్రతి బృందంలో డీటీసీ, ఎంవీఐ, ఏఎంవీఐలతో పాటు అనుభవజ్ఞులైన సిబ్బంది ఉంటారు. నియమాలను ఉల్లంఘించే వాహనాలపై ఇకపై కఠిన చర్యలు తప్పనిసరి కానున్నాయి. ఓవర్‌లోడింగ్‌పై 'జీరో టాలరెన్స్' రోడ్డు భద్రతకు అత్యంత ప్రమాదకరమైన ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలను రవాణా శాఖ ప్రధానంగా టార్గెట్ చేసింది. ఈ కఠిన తనిఖీలకు గురయ్యే వాహనాలు.. లారీలు, బస్సులు,మినరల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు,సాండ్, ఫ్లైయాష్, స్టోన్ బండ్లు,బిల్డింగ్ మెటీరియల్ వాహనాలు.. ఫిట్‌నెస్ గడువు ముగిసిన లేదా ఫిట్‌నెస్ లేని వాహనాలు.. అవసరమైతే సీజ్ చేసే వరకు చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి స్పష్టం చేశారు. ప్రత్యేక దృష్టి సారించిన ప్రాంతాలు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ఆర్టీవోలకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. ఈ ఆర్టీవోలు వారానికి కనీసం రెండు సార్లు అంతర్‌రాష్ట్ర కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. ఉల్లంఘనలు ఉన్న వాహనాలు రోడ్డుపై కనిపిస్తే నేరుగా సీజ్ చేయబడతాయి. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలు, అతివేగం, బహుళ ఈ-చలాన్స్ ఉన్న వాహనాలు పట్టుకుంటారు. ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్లు వంటి వాహనాలను కారణం లేకుండా వేధించరాదు అని మంత్రి స్పష్టంగా ఆదేశించారు. అయితే ప్రయాణికుల బస్సుల్లో ఉల్లంఘనలపై మాత్రం కఠిన చర్యలు తప్పవు.. అనధికార మార్పులు లేదా సీట్‌ల మార్పు చేయరాదు. అత్యవసర నిష్క్రమణ మార్గాల్లో అడ్డంకులు సృష్టించవద్దు.. చేవెళ్ల దుర్ఘటన తర్వాత వేగవంతమైన చర్యలు గత వారం జరిగిన చేవెళ్ల రోడ్డు ప్రమాదం నేపథ్యంలో రవాణా శాఖ చర్యలు మరింత తీవ్రమయ్యాయి. కేవలం వారం రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 2,576 వాహనాలపై కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా, 352 ఓవర్‌లోడింగ్ లారీలు, 43 బస్సులపై ప్రత్యేక కేసులు నమోదు చేశారు. మహిళల కోసం ఉపాధి అవకాశాలు మహిళలకు ఉపాధి పెంచే దిశగా, మహిళా ఆటో అనుమతులు ఇవ్వడంపై రవాణా శాఖ అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. రాబోయే రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు., ఇన్నోవేటివ్ అవగాహన కార్యక్రమాలు, ప్రతి జిల్లాలో చిల్డ్రన్స్ అవేర్నెస్ పార్కుల ఏర్పాటు..అలాగే, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ స్కీమ్ గురించి కూడా విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. వాహనదారులకు హెచ్చరిక తెలంగాణ రవాణా శాఖ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, భద్రతను పెంచడం లక్ష్యంగా నియమాలను పటిష్టంగా అమలు చేస్తోంది. ఇతర రాష్ట్రాల నెంబర్లతో ఇక్కడ తిరుగుతున్న వాహనదారులు, ఓవర్‌లోడింగ్ చేసేవారు, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడిపేవారు వెంటనే అప్రమత్తం కావాలి. లేకుంటే భారీ జరిమానాలు, సీజ్ వంటి చర్యలకు గురికాక తప్పదు.

### రైల్వే మెయిల్ సర్వీస్ సూపరింటెడెంట్

# దాసరి నాగేశ్వరరెడ్డి పదోన్నతిపై బదిలీ

## రాజమండ్రిలో ఘనంగా వీడ్కోలు







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం సూపరింటెండెంట్ రైల్వే మెయిల్ సర్వీస్ విశాఖపట్నంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న దాసరి సూర్య ఉమ నాగేశ్వర్ రెడ్డి కి జూనియర్ టైమ్ స్కేలు ఆఫీసర్ ఇండియన్ పోస్టల్ సర్వీస్( ఐపీఓస్)గా పద్దోనతి పొంది తమిళనాడు లో చెన్నై సర్కిల్ ఆఫీస్‌లో అసిస్టెంట్ పోస్టుమార్ట్ జనరల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విశాఖపట్నం నుండి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఆర్ఎంఎస్ సిబ్బంది అసిస్టెంట్ సూపరింటెండెంట్ రైల్వే మెయిల్ సర్వీస్ ప్రభుదాస్, రిక్రియేషన్ క్లబ్ రాజమండ్రి ఆర్ఎంఎస్ సంయుక్తంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సభ ఉద్దేశించి మాట్లాడుతూ రాజమండ్రి ఆర్ఎంఎస్‌కు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని అలాగే స్టాఫ్ వెల్ఫేర్ చక్కగా చూశారని చిన్న వయసులోనే ఐపీఓఎస్ పదవి పొంది రాజమండ్రి వాస్తవ్యునిగా నగరానికే గర్వకారణం అని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఎఎస్ఆర్ఎం ప్రభుదాస్, ఎస్ఆర్ఓ దుర్గారావు, పోస్ట్ మాస్టర్ సువర్ణరాజు, యూనియన్ సభ్యులు ఎన్ ప్రకాష్ కుమార్, జెటిపిఎం శ్రీనివాస్,మరియు ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సబ్యులు ఓఎల్ నారాయణ మరియు ఆర్ఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవి మధ్యలో భూమి పెద్దిరెడ్డికి ఎలా వచ్చింది.. పవన్ ప్రశ్న



పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి.. ఆయన కుటుంబ సభ్యుల చేతికి 104 ఎకరాల అటవీ భూములు ఎలా వచ్చాయన్న దానిపై నివేదిక ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని అధిక్యను ప్రదర్శించటంతో పాటు.. తాను ఏమనుకుంటే అది జరగాలన్నట్లుగా వ్యవహరించిన మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గుండెల్లో గుబులు పుట్టేలా ప్రశ్నను సంధించారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. అడవి మధ్యలో ఉన్న భూమి అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డికి ఎలా వచ్చిందన్న ప్రశ్న ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కీలకమైన పాయింట్ పట్టుకొని ప్రశ్నించిన పవన్.. అటవీ అధికారులకు తాజా ఆదేశాల్ని జారీ చేశారు. పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి.. ఆయన కుటుంబ సభ్యుల చేతికి 104 ఎకరాల అటవీ భూములు ఎలా వచ్చాయన్న దానిపై నివేదిక ఇవ్వాలని కోరారు. భూమి ఎప్పుడు చేతులు మారిందో తెలుసుకోవాలని.. దీనిలో ఎవరి పాత్ర ఎంతనే దానిపై తనకు రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. తాజాగా అటవీ శాఖాధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ పవన్ ప్రస్తావించిన అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి 2024 ఎన్నికల్లో అటవీ భూములపై అఫిడవిట్ లో తప్పుడు సమాచారాన్ని అందించారన్న విషయం తన వరకు వచ్చిందని.. ఆ అంశాల్ని కూడా పరిగణలోకి తీసుకోవాలన్న పవన్.. 'భూ రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 40.80 ఎకరాలు వారి అధీనంలో ఉంటే.. వెబ్ ల్యాండ్ లోకి వచ్చేసరికి 77.54 ఎకరాలుగా చూపినట్లుగా పేర్కొన్నారు. ఒకేసారి ఎందుకు అంత పెరిగిందన్న విషయాన్ని పరిశీలించాలని అధికారుల్ని పవన్ కోరారు. మంగళంపేట అటవీ భూముల అక్రమాటపై విజిలెన్స రిపోర్టు ఎంతోకీలకమని.. పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన భూముల పూర్తి వివరాలు అందులో ఉన్నాయని.. వాటిని ప్రాతిపదికన తీసుకోవాలన్న పవన్ మాటల్ని చూస్తే.. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసిన తర్వాతే.. అధికారులతో మాట్లాడారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా పెద్దిరెడ్డి భూములపై పవన్ పెట్టిన ఫోకస్ రానున్న రోజుల్లో పలు సంచలనాలకు కారణంగా మారతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సీఎం సహాయనిధితో పేదల కుటుంబాల్లో వెలుగులు

## లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద మధ్యతరగతి కుటుంబాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో వెలుగులు నింపుతుందని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. గురువారం ఉదయం గోరంట్ల కార్యాలయంలో రూరల్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిది చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల అందించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అప్పులు పెనుబారమై ఇబ్బంది పడుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు సీఎం సహాయనిధి ద్వారా ఉదారంగా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ కూడా విద్య వైద్యానికి పెద్దపీట వేస్తుందని ప్రతి పేదవాడికి వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు ప్రతి కుటుంబానికి ఏడాదికి 25 లక్షల రూపాయలతో ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గోరంట్ల అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందురి అప్పారావు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కురుకూరి కిషోర్, బొప్పన నానాజీ, పెంద్యాల రామకృష్ణ, పితాని శివరామకృష్ణ, వట్టికూటి దత్తుడు, పాఠంశెట్టి రాంజీ, దండమూడి తేజ, తాడేపల్లి నాగరాజు, దొడ్డి బాబ్జి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్యనారాయణ, కొప్పిశెట్టి చిన్ని, గారపాటి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలు నేత్రచికిత్స శిబిరం, అవగాహన ర్యాలీలు, చెరువులో శ్రమదానం






**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వాలంటీర్లతో నేత్ర చికిత్స శిబిరం సందర్భంగా ర్యాలీ చేయడం జరిగింది. ఈ ర్యాలీని మ్యాచ్ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ హారిక చేతుల మీదుగా ప్రారంభించారు. సర్వేంద్రియానం నయనం ప్రదానం, ప్రొటెక్ట్ ఆల్ యంగ్ ఐస్,- ప్రొటెక్ట్ విజన్,ఆల్ ఐస్ ఆన్ మయోఫియా వంటి అనేక నినాదాలతో వాలంటీర్ల నినాదాలు చేస్తూ సాగింది. ఉదయం నుంచి ఉచితంగా మేక్సీ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు డా.హారిక,క్లస్టర్ మేనేజర్ అఖిల్, బ్రాంచ్ మేనేజర్ అజయ్, మార్కెటింగ్ మేనేజర్ భీమా,నేత్ర చికిత్స నిర్విరామంగా సేవలు అందించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల బాలురు కొంతమూరులో ముందుగా ఉదయం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలుపుతూ ర్యాలీ జరిగింది. చెరువులో పూడిక తీయడం,వ్యర్థాలను తొలగించడం జరిగింది.న్యాయవాది డి.వెంకటేశ్వరరావుచే చట్టాల గురించిన అవగాహన సదస్సులో వివరించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ జి. వి.ఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బిహెచ్‌వి రమాదేవి, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.ఎన్.రెహమాన్,రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణికుమార్, ఈ క్యాంపు ఇంత విజయవమైనందుకు వాలంటీర్లను, ప్రోగ్రాం ఆఫీసర్స్‌ను అభినందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



# ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం

న్యూఢిల్లీ

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 8.00 గంటలకు ఈ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు జరుపుతారు. అనంతరం అంటే.. 8.30 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతుంది. అందుకోసం 243 రిటర్నింగ్ అధికారులు, 243 పరిశీలకుల ఈ ఓట్ల లెక్కింపును పర్యవేక్షించనున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో– ఆబ్జర్వర్లతో సిబ్బందిని ఏర్పాటు చేశారు. అందుకోసం ఎన్నికల సంఘం 4,372 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసింది. అభ్యర్థులు నియమించిన 18 వేల మందికిపైగా ఏజెంట్స్ సైతం ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ నిర్వహించారు. నవంబర్ 6వ తేదీన 121 స్థానాలకు, నవంబర్ 11వ తేదీన 122 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ రెండు విడతల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. దీంతో 67.13 శాతం పోలింగ్ నమోదయింది. 1951 తర్వాత.. ఆ రాష్ట్రంలో ఇంత భారీగా పోలింగ్ నమోదకావడం ఇదే తొలిసారి. ఇక ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందంటూ ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనే దానిపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత రానుంది. మరో వైపు ఈ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా ఈ రోజు ప్రకటించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లును ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అందులో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం సైతం ఉంది. ఈ అసెంబ్లీ స్థానానికి మంగళవారం అంటే.. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికను నిర్వహించారు.

## బీమా కంపెనీలే నష్ట పరిహారం చెల్లించాలి

**వాహన ప్రమాద బాధితుల కేసులో సుప్రీంకోర్టు తీర్పు**



న్యూఢిల్లీ

ప్రమాదానికి కారకుడైన వాహన యజమాని బీమా ఒప్పందాన్ని ఉల్లంఘించినప్పటికీ ప్రమాద బాధితులకు లేదా వారి కుటుంబ సభ్యులకు బీమా కంపెనీలే నష్ట పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. విడిగా పిటిషన్ దాఖలు చేసి నష్ట పరిహారం సొమ్మును వాహన యజమాని నుంచి బీమా కంపెనీలు వసూలు చేసుకోవాలని ఆదేశిస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది.
బీమా నిబంధనల ఉల్లంఘన జరిగినప్పటికీ ప్రమాద బాధితునికి నష్టపరిహారం చెల్లించి ఆ తర్వాత ఆ సొమ్మును వాహన యజమాని నుంచి వసూలు చేసుకునే అధికారాన్ని బీమా కంపెనీలకు ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకుల నారాయణ దాఖలు చేసిన అప్పీలును అనుమతిస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

## పార్టీ ఫిరాయించిన బెంగాల్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు

కోల్‌కతా

బీజేపీ టిక్కెట్‌పై గెలిచి తృణమూల్ కాంగ్రెస్‌లోకి మారిన సీనియర్ నాయకుడు ముకుల్ రాయ్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ గురువారం కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఫిరాయింపుల నిషేధం చట్టం కింద నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కారణంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణనగర్ (ఉత్తర) స్థానం ఖాళీ అయింది. అయితే ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు మాత్రం లేవు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండమే ఇందుకు కారణం. 2021 మే నెలలో బీజేపీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన కొద్ది సమయంలోనే అంటే.. జూన్ నెలలో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ముకుల్‌పై అనర్హత వేటు వేయాలని బీజేపీకి చెందిన ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి స్పీకర్ బిమన్ బెనర్జీని కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించలేదు. దాంతో సువేందు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం స్పీకర్‌కు మరో అవకాశం కల్పించింది. అయినా స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. హైకోర్టు తనకు సంక్రమించిన రాజ్యాంగపర అధికారాలను ఉపయోగించుకొని ఫిరాయింపుల నిషేధం చట్టం కింద ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించడం ఇదే తొలిసారి అని సువేందు అధికారి తరపు న్యాయవాది బిల్వదళ బెనర్జీ చెప్పారు. తీర్పుపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందిస్తూ ఇది రాజ్యాంగ విజయమని అన్నారు.

## ద్రవ్యోల్బణం తగ్గినా ఊరట లేదు..

న్యూఢిల్లీ



భారత దేశ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ఠంగా 0.25 శాతం నమోదైంది. అయితే ద్రవ్యోల్బణం ఇంత తక్కువకు పడిపోయినా కూరగాయలు, పప్పు దినుసుల ధరలు మాత్రం మండిపోతున్నాయి. సాధారణంగా తక్కువ ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ధరలు ఎక్కువగా పెరగకుండా స్థిరంగా ఉంటాయి. కానీ ప్రస్తుతం వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కూరగాయలు, పాలకూర, తోటకూర లాంటి ఆకుకూరలు సుమారు 2 శాతం ధరలు పెరిగాయి. చాలామంది ఇష్టంగా తినే బఠాణీల ధర 12 శాతం పెరిగింది. చికెన్ ధర 1 శాతం, గుడ్లపై 0.5 శాతం పెరిగింది. ఇక పండ్ల విషయానికొస్తే అనాస పండు 6.1 శాతం పెరుగగా, ఆపిల్ ధరలు మాత్రం 10 శాతం తగ్గాయి. అలాగే బంగారం 12.5 శాతం, వెండి 21.7 శాతం పెరిగాయి. క్యాబేజ్ 4 శాతం, బంగాళదుంప 1.3 శాతం పెరుగగా, టమాటాలు 10 శాతం, ఉల్లిగడ్డలు 3.5 శాతం తగ్గాయి. ఇక వంట నూనెల విషయానికొస్తే.. ఆవ, వేరుశనగ, రిఫైన్డ్ అయిల్ ధరలు స్వల్పంగా తగ్గాయి. నెయ్యి ధర కూడా స్వల్పంగా తగ్గింది. చక్కెర ధరలు పాక్షికంగా పెరగ్గా, టీ, కాఫీల ధరలు స్థిరంగా ఉన్నాయి. హెయిర్ ఆయిల్, షాంపూల ధరలు 0.3 శాతం పెరిగాయి. ఇళ్ల అద్దెలను పరిశీలిస్తే నెలనెలకు 0.9 శాతం పెరుగుతున్నది. అదే సమయంలో ఫ్లాట్ నిర్వహణ, విద్యుత్, ఎల్పీజీ ఖర్చులు స్థిరంగా ఉన్నాయి. రికార్డు కనిష్ట స్థాయికి భారత ద్రవ్యోల్బణం నమోదైన విషయాన్ని తాము మీడియా ద్వారా చూశామని, అయితే వాటి ఫలితాలు తాము అందుకున్నట్టు కన్పించడం లేదని పలువురు పౌరులు ఫిర్యాదు చేశారు.

# 32 చోట్ల మారణహోమానికి స్కెచ్

-మొదటిపేజీ తరువాయి

ఉగ్రవాదుల అసలు కుట్ర అని స్పష్టమైంది. ఇప్పటికే అరెస్టయిన డాక్టర్ ముజామిల్‌కు, ఉమర్‌కు మధ్య చివర్లో విభేదాలు పొడచూపాయి. ఈ కారణంగానే దాడి ప్రాంతాలు మారాయా? దాడి చేయాల్సిన తేదీలు మారాయా? అనేది తేలాల్సి ఉంది.
డైరీలో కోడ్ నేమ్‌లు, బాంబుల నిల్వ ప్రాంతాలు.. వర్సిటీ హాస్టల్‌లో ముజామిల్‌కు చెందిన 13వ నంబర్ గదితోపాటు ఉమర్ ఉండే నాలుగో నంబర్ గదిలో అధికారులు 3 డైరీలను స్వాధీనంచేసుకున్నారు. వీటిలో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నాయి. వీరిలో చాలా మంది జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వాళ్లే. కోడ్ భాషలో పలు ప్రాంతాల పేర్లు, కొన్ని నంబర్లు రాసి ఉన్నాయి. డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్ చేసి ఉంది. చాలా చోట్ల 'ఆపరేషన్' అని రాసి ఉంది. దీంతో ఇది ఎంతో పకడ్బందీగా జరిగిన విద్రోహచర్య అని అర్థమైంది. పాతిక మంది సాయంతో తమ ప్రణాళికను ఆచరణలో పెట్టాలని ఉమర్, ముజామిల్ భావించారని దర్యాప్తు అధికారులు తెలిపారు. ధౌజ్ గ్రామంలో 360 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనంచేసుకున్న లాడ్జ్ వివరాలను ముజామిల్ డైరీలో అధికారులు గుర్తించారు.
అక్రమంగా పెద్ద ఎత్తున కొనుగోలుచేసిన ఎరువులను తమ యూనివర్సిటీ ల్యాబ్‌లోని రసాయనాల తో కలిపి అత్యంత వినాశకర, విస్ఫోటక అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్(ఏఎన్‌ఎఫ్‌ఓ)ను తయారుచేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందుకు బలం చేకూర్చేలా హాస్టల్ గదిలో పలు రకాల రసాయనాల జాడను ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు.
భారీ ఎత్తున ఎరువుల కొనుగోలు
ఉమర్ ఏకంగా రూ.26 లక్షల నిధులను సమీకరించాడు. ఇందులో రూ.3 లక్షలు ఖర్చుపెట్టి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే(నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్యం) ఫెర్టిలైజర్‌ను కొనుగోలుచేశాడు. గురుగ్రామ్, నూహ్, సమీప పట్టణాలకు చెందిన సప్లయర్ల ద్వారా వీటిని తెప్పించాడు. ఈ ఎరువులను ల్యాబ్‌లో తీసుకొచ్చిన రసాయనాలతో తొలుత సూక్ష్మస్థాయిలో అత్యంతపేలుడు పదార్థం(ఐఈడీ) తయారుచేశాడు. అది విజయవంతమయ్యాకే పేలుడు పదార్థాలను సొంత కార్లలో ధౌజ్, తాగా గ్రామాల్లోని తమ స్థావరాలకు తరలించారు. అక్కడే కార్లకు బాంబు సర్క్యూట్‌లను బిగించి లక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్లాన్ చేశారు.

**థ్రీమా మెసేజింగ్ యాప్‌లో చాటింగ్**

తమ ప్లాన్ ఎవరికీ తెలీకూడదనే ఉద్దేశంతో స్విట్జర్లాండ్‌కు చెందిన మెసేజింగ్ యాప్ 'థ్రీమా'లో ఉమర్, ముజామిల్ ఘనీ, వైద్యురాలు షాహీన్ సయీద్‌లు చాటింగ్ చేసుకునేవారు. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లోని కీలకమైన సభ్యులతో చర్చించేందుకు ఉమర్ విడిగా సిగ్నల్ యాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశాడు. 4 నగరాల్లో పేలుళ్లకు సంబంధించిన ప్లాన్‌ను నేరుగా పర్యవేక్షించేందుకు ఒక్కో నగరానికి ఇద్దరు ఉగ్రవాదుల చొప్పున మొత్తం ఎనిమిది మంది కీలక సభ్యులను ఎంపికచేశాడు.

**వర్సిటీని జల్లెడ పడుతున్న అధికారులు**

ఒకే వర్సిటీలో ఒకే వృత్తిలోని వ్యక్తులు ఉగ్రభావజాలంలో మునిగిపోవడంతో ఈ విద్యాసంస్థ ఉగ్రఅడ్డాగా మారిందా? అనే కోణంలో దర్యాప్తు అధికారులు వర్సిటీని జల్లెడపడుతున్నారు. వర్సిటీకి సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లను ఫోరెన్సిక్ ఆడిట్‌కు పంపించారు. ఇప్పటికే దొరికిన ఆధారాలతో ఇక్కడి విద్యార్థుల ఫోన్ నంబర్లు, సామాజిక మాధ్యమ ఖాతాలు, సొంత గ్రామాల చిరునామాలు సరిపోలుతాయో లేదోనని చెక్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అరెస్టయిన వైద్యురాలు షాహీన్‌తో సత్సంబంధాలున్న 32 ఏళ్ల వైద్య విద్యార్థి మొహమ్మద్ ఆరిఫ్ మిర్‌ను పోలీసులు గురువారం అరెస్ట్‌చేశారు. ఆరిఫ్ ప్రస్తుతం కాన్పూర్‌లోని లక్ష్మీపత్ సింఘానియా కార్డియాలజీ, కార్డియాక్ సర్జరీ కాలేజీలో ఎండీ వైద్య విద్యనభ్యసిస్తున్నాడు.
కశ్మీర్‌లోని ఖాగూర్ సాదవారీ ప్రాంతం ఆరిఫ్ స్వస్థలం. నజీరాబాద్‌లో ఆరిఫ్ ఇంట్లోంచి పోలీసులు ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనంచేసుకున్నారు. ఏటీఎస్ బృందం వచ్చే సమయానికి ఆరిఫ్ తన ఫోన్ డేటాను తొలగిస్తూ కనిపించాడు. ఆరిఫ్‌కు గతంలో నీట్ సూపర్ స్పెషాలిటీ ఎగ్జామినేషన్‌లో ఆలిండియా 1608 ర్యాంక్ రావడం విశేషం. ఇంతటి ప్రతిభావంతుడు ఉగ్రవాదులతో చేతులు కలపడం ఆశ్చర్యంగా ఉందని కాలేజీ ప్రిన్సిపల్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ పట్టణంలోని జీఎస్ మెడికల్ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ ఫారూఖ్‌ను ఢిల్లీ పోలీసులు ఇదే కేసులో గురువారం అరెస్ట్ చేశారు. ఇతను కూడా గతంలో అల్%–%ఫలాహ్ కాలేజీలోనే విద్యనభ్యసించాడు. వీళ్లంతా ఒకే ఈ%–%మెయిల్ ఐడీని వాడుతున్నట్లు గుర్తించారు.

**ఎట్టి పరిస్థితుల్లోనూ చిక్కకుండా చిక్కుముడి రూట్**

ఢిల్లీకి వచ్చేటప్పుడు మార్గమధ్యంలో పోలీసులకు చిక్కకుండా ఫరీదాబాద్ నుంచి ఉమర్ ప్రయాణించిన మార్గాన్ని పోలీసులు గుర్తించారు. డజన్లకొద్దీ సీసీటీవీ ఫుటేజీలను జల్లెడపట్టాక అతని ప్రయాణరూట్‌పై ఒక స్పష్టత వచ్చింది. ఆదివారం అతను ఫరీదాబాద్ నుంచి బయల్దేరి ఢిల్లీ%–%ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణించాడు. నూహ్ జిల్లాలోని ఫిరోజ్‌పూర్ ఝిర్కాకు రాగానే రోడ్డు పక్కన ధాబా వద్ద ఆగాడు. వెనక సీట్లో పెద్ద బ్యాగులో బాంబు ఉండటంతో ఎటూ పోకుండా కారులోనే కూర్చున్నాడు.
రాత్రంతా కారులోనే నిద్రపోయాడు. మార్గమధ్యంలో పట్టణాల మీదుగా వెళ్లకుండా గ్రామాలమీదుగా వెళ్లాడు. పెద్ద హోటళ్లలో తినకుండా రోడ్డు పక్కన చిన్న హోటళ్లలో భోజనాలు కానిచ్చాడు. బదార్‌పూర్ బోర్డర్ గుండా ఢిల్లీకి చేరుకున్నాడు. సరళరేఖ మార్గంలో వెళ్లకుండా గజిబిజి ప్రయాణాల చేశాడు. తూర్పు ఢిల్లీ, ఓఖ్లా, పారిశ్రామిక నడువా, కన్నాట్ ప్లేస్ ఇలా వేర్వేరు చోట్ల తిరిగి చివరకు ఎర్రకోట వద్దకు చేరుకున్నాడు. ఎక్కువ రద్దీ ఉంటే చోట్ల తనిఖీలు, ట్రాఫిక్ పోలీసుల నిఘా ఉండదనే ఉద్దేశ్యంతో ఆ మార్గాల్లో ప్రయాణించాడు.

**ఉమర్ మూడో కారు లభ్యం**

వర్సిటీ పార్కింగ్ ప్రదేశంలో ఉమర్ మూడో కారును పోలీసులు గుర్తించారు. ఇది ఇప్పటికే అరెస్టయిన వైద్యురాలి పేరిట ఉంది. దీనిని ఉమర్ పేలుడు పదార్థాల రవాణా కోసం ఉపయోగించినట్లు అనుమానిస్తున్నారు. మొత్తం పేలుళ్లకు 32 కార్లు అవసరమని, వాటిల్లో కొన్నింటిని కొత్తగా కొనుగోలుచేయాలని పథక రచనచేశారు. పలువురిచేతులు మారి మూలాలు కనిపెట్టలేని పాత కార్లను దాడుల కోసం ఎంచుకున్నారు. మరోవైపు అల్%–%ఫలాహ్ వర్సిటీ సభ్యత్వాన్ని రద్దుచేస్తున్నట్లు 'ది అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్'(ఏఐయూ) గురువారం ప్రకటించింది. విద్యాప్రమాణాల మేరకు సంస్థను నడపని ఈ వర్సిటీకి సంఘంలో ఉండే అర్హతలేదని ఏఐయూ తెలిపింది

**పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం 10 మంది అరెస్టు**

చండీగఢ్: పంజాబ్‌లో మరో ఉగ్రవాద కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ అండదండలతో గ్రెనేడ్ దాడికి ముష్కరులు పథకం వేయగా, పోలీసులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కుట్రకు సంబంధించి 10 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో గ్రెనేడ్ దాడి చేసి, అశాంతి సృష్టించాలన్నదే వారి అసలు లక్ష్యమని విచారణలో పోలీసులు తేల్చారు. పాకిస్తాన్‌లోని హ్యాండ్లర్స్‌తో వారు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారని చెప్పారు. ముగ్గురు నిందితులను కులదీప్ సింగ్, శేఖర్ సింగ్, అజయ్ సింగ్‌గా గుర్తించారు. వారు పంజాబ్‌లోని శ్రీముక్త్సార్ సాహిబ్‌కు చెందినవారేనని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ప్రకటించారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు

ఢిల్లీ : బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా గత సంవత్సరం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఢాకాలోని ప్రత్యేక ట్రిబ్యునల్ కోర్టు ఈ నెల 17న తీర్పు వెలువడించనున్నది. ఈ క్రమంలో అవామీ లీగ్ పార్టీ కోర్టు ఇచ్చే తీర్పుకు నిరసనగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. దీంతో చాలా ప్రాంతాల్లో అల్లర్లు, దాడులు జరిగాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం దేశ రాజధానితోపాటు, తీర్పును వెలువరించే



ప్రాంతంలో గత ఘటనలు దృష్టిలో ఉంచుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. అనుమానిత ప్రాంతాల్లో భద్రతను పటిష్ఠం చేశారు.

# కొలువుల్లో వాటా పెరిగింది

భారత్‌లో కృత్రిమ మేధతో (ఏఐ) నడిచే రంగాలు తమ నియామకాల సరళిలోని ప్రాధాన్యాలను మార్చుకోవడంతో ఐదేళ్లలో తొలిసారిగా మహిళల ఉపాధి సామర్థ్యం పురుషులను మించిపోయిందని ఇండియా స్కిల్స్%–%2026 నివేదిక వెల్లడించింది. ప్రధానంగా కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఇంజనీరింగ్ రంగాలు ఉపాధి సామర్థ్యాల కొలమానాల్లో అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. కంప్యూటర్ సైన్స్ పట్టభద్రులు 80 శాతం, ఐటీ ఇంజనీర్లు 78 శాతం ఉపాధి సామర్థ్యం కలిగి ఉన్నట్లు తెలిపింది. వారిలో పురుషుల కంటే మహిళా గ్రాడ్యుయేట్స్‌కే నియామకాల్లో ఎక్కువ ప్రాధాన్యం లభిస్తున్నట్లు పేర్కొంది. ఏఐ, డేటా అనలిటిక్స్, ఆటోమేషన్‌కు సంబంధించిన విభాగాలు మహిళలకు విరివిగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించింది. నిపుణుల కొరతను నిరంతరంగా ఎదుర్కొంటున్న కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా, సైబర్ సెక్యూరిటీ రంగాలలోని సంస్థలు.. సూక్ష్మ%–%క్రెడెన్షియల్స్ (నిర్దిష్ట నైపుణ్యాలు), పరిమిత స్థాయి యోగ్యతలు కలిగి ఉన్నప్పటికీ మహిళలను నియమించుకుంటున్నాయి. ఏఐ ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని మహిళా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలలోకి తీసుకోవటం, మహిళల నైపుణ్యాలకు ఎక్కువ అవకాశాలకు లభించటం కూడా ఒక కారణమని నివేదిక తెలిపింది.

**ఐదేళ్లలో ముందడుగు..**

ప్రస్తుతం మహిళల ఉద్యోగ సామర్థ్యం రేటు 54 శాతం వద్ద ఉంది. ఐదేళ్లలో మొదటిసారిగా పురుషులను దాటి మెరుగైన ప్రతిభను కనబరిచారు. పురుషుల విషయంలో ఈ సామర్థ్యం రేటు 51.5 శాతం ఉంది. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో



మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్యం నగరాలు, పట్టణ ప్రాంతాలలో గణనీయంగా పెరిగాయి. న్యాయ, ఆరోగ్య సేవల రంగాలలోని ఉద్యోగ అవకాశాలపై మహిళలు వరుసగా 96.4 శాతం, 85.95 శాతం మంది ఆసక్తి చూపుతుండగాబీ పురుషుల్లో 83.11 శాతం మంది గ్రాఫిక్ డిజైన్, 64.67 శాతం మంది ఇంజినీరింగ్ డిజైన్ ఉద్యోగావకాశాల వైపు మొగ్గు చూపుతున్నారు.

**'ఫాస్ట్ మూవింగ్..' లోనూ..!**

ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్ వంటి రంగాలు 1–5 సంవత్సరాల అనుభవం ఉన్న మహిళల్ని ఎక్కువగా నియమించుకుంటున్నాయి. ఆ తర్వాతి స్థానాలలో ఎఫ్ఎంసీజీ, బీఎఫ్ఎస్ఐ మహిళా నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఐటీలో ఇటీవల గ్రాడ్యుయేట్ల నియామకాలు 35 శాతానికి చేరుకోవడం విశేషం. వీరిలో మహిళలకే కాస్త ఎక్కువగా ప్రాధాన్యం లభిస్తోందని నివేదిక పేర్కొంది. కామర్స్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగ అవకాశాలు గత సంవత్సరం ఉన్న 55 శాతం నుంచి ఈ ఏడాదికి 62.81 శాతానికి పెరిగాయి. సైన్స్, ఆర్ట్స్‌కి సంబంధించిన రంగాలు కూడా ఉద్యోగ అవకాశాల పెరుగుదలను నమోదు చేశాయి. ఈ మూడింటిలోనూ మహిళల భాగస్వామ్యం అధికంగా ఉందని నివేదిక తెలిపింది.

## హౌసింగ్ స్కాంలో ఎస్ఎల్‌బీసీ కాంట్రాక్టర్ అరెస్టు

**జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ మనోజ్‌గౌర్‌పై ఈడీ చర్య**

**ఢిల్లీ, హరియాణాలో జేపీ ఇన్‌ఫ్రా పలు హౌసింగ్ ప్రాజెక్టులు**

**రూ.14,599 కోట్ల మనీలాండరింగ్ !**



న్యూఢిల్లీ/హైదరాబాద్

హౌసింగ్ ప్రాజెక్టుల్లో వేల కోట్ల మనీలాండరింగ్ కుంభకోణానికి సంబంధించి జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ మనోజ్‌గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. తెలంగాణలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కాంట్రాక్టు పనులను ఇదే మనోజ్‌గౌర్‌కు చెందిన జేపీ గ్రూపు కంపెనీ చేపట్టింది. ఇటీవల ఆ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు మరణించిన సంగతి తెలిసిందే. గౌర్ నేతృత్వంలోని జేపీ ఇన్‌ఫ్రా సంస్థ ఢిల్లీ, హర్యానాలో జేపీ విష్‌టౌన్, జేపీ గ్రీన్స్ పేరిట పలు హౌసింగ్ ప్రాజెక్టులు ప్రారంభించి వేలాది మంది కొనుగోలుదారుల నుంచి వందల కోట్లను వసూలు చేసింది. ఆ నిధులను గృహ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఉపయోగించుకుండా, వాటిని వివిధ ట్రస్టులు, అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. హౌసింగ్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, ఫ్లాట్లను అప్పగించకపోవడంతో మోసపోయిన వేలాది మంది పెట్టుబడిదారులు ఢిల్లీ, యూపీలలోని ఆర్థిక నేరాల విభాగం వద్ద అనేక కేసులు నమోదు చేశారు. వాటి ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ జేపీ గ్రూపునకు చెందిన రెండు సంస్థలు జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్), జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (జేఐఎల్) గృహ కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన రూ. 14,599 కోట్ల భారీ మొత్తాన్ని జేపీ సేవా సంస్థాన్ (జేఎస్ఎస్), జేపీ హెల్త్‌కేర్ లిమిటెడ్ (జేహెచ్ఎల్), జేపీ స్పోర్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (జేఎస్ఐఎల్) వంటి అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు గుర్తించింది. మే 23న ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబైలోని సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేసిన ఈడీ భారీ మొత్తంలో ఆర్థిక పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. నిధుల మళ్లింపులో గౌర్ కీలక పాత్ర పోషించినట్లు నిర్ధారించింది.

# కొలెస్ట్రాల్ తగ్గేందుకు ఓ సింపుల్ చిట్కా



శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం మంచిదే. కానీ, అది పెరిగితే మాత్రం ముప్పు. ధమనుల్లో అడ్డంకులు ఏర్పడి.. గుండెకు ప్రమాదాన్ని కలిగిస్తుంది. అందుకే కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలి. మందులు అవసరం లేకుండా.. ఇంట్లో దొరికే పదార్థాలతోనే కొలెస్ట్రాల్ తగ్గించుకోవచ్చని ఆయుర్వేద డాక్టర్ సలీం జైదీ చెప్పారు. ఈ రోజుల్లో చాలా మంది అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల ధమనుల్లో రక్త ప్రవాహం తగ్గిపోతుంది. దీని వల్ల శ్వాస ఆడకపోవడం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధమనులు.. రక్త నాళాలు, గుండెనాళాల నుంచి శరీరంలోని వివిధ భాగాలకు రక్తాన్ని తీసుకువెళతాయి. ఈ రక్తం శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్, పోషకాల్ని అందిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడుతాయి. ఈ సమస్య క్రమంగా తీవ్రమవుతుంది. దీంతో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. పెరిగిన కొలెస్ట్రాల్ తగ్గించేందుకు ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ సలీం జైదీ ఓ చిట్కా చెప్పారు. మన వంటగదిలో దొరికే పదార్థాలతోనే పెరిగిన కొలెస్ట్రాల్ తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు. లెస్ట్రాల్ పెరగడం వల్ల ధమనల్లో అడ్డంకులు ఏర్పడి.. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి కారణమవుతాయని డాక్టర్ సలీం జైదీ చెప్పారు. వెల్లుల్లి, నిమ్మ, అల్లం, తేనె, యాపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించి రసం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ రసం తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుంతుందని ఆయన చెప్పారు. దీనిని రోజూ తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ సరిగ్గా ఉంటుందని సూచించారు. వెల్లుల్లిలో అల్లిసిన్ ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. అంతేకాకుండా ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా నిరోధించడంలో సాయపడతాయి. వెల్లుల్లి ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. నిమ్మకాయలో రోగనిరోధక శక్తిని బలపరిచే విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు అధికంగా ఉంటాయి. దీంతో నిమ్మకాయను తీసుకోవడం వల్ల బ్లాక్ చేయబడిన ధమనులు క్లియర్ అవుతాయి. అంతేకాకుండా కొలెస్ట్రాల్ తగ్గి.. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వంటగదిలో దొరికే ఔషధం అల్లం. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. రోజూ ఓ చిన్న అల్లం ముక్క తినడం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. అల్లంలో జింజెరాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఇన్ఫ్లమేషన్ అంటే శరీరంలో మంట, వాపును నియంత్రిస్తుది. ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షిస్తుంది. తేనె ఔషధ గుణాలతో కూడిన సహజ స్వీటెనర్. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. తేనెలో ధమనుల్ని శుభ్రపరచడంలో సహాయపడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. తేనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరం వ్యాధులతో పోరాడటానికి సాయపడతాయి.

# ఈ పండ్లు తింటే కోలన్ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది



ఆరోగ్యంగా జీవించడానికి.. మొదటి పునాది మన గట్ హెల్త్ అని చెప్పొచ్చు.. అంటే జీర్ణవ్యవస్థ సరిగా పనిచేయడం. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, మనం ప్రతిరోజూ తినే ఆహారం నేరుగా మన గట్ మైక్రోబయోమ్‌ను ప్రభావితం చేస్తుంది. ఇది శరీరంలో ఉండే 'మంచి బ్యాక్టీరియా' సమూహం. ఈ మంచి బ్యాక్టీరియా ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించి, కోలన్ క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి. సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురించి ఒక అధ్యయనం ప్రకారం.. జనాభా పెరగడం, వృద్ధాప్యం, మానవ అభివృద్ధి కారణంగా 2040 లో ప్రపంచవ్యాప్తంగా 3.2 మిలియన్ల కొత్త కొలొరెక్టల్ క్యాన్సర్ కేసులు పెరిగే అవకాశం ఉందని అంచనా. హార్వర్డ్‌లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి.. మన పేగు ఆరోగ్యానికి మేలు చేసి.. కోలన్ క్యాన్సర్ ముప్పును తగ్గించే.. కొన్ని పండ్లను మనతో షేర్ చేసుకున్నారు. వాటిలో పోషకాలు, ఫైబర్ సమృద్ధిగా ఉండటమే కాదు, జీర్ణక్రియకు మద్దతు ఇచ్చే, ఇన్ఫ్లమేషన్ తగ్గించే, క్యాన్సర్ ముప్పును తగ్గించే.. సమ్మేళనాలు ఉంటాయి. యాపిల్.. డాక్టర్ సేథి యాపిల్‌లోని పెక్టిన్ కంటెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పారు. ఇది గట్ బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేసే ఒక రకమైన కరిగే ఫైబర్. పెద్దప్రేగులో పులిసినప్పుడు.. పెక్టిన్ బ్యూటిరేట్ వంటి షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్‌లను ఉత్పత్తి చేస్తుంది, ఇవి పెద్దప్రేగు కణాలను క్యాన్సర్‌గా మారకుండా కాపాడతాయి. ఫ్రాంటియర్స్‌లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం.. ఆపిల్‌ను రోజూ తింటే.. ఆరోగ్యకరమైన గట్ హెల్త్‌కు మోలు చేస్తుంది, హానికరమైన బ్యాక్టీరియాను తగ్గిస్తుందని, మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ముఖ్యంగా యాపిల్ తొక్కల్లో క్వెర్సెటిన్ ఉంటుంది, ఇది కణాలలో డిఎన్ఎ నష్టాన్ని నివారించే.. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. కివి.. పేగు ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో కివీ ఒకటి. దీనిలో ఆక్టినిడిన్ ఉంటుంది, ఇది ప్రోటీన్‌ను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడే సహజ ఎంజైమ్. ఎన్ఐహెచ్ పరిశోధన ప్రకారం కివీ.. ప్రేగు క్రమబద్ధతను ప్రోత్సహిస్తుంది, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇవి పేగు క్యాన్సర్ రావడానికి ముఖ్య కారణాలు అని చెప్పొచ్చు. ఈ పండులో యాంటీఆక్సిడెంట్లు, ప్రీబయోటిక్‌ల ప్రత్యేక మిశ్రమం.. పేగు గోడను బలోపేతం చేస్తాయి, ఇన్ఫ్లమేషన్ తగ్గిస్తాయి, క్యాన్సర్ ముప్పు తగ్గిస్తాయి. సిట్రస్ పండ్లు.. నారింజ, నిమ్మ, ద్రాక్షపండ్లు లాంటి సిట్రస్ పండ్లు.. రిఫ్రెషింగ్‌గా ఉండటమే కాదు.. అవి న్యాచురల్ డీటాక్స్‌లా పనిచేస్తాయి. సిట్రస్ పండ్లలో ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి అధికంగా ఉంటుందని డాక్టర్ సేథి అన్నారు. ఇవి పేగుల్లో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి.. క్యాన్సర్‌కు ముఖ్యకారణం. ఎన్ఐహెచ్‌లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. సిట్రస్ పండ్లలోని హెస్పెరిడిన్, నరింగెనిన్ వంటి సమ్మేళనాలు పెద్దప్రేగులో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. దానికి మించి, సిట్రస్ పండ్లలోని కరిగే ఫైబర్ గట్ బాక్టీరియాను పోషిస్తుంది, సమతుల్య మైక్రోబయోమ్‌ను నిర్వహించడానికి సహాయపడుతుంది. పుచ్చకాయ.. పేగు ఆరోగ్యానికి ఫైబర్ మాత్రమే కాదు.. హైడ్రేషన్ కూడా చాలా ముఖ్యమని డాక్టర్ సేథి అన్నారు. వాటర్ కంటెంట్ సమృద్ధిగా ఉండే.. పుచ్చకాయలు పెద్దపేగును హైడ్రేట్‌గా ఉంచుతాయి. జీర్ణక్రియను సజావుగా సాగేలా చేస్తుంది. పుచ్చకాయలో లైకోపీన్ ఉంటుంది, ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. లైకోపీన్‌లో క్యాన్సర్ నిరోధక లక్షణాలు ఉన్నాయని ఓ అధ్యయనం తెలిపింది.

# ఉడకబెట్టిన గుడ్డు లేదా ఆమ్లెట్.. బరువు తగ్గడానికి ఏది మంచిది?



గుడ్లు అత్యంత చౌకైన, సులభంగా అందుబాటులో ఉండే సూపర్ ఫుడ్స్‌లో ఒకటి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే ఇవి ప్రోటీన్‌కు అద్భుతమైన మూలం. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఆహారంలో గుడ్లు ఒక ముఖ్యమైన భాగం. అయితే కేవలం గుడ్లు తినడం మాత్రమే కాకుండా, మీరు వాటిని ఏ విధంగా వండుతున్నారు అనేదానిపైనే బరువు తగ్గడంలో వాటి ప్రభావం ఆధారపడి ఉంటుందని కొత్త పరిశోధన వెల్లడిస్తోంది. అమెరికన్ కెమికల్ సొసైటీ యొక్క జర్నల్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ ఫుడ్ కెమిస్ట్రీలో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఈ విషయంపై కీలక వివరాలను అందించింది. పరిశోధన ప్రకారం.. గుడ్లు ఉడికించే విధానం, గుడ్డులోని ప్రోటీన్ శరీరం ఎలా గ్రహిస్తుంది, జీర్ణం చేస్తుంది అనేదానిని నిర్ణయిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు గుడ్లను ఏ పద్ధతిలో వండుతున్నారనేది చాలా ముఖ్యం. గుడ్డును ఉడకబెట్టినప్పుడు, అదనంగా నూనె లేదా కొవ్వు పదార్థాలు వాడాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల ఉడికించిన గుడ్లలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ప్రోటీన్ నిర్మాణం స్థిరంగా ఉండటం వలన, శరీరం దానిని సులభంగా ఉపయోగించుకోగలుగుతుంది. త్వరగా జీర్ణమవుతుంది. ఉడకబెట్టిన గుడ్లు వ్యాయామం తర్వాత కండరాలు కోలుకోవడానికి కూడా సహాయపడుతుంది. ముఖ్యంగా గుడ్డులో ఉండే అధిక ప్రోటీన్ కారణంగా కడుపు ఎక్కువసేపు నిండుగా అనిపిస్తుంది. దీనివల్ల తరచుగా ఆకలి వేయదు. దాంతో అనవసర స్నాక్స్ లేదా అధిక ఫుడ్ తినకుండా ఉంటారు. ఆమ్లెట్ లేదా వేయించిన గుడ్లను చేసేటప్పుడు, నూనె, నెయ్యి లేదా వెన్న వంటి కొవ్వు పదార్థాలను తప్పనిసరిగా ఉపయోగిస్తారు. దీని కారణంగా గుడ్డుకు అదనపు కేలరీలు యాడ్ అవుతాయి. దీనితో పాటు కొంతమంది ఆమ్లెట్‌లో చీజ్, ప్రాసెస్ చేసిన మాంసం వంటివి కలుపుతారు. ఇది కొవ్వు, సోడియం పరిమాణాన్ని మరింత పెంచుతుంది. తద్వారా బరువు తగ్గే ప్రయత్నాలకు ప్రతికూలంగా మారుతుంది. బరువు తగ్గడానికి మీ డైట్‌లో గుడ్లను చేర్చుకోవాలని మీరు భావిస్తే.. ఉడికించిన గుడ్లు తీసుకోవడమే అత్యంత ప్రయోజనకరం అని ఈ నివేదికలు సూచిస్తున్నాయి. ఇవి తక్కువ కేలరీలతో అధిక ప్రోటీన్‌ను అందిస్తాయి.

# జీవనశైలితోనే క్యాన్సర్ ప్రభావం



ఆధునిక జీవన శైలిలో క్యాన్సర్ పెరుగుదల ఒక తీవ్రమైన ఆందోళనగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 మిలియన్ల మంది క్యాన్సర్ కారణంగా మరణిస్తున్నారు. వాస్తవానికి, క్యాన్సర్ ఇప్పుడు మరణానికి రెండవ ప్రధాన కారణంగా నిలిచింది. భారతదేశంలో ప్రతి సంవత్సరం 1.4 మిలియన్లకు పైగా కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. క్యాన్సర్ అనేది శరీరంలోని కొన్ని కణాలు అసాధారణంగా పెరిగి, చుట్టుపక్కల అవయవాలపై ప్రభావం చూపే వ్యాధి.
దీన్ని ముందుగానే గుర్తించకపోతే, అది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాప్తి చేసి ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉంది. కొన్ని రకాల క్యాన్సర్లు జీవనశైలికి నేరుగా ముడిపడి ఉంటాయి. ధూమపానం, మద్యం, జంక్ ఫుడ్, ఊబకాయం, శారీరక వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి వంటి అలవాట్లు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ప్రత్యేకంగా ఊపిరితిత్తులు, కాలేయం, నోరు, రొమ్ము, గర్భాశయం, పెద్దప్రేగు క్యాన్సర్లు ఈ జీవనశైలి ప్రభావం వల్ల వస్తాయి. ఇంకా కొన్ని క్యాన్సర్లు, ఉదాహరణకు రక్త క్యాన్సర్, మెదడు కణితులు లేదా అండాశయ క్యాన్సర్, పూర్తిగా జీవనశైలిపై ఆధారపడి ఉండవు. ఇవి జన్యు, హార్మోన్లు లేదా ఇతర ఆంతరిక కారకాలు వల్ల వస్తాయని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం వల్ల క్యాన్సర్ రిస్క్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. 1. ధూమపానం, పొగాకు పూర్తిగా మానేయడం – ఊపిరితిత్తులు, గొంతు, నోరు, కడుపు క్యాన్సర్ ప్రధాన కారణాలు కావున ఇవి అత్యంత హానికరం. 2. ఆరోగ్యకరమైన జీవనశైలి – సమతుల్య ఆహారం, క్రమపద్ధతిగా వ్యాయామం, బరువు నియంత్రణ. ఇవి రొమ్ము, పెద్దప్రేగు, కాలేయ క్యాన్సర్ రిస్క్‌ను తగ్గిస్తాయి. 3. నియమిత ఆరోగ్య పరీక్షలు, టీకాలు – హెచ్‌పివి, హెపటైటిస్ బి టీకాలు కొన్ని రకాల క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. ప్రారంభ దశలో క్యాన్సర్ గుర్తించటం ద్వారా చికిత్స సులభతరం అవుతుంది.


# బ్రెడ్ తింటున్నారా? ఇలా అయితే మీ ఆరోగ్యం భద్రమా?



బిజీ లైఫ్‌స్టైల్‌లో చాలామంది ఆహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ముఖ్యంగా ఉదయం తీసుకునే అల్పాహారం విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. చాలామంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా మానేస్తారు లేదా బ్రెడ్ వంటి సరళమైన ఆహారాన్ని తీసుకుంటారు. ఎక్కువ మంది వైట్ బ్రెడ్‌ను ఇష్టపడతారు. వైట్ బ్రెడ్‌తో చేసిన శాండ్‌విచ్‌లు అత్యంత ప్రాచుర్యం పొందాయి. అయితే, దీని వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉండవు, ముఖ్యంగా మైదాతో తయారు చేయబడడం ప్రధాన కారణం. వైట్ బ్రెడ్‌లోని ప్రాసెస్ చేసిన పిండి శరీరంలో చాలా వేగంగా గ్లూకోజ్‌గా మారుతుంది. దీనిలో ఫైబర్ ఉండకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తారుమారు పెరుగుతాయి. ఈ పెరుగుదల తాత్కాలిక శక్తిని ఇస్తుంది, కానీ ఇన్సులిన్ త్వరగా స్పందించి షుగర్ లెవెల్‌ను తగ్గిస్తుంది. ఫలితంగా, ఆ శక్తి కూడా త్వరగా తక్కువ అవుతుంది. దీని కారణంగా అలసట, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు వస్తాయి. ప్రాసెస్ చేసిన ధాన్యాలు మరియు అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాన్ని తరచుగా తీసుకోవడం ద్వారా టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. వైట్ బ్రెడ్‌లో ఫైబర్ లేకపోవడం వల్ల అది జీర్ణవ్యవస్థలో వేగంగా కదిలి సులభంగా జీర్ణమవుతుంది. ఫలితంగా, అల్పాహారం తీసుకున్న కొన్ని గంటల తర్వాత మళ్లీ ఆకలి అనిపిస్తుంది. ఇది తరచుగా ఉదయం స్నాక్స్ లేదా అనవసరమైన ఆహారం తినడానికి దారితీస్తుంది. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారికి ఇది మరింత హానికరం. వైట్ బ్రెడ్ తక్షణ శక్తిని ఇస్తుంది, కానీ దీర్ఘకాలంలో అది కొవ్వు నిల్వకు దారితీస్తుంది. ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలను పెంచుతాయి, ఫలితంగా మెటబాలిక్ డిసార్డర్స్ కలిగే ప్రమాదం పెరుగుతుంది. వ్యాయామం చేయని వ్యక్తులకోసం ఇది మరింత హానికరం. తెల్ల బ్రెడ్‌లో ఫైబర్ లేకపోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. గోధుమలను ప్రాసెస్ చేసినప్పుడు ఫైబర్ ఉన్న ఊక తొలగించబడుతుంది. ఫలితంగా, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ లేదా అజీర్తి వంటి సమస్యలు రావచ్చు. వైట్ బ్రెడ్ తినేవారు పండ్లు, కూరగాయలను కూడా తినే ప్రయత్నం చేయాలి. ఇది కొంతవరకు హానిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఫైబర్ సరిగ్గా పని చేయడానికి, సరిపడినంత నీరు త్రాగడం కూడా అవసరం. ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లను తరచుగా తీసుకోవడం బరువు, ఆకలి మాత్రమే కాకుండా ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది, ట్రైగ్లిజరైడ్లను పెంచుతుంది, శరీరంలో మంటను పెంచుతుంది. దీర్ఘకాలిక మంట గుండె సంబంధిత వ్యాధులు, మెటబాలిక్ సిండ్రోమ్ మరియు ఇతర సమస్యలకు దారి తీస్తుంది.

## బిజినెస్

### రూ. 4 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద




అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సానుకూలత, ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్ల కారణంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడవ సెషన్‌లో లాభాలను కొనసాగిం చాయి. ముఖ్యంగా త్వరలో వాణిజ్య ఒప్పందం జరుగుతుందని, భారత్‌పై సుంకాలు తగ్గిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన మార్కెట్ల సెంటిమెంట్‌ను పెంచాయి. మరోవైపు బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ అధికారాన్ని సొంతం చేసుకుంటుందనే సంకేతాలు మరింత ఊతమిచాయి. ఈ క్రమంలోనే కీలక ఐటీ, ఆటో రంగాల షేర్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్ల సంపద రూ. 4 లక్షల కోట్లకు పైగా పెరిగింది. తద్వారా లిస్టెడ్ కంపెనీల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.469 లక్షల కోట్ల నుంచి రూ.473 లక్షల కోట్లకు పెరిగింది. మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 595.19 పాయింట్లు లాభపడి 84,466 వద్ద, నిఫ్టీ 180.85 పాయింట్లు పెరిగి 25,875 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో ఏషియన్ పెయింట్, టెక్ మహీంద్రా, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు అధిక లాభాలను సాధించాయి. టాటా స్టీల్, టీఎంపీవీ, టీఎంసీవీ, బీఈఎల్ షేర్లు నష్టాలను నమోదు చేశాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 88.61 వద్ద ఉంది.

### రెండవ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి(జూలై–సెప్టెంబర్) సంబంధించి దేశ జీడీపీ 7.2 శాతం వృద్ధిని సాధిస్తుందని ప్రముఖ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్(ఇండ్–రా) తెలిపింది. బలమైన ప్రైవేట్ వినియోగం, సేవల రంగంలో స్థిరమైన వృద్ధిని ఇందుకు దోహదపడ్డాయని ప్రకటనలో ఇండ్–రా నివేదిక అభిప్రాయపడింది. గతేడాది ఇదే సమయంలో దేశ జీడీపీ 5.6 శాతంగా, ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో అంచనాలను దాటి వృద్ధి 7.8 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. ఇది గత ఐదు త్రైమాసికాల్లోనే అత్యంత వేగవంతమైన వృద్ధి. ఉన్నత, దిగువ–ఆదాయ వర్గాల ఆదాయం పెరగడంతో ప్రైవేటు వినియోగం జీడీపీ వృద్ధికి చోదక శక్తిగా మారిందని ఇండ్–రా తెలిపింది. పటిష్టమైన దేశీయ డిమాండ్ కారణంగా ఆర్థికవ్యవస్థ అంచనాల కంటే మెరుగ్గా వృద్ధిని సాధించింది. ప్రపంచ సవాళ్లు, భౌగోళిక రాజకీయ పరిణామాలను భారత ఆర్థికవ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొందని నివేదిక స్పష్టం చేసింది. ఇదే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఊహించిన దానికంటే రిటైల్ ద్రవ్యోల్బణం వేగంగా తగ్గిందని, ఇది ఆదాయం, వినియోగాన్ని పెంచడానికి సహాయపడిందని నివేదిక పేర్కొంది..

# రూ. 60 వేలకే టాటా మోటార్స్ నుంచి బైక్స్ వస్తున్నాయా




దేశంలోనే అత్యంత విలువైన, విశ్వసనీయ సంస్థల్లో టాటా గ్రూప్ అన్నింటికంటే ముందు వరుసలో ఉంటుంది. చాలా మంది ఇదే చెబుతుంటారు. నాణ్యతకు మారుపేరుగా ఈ సంస్థ ఉంటుందని అంతా నమ్ముతుంటారు. ఆ గ్రూప్ నుంచి వచ్చే ప్రొడక్ట్స్‌పై ప్రజలకు నమ్మకం ఎక్కువే ఉంటుంది. దాదాపు అన్ని రంగాల్లో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న టాటా గ్రూప్ గురించి ఇటీవల కొన్ని నకిలీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అదే దిగ్గజ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశిస్తుందని వార్తలు రావడం. కొద్ది రోజులుగా దీనికి సంబంధించి.. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. టాటా గ్రూప్ లోగోతో.. బైక్స్ ఉన్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు కూడా దర్శనం ఇచ్చాయి. దీంతో ఇది నిజమనే చాలా మంది అనుకున్నారు. ముఖ్యంగా టాటా బైక్స్.. ప్రముఖ రాయల్ ఎన్‌ఫీల్డ్ లుక్‌లో తీసుకొస్తోందని.. దేశంలోనే అత్యంత చౌకగా రూ. 60 వేల లోపు ధరకే 125సిసి మోటార్ సైకిల్‌ను ఆవిష్కరించిందని ప్రచారం జరిగింది. ఈ బైక్ మైలేజీ ఏకంగా 90 కిలో మీటర్లుగా ఉంటుందని కొన్ని మోసపూరిత వెబ్‌సైట్స్, సోషల్ మీడియాల్లో కనిపించడంతో నిజమని నమ్మారు చాలా మంది. అయితే చాలా రోజులకు.. తమ బ్రాండ్‌పై పెరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు టాటా మోటార్స్ దీనిపై కీలక ప్రకటన చేసింది. టాటా మోటార్స్ ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశించడం లేదని సంస్థ అధికారికంగా ఖండించింది. దీని గురించి టాటా మోటార్స్ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. తమకు ద్విచక్ర వాహన రంగంలోకి ప్రవేశించాలనే ప్రణాళికలు ఏమీ లేవని క్లారిటీ ఇచ్చింది. టాటా మోటార్స్‌కు సంబంధించి.. ఏమైనా ఎలక్ట్రిక్, ప్యాసింజర్ వెహికిల్స్‌కు సంబంధించిన సమాచారం తమ అధికారిక వెబ్‌సైట్లలో మాత్రమే చూడాలని పేర్కొంది. దీంతో టాటాల నుంచి బైక్స్ రావట్లేదని జనానికి ఒక క్లారిటీ వచ్చింది. ఇప్పటికే టాటాల నుంచి బైక్స్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఫొటోలు నకిలీవి అని.. పలు ఫ్యాక్ట్ చెక్ టూల్స్ స్పష్టం చేశాయి. దీనిని పలు మీడియాలు కూడా పేర్కొన్నాయి. ప్రస్తుతానికి టాటా మోటార్స్.. ప్యాసింజర్, కమర్షియల్, ఎలక్ట్రిక్ వాహనాల్లో 4– వీలర్‌పైనే దృష్టి సారించింది. ఇటీవల టాటా మోటార్స్.. రెండు సంస్థలుగా విడిపోయింది. ప్యాసింజర్ వెహికిల్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కలిసి టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్‌గా.. ఇదే సమయంలో టాటా మోటార్స్ కమర్షియల్ వెహికిల్స్ లిమిటెడ్ అనే మరో కంపెనీగా వేరైంది. ఆ విభజన సమయంలోనూ టూ– వీలర్స్ గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## ఎగుమతుల ప్రోత్సాహానికి రూ.45,000 కోట్ల పథకాలు




అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావాన్ని భారతీయ ఎగుమతిదార్లు తట్టుకునే నిమిత్తం రూ.45,000 కోట్ల విలువైన రెండు పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఎమ్ఎస్ఎమ్ఈలు, తొలిసారి ఎగుమతి చేసే వారు, కార్మికులు అధికంగా ఉండే రంగాల కోసం రూ.25, 060 కోట్లతో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్‌కు అనుమతి నిచ్చింది. ఇందులో నిర్యత్ ప్రోత్సాహన్ (రూ.10,401 కోట్లు), నిర్యత్ దిశ(రూ.14,659 కోట్లు) అనే 2 ఉప పథకాలుంటాయి. రెండో పథకమైన క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ ఎక్స్‌పోర్టర్స్ (సీజీఎస్ఈ) కింద రూ.20,000 కోట్ల వరకు తాకట్టు అవసరం లేని రుణాలు ఇస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. అమెరికా టారిఫ్ ప్రభావం ఎక్కువగా పడుతున్న జౌళి, తోలు, రత్నాభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, సముద్ర ఉత్పత్తుల రంగాలకు ప్రాధాన్య మద్దతు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. గ్రాఫైట్, సీసియం, రుబిడియం, జిర్కోనియం వంటి కీలక ఖనిజాల ఉత్పత్తిని దేశీయంగా పెంచేందుకు వాటి రాయల్టీ ధరలను హేతుబద్ధీకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ ఖనిజాల గనులను వేలం వేసేందుకుబీ లిథియం, టంగ్‌స్టన్, అరుదైన భూఅయస్కాంత ఎలిమెంట్స్, నియోబియం వంటి వాటినీ వెలికి తీసేందుకు ఉపకరించ నుంది. సీసియం, గ్రాఫైట్, రుబిడియం, జిర్కోనియంపై రాయల్టీ తగ్గించడం వల్ల వీటి ఉత్పత్తి పెరిగే వీలుంది. గ్రాఫైట్‌ను విద్యుత్తు వాహనాల బ్యాటరీల్లో వినియోగిస్తు న్నారు. జిర్కోనియంను అణు ఇంధనం, ఏరోస్పేస్, ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగాల్లో వాడతారు. సీసియంను హైటెక్ ఎలక్ట్రానిక్స్, అటామిక్ క్లాక్స్, జీపీఎస్ వ్యవస్థలు, క్యాన్సర్ థెరపీ పరికరాల్లో వినియోగిస్తారు. రుబిడియంను ఫైబర్ ఆప్టిక్స్, టెలికాం, చీకటిలో చూసేందుకు వాడే పరికరాల్లో వినియోగిస్తారు.

# టెండూల్కర్ ఔట్.. ముంబై ఇండియన్స్‌కు శార్దూల్ ఠాకూర్?






ఐపీఎల్ 19వ సీజన్ రీటెన్షన్ గడువు సమీపిస్తోంది. ఆలోపు ఆటగాళ్ల ట్రేడింగ్, వదిలించుకోవాల్సిన క్రికెటర్ల గురించి ఫ్రాంచైజీలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే సంజూ శాంసన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ సైతం బిగ్ ప్లేయర్ శార్దూల్ ఠాకూర్‌ను కొనేందుకు సిద్ధమవుతోంది. అయితే.. పరస్పర బదలాయింపు విధానాన్నేముంబై అనుసరించే అవకాశ ముంది. లక్నో సూపర్ జెయింట్స్ ఆల్‌రౌండర్ అయిన శార్దూల్‌ను స్వాప్ విధానంలో లేదంటే డబ్బులకైనా తమ గూటికి చేర్చుకోవాలని ముంబై యాజమాన్యం భావిస్తోంది. ట్రేడ్ పద్ధతికి లక్నో అంగీకరిస్తే.. గత సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోని అర్జున్ టెండూల్కర్‌ను లక్నోకు ఇచ్చేయాలని ముంబై అనుకుంటోంది.ఇదే విషయమై లక్నో, ముంబై మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ స్వాప్ డీల్ కుదిరితే సరే.. లేదంటే శార్దూల్‌ను ఎలాగైనా కొనేందుకు ముంబై ఫిక్స్ అయిందని సమాచారం. పద్దెనిమిదో సీజన్‌లో పెద్దగా రాణించని శార్దూల్‌ను వదిలేసుకోవడమే మంచిదని సంజీవ్ గొయెంకా టీమ్ నిర్ణయించుకుంది. అనుభవజ్ఞుడైన ఈ ఆల్‌రౌండర్ సేవల్ని ఉపయోగించుకునేందుకు ముంబై ఆసక్తి చూపించింది. గాయపడిన పేసర్ దీపక్ చాహర్ స్థానాన్ని శార్దూల్‌తో భర్తీ చేయాలని ముంబై ఇండియన్స్ యాజమాన్యం అనుకుంది. దాంతో, ప్రస్తుతం ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు నడుస్తున్నాయి. అన్నీ కుదిరితే త్వరలోనే శార్దూల్ ముంబై జెర్సీ వేసుకోవడం ఖాయం. ఐపీఎల్‌లో ఈ పేస్ ఆల్‌రౌండర్ వేలానికి వెళ్లకుండానే అమ్ముడవ్వడం ఇది మూడోసారి కానుంది. 2017లో కింగ్స్ లెవన్ పంజాబ్ నుంచి అతడిని రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ తీసుకుంది. 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ వద్దనుకోవడంతో శార్దూల్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ సొంతం చేసుకుంది.

**అదృష్టం వరించగా..**

నిరుడు ఐపీఎల్ మెగా వేలంలో శార్తూల్ ఠాకూర్‌ను ఏ ఫ్రాంచైజీ కొనలేదు. దాంతో.. అతడు కౌంటీ ఛాంపియన్ షిప్‌లో ఆడాలని డిసైడయ్యాడు. కానీ, లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ మొహ్సిన్ ఖాన్ గాయపడడంతో శార్దూల్‌ను అదృష్టం వరించింది. మొహ్సిన్ స్థానంలో ఈ పేసర్‌ను లక్నో రూ.2కోట్ల కనీస ధరకు తీసుకుంది. అయితే.. మెంటార్ జహీర్ ఖాన్ సూచలనతో ఆరంభంలో అదరగొట్టిన శార్దూల్ ఆ తర్వాత ఉసూరుమనిపించాడు. 10 మ్యాచుల్లో 11.02 ఎకానమీతో13 వికెట్లు తీశాడంతే. గత సీజన్‌లో అర్జున్ సైతం మూడువికెట్లకే పరిమితమయ్యాడు.

### రోహిత్ శర్మ విజయ్ హజారే ట్రోఫీలో ఆడతాడా? కీలక సమాచారం అందించిన ఎంసీఏ!




టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ త్వరలో జరుగనున్నవ విజయ్ హజారే ట్రోఫీలో అందుబాటులో ఉంటాడని, ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కి సమాచారం అందించినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే, మీడియా నివేదికలను ఎంసీఏకు చెందిన ఓ అధికారి తోసిపుచ్చారు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడడంపై రోహిత్ నుంచి ఎలాంటి అప్‌డేట్ రాలేదని ఆయన జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి చర్చలు జరగలేదన్నా రు. వాస్తవానికి, వన్డే క్రికెట్‌లో కొనసాగాలనుకుంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దేశీయ టోర్నీలో ఆడాలని బీసీసీఐ సూచించిందని పలు నివేదికలు తెలిపాయి. ఈ విషయంలో ఎంసీఏకు రోహిత్ సమాచారం అందించాడని పేర్కొన్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ బ్యాట్‌తో రాణించాడు. ఈ సిరీస్‌ను భారత్ 2–1 తేడాతో ఓడిపోయినప్పటికీ.. రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు. ఈ సిరీస్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీ సహాయంతో మూడు మ్యాచుల్లో 202 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో అజేయంగా 121 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక త్వరలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతుంది. తొలి మ్యాచ్ నవంబర్ 30న రాంచీలో జరుగుతుంది. రెండు, మూడో వన్డే డిసెంబర్ 3, 6 తేదీల్లో జరుగుతాయి. దేశవాళీ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచులు డిసెంబర్ 25 నుంచి జనవరి 18 మధ్య జరుగుతుంది. ఈ టోర్నీలోని అన్ని మ్యాచులు అహ్మదాబాద్, రాజ్‌కోట్, జైపూర్, బెంగళూరులో జరుగనున్నాయి. ఈ డొమెస్టిక్ టోర్నీలో రోహిత్, కోహ్లీ ఆడతారా? లేదా? అన్నది ప్రస్తుతానికి స్పష్టత లేదు. కానీ, కొద్దిరోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## స్పోర్ట్స్

### నేపాల్ ప్రీమియర్ లీగ్ ఆడనున్న మరో భారత స్టార్ క్రికెటర్



నేపాల్ ప్రీమియర్ లీగ్‌లో మరో భారత స్టార్ క్రికెటర్ అడుగు పెట్టబోతున్నాడు. తొలుత ఈ లీగ్‌లో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ శిఖర్ ధవన్ ఆడాడు. తాజాగా దేశవాలీ స్టార్ ప్రియాంక్ పంచల్ ఎన్‌పీఎల్ ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న 2025 ఎడిషన్ కోసం పంచల్ కర్నాలి యాక్స్ ఫ్రాంచైజీతో చేతులు కలిపాడు. పంచల్ చేరికతో ఎన్‌పీఎల్‌లో విదేశీ క్రికెటర్ల సంఖ్య 5కు (శిఖర్ ధవన్, జేమ్స్ వాట్, జేమ్స్ ఓడౌడ్ (నెదర్లాండ్స్), విలియం బాసిస్టో (ఆస్ట్రేలియా)) చేరింది. గుజరాత్‌కు చెందిన 35 పంచల్‌కు దేశవాలీ సూపర్ స్టార్‌గా పేరుంది. 127 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 45.18 సగటు, 23 సెంచరీలతో 8856 పరుగులు సాధించాడు. అయినా అతనికి భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించే అవకాశం రాలేదు. భారత సెలెక్టర్ల నుంచి పిలుపు కోసం కళ్లకు ఒత్తులు పెట్టుకొని ఎదురుచూసి, ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా జరిగిన హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో పంచల్ భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. రంజీ ట్రోఫీలో పంచల్‌కు 2016–17 సీజన్ డ్రీమ్ సీజన్. ఆ సీజన్‌లో అతను ట్రిపుల్ సెంచరీ సాయంతో 1310 పరుగులు చేశాడు. కాగా, ప్రస్తుతం పంచల్ ఒప్పందం చేసుకున్న కర్నాలి యాక్స్ ఫ్రాంచైజీకే శిఖర్ ధవన్ గత నేపాల్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో ఆడాడు. యాక్స్ తరపున మార్కీ ప్లేయర్‌గా ఎంట్రీ ఇచ్చిన ధవన్ గత సీజన్‌లో ఓ మెరుపు అర్ధ శతకం బాది ఆకట్టుకున్నాడు. ఈ సీజన్‌కు ధవన్ అందుబాటులో ఉంటాడా లేదా అన్నదానిపై స్పష్టత లేదు.




# రాజమౌళి బిగ్ ఈవెంట్.. హోస్ట్‌గా ప్రముఖ యూట్యూబర్!


మహేష్ బాబు - రాజమౌళి కాంబోలో వస్తోన్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఎస్ఎస్ఎంబీ29. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించి బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు మన దర్శకధీరుడు. ఓ సాంగ్‌ను రిలీజ్ చేయడంతో ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. అయితే ఈ మూవీ టైటిల్‌పై ఫ్యాన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ ఎప్పుడెప్పుడు రివీల్ చేస్తారా? అని మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమౌళి బిగ్ ఈవెంట్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో బిగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకలో భాగంగా మూవీ టైటిల్‌తో పాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయనున్నారు. దీంతో భారీగా ఫ్యాన్స్ రానున్న నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కొన్ని సూచనలు ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన క్లారిటీ ఇచ్చారు. అయితే తాజాగా ఈ ప్రతిష్టాత్మక గ్రాండ్ ఈవెంట్‌కు హోస్ట్ ఎవరన్నది కూడా టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పెద్ద పెద్ద ఈవెంట్లకు మన స్టార్ యాంకర్ సుమ ఉండనే ఉంటుంది. సుమతో పాటు ప్రముఖ యూట్యూబర్ ఈ మెగా ఈవెంట్‌కు హోస్ట్‌గా పనిచేయనున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఆశిష్ చంచలానీ హోస్ట్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని ఓ ఫన్నీ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు. రాజమౌళితో కలిసి ఈ వీడియోను రూపొందించారు. కాగా.. తొలిసారి రాజమౌళి- మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు గ్లోబ్ ట్రాటర్ ?అనే టైటిల్ ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ బిగ్ ఈవెంట్‌లో ఈ విషయాన్ని రివీల్ చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దాదాపు 50 వేల మందికి పైగా అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 15న సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

# 'కొదమ సింహం' రీరిలీజ్.. అదిరిపోయేలా ట్రైలర్





మెగాస్టార్ చిరంజీవి నటించిన కొదమసింహం రీరిలీజ్ కానుంది. 1990లో విడుదలైన ఈ చిత్రంలో కౌబాయ్‌గా చిరు కనిపించారు. ఈనెల 21న సరికొత్త హంగులతో పాటు 4కే విజువల్స్‌తో రీరిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను షేర్ చేశారు. దర్శకుడు కె.మురళీమోహనరావు తెరెక్కించిన ఈ చిత్రంలో సోనమ్, వాణీ విశ్వనాథ్,రాధ,సుజాత,అన్నపూర్ణ నటించగా మోహన్‌బాబు ముఖ్యపాత్ర పోషించారు. ఈ మూవీని కైకాల నాగేశ్వరరావు నిర్మించారు. ఇప్పుడు కూడా ఆయనే ఈ చిత్రాన్ని 5.1 డిజిటల్ సౌండింగ్‌తో చేయించి మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. ఇది 'హంటర్స్ ఆఫ్ ది ఇండియన్ ట్రెజరీ' అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడిన మొట్టమొదటి దక్షిణభారత చలనచిత్రంగా కొదమసింహం రికార్డ్ క్రియేట్ చేసింది. కౌబాయ్ పాత్రలని అంతకు ముందు ఎక్కువగా ఘట్టమనేని కృష్ణ పోషించేవారు. ఈ చిత్రంతో చిరంజీవి మొట్టమొదటి సారిగా పూర్తి నిడివి కౌబాయ్ పాత్రని పోషించారు. బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబట్టిన ఈ మూవీ 20 కేంద్రాల్లో శత దినోత్సవం జరుపుకుంది. ఇందులోని పాటలు 'జపం జపం జపం, కొంగ జపం', 'చక్కిలిగింతల రాగం', 'గుం గుమాయించు కొంచెం' బాగా పాపులర్ అయ్యాయి.

# ఫైట్ సీక్వెన్స్‌లో మన శంకర వర ప్రసాద్‌గారు.. చిరంజీవి టీం ఇప్పుడెక్కడుందో తెలుసా..?



టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ నేడు షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్ధన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



# మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు

## ఇంట్రెస్టింగ్‌గా రాజు-రాంబాయి ట్రైలర్

సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటివరకు మంచి సందేశాన్నిచ్చిచ్చే చాలా ప్రేమకథలు వచ్చాయని తెలిసిందే. అదే జోనర్‌లో వస్తున్న ప్రాజెక్ట్ రాజు - రాంబాయి. సాయిలు డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో అఖిల్ ఉడ్డెమారి, తేజస్వి (కమిటీ కుర్రోళ్లు ఫేం) హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈటీవీ ఒరిజినల్ మూవీగా వస్తోన్న ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో క్యారెక్టర్ బ్యాండ్ బాజా మోగించే సీన్లతో మొదలైంది ట్రైలర్.. ఇక రాజు నువ్వెప్పుడు బ్యాండ్ కొడుతూనే ఉండు. మనకు పెళ్లైనా.. పిల్లలు పుట్టినా.. మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు సరే నా అంటూ హీరోయిన్ చెబుతున్న సాగుతున్న డైలాగ్స్ ఇంప్రెసివ్‌గా ఉన్నాయి. ఊళ్లో బ్యాండ్ కొట్టి జీవనం సాగించే రాజు అనే యువకుడికి చదువుకునే రాంబాయి అనే యువతికి మధ్య లవ్ ట్రాక్ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ప్రేమ, పెళ్లి.. వాటి ద్వారా ఎదురయ్యే సమస్యలను చూపిస్తూ యూత్‌ను ఆలోచింపజేసేలా సినిమాను తెరకెక్కించినట్టు ట్రైలర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ చిత్రానికి విరాటపర్వం డైరెక్టర్ వేణు ఊడుగుల వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# ఈ అందాల సోయగాన్ని దేశంలో సగం మంది చంపాలనుకున్నారా.. అదా శర్మ సంచలన కామెంట్స్



ప్రముఖ నటి అదా శర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ మూవీ '1920' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అదా, తన నటనతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పూరి జగన్నాథ్ %-% నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన 'హార్ట్ ఎటాక్' మూవీతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలోని ఆమె ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభించాయి. తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి', 'క్షణం', 'కల్కి' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించింది. అయితే ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో ఆమె బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. తన అందం, గ్లామర్‌తో పాటు రిస్క్ ఉన్న పాత్రలను ఎంచుకోవడంలో అదా ఎప్పుడూ ముందుంటుంది. అదే ధైర్యం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' అదా శర్మ జీవితానికి నిజమైన టర్నింగ్ పాయింట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. రాజకీయ వివాదాల మధ్య విడుదలైన ఈ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో అదా ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో పాపులర్ అయింది.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అదా మాట్లాడుతూ.. "ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని అనుకుంది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించి రక్షించింది. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకుంటున్నాను. ఆ రిస్క్ వల్లే నేడు నాకు గుర్తింపు వచ్చింది. పాత్రలో భావోద్వేగం లేకపోతే నచ్చదు. యాక్షన్ సీన్లు ఉండాలి అని వెల్లడించింది. ఇక ప్రస్తుతం అదా శర్మ, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ నివసించిన అదే ఫ్లాట్‌లో ఉంటోంది. ఆ ఇంట్లో సుశాంత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఫ్లాట్‌ను చాలా మంది అద్దెకు తీసుకోవడానికి భయపడ్డా, అదా మాత్రం ధైర్యంగా అక్కడే ఉంటోంది.ఇటీవల ఆమె 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' సినిమాలో శక్తివంతమైన పాత్రలో కనిపించింది. అదనంగా మరో యాక్షన్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో కూడా అదా యాక్టివ్‌గా ఉంటూ, తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు, ఫిట్‌నెస్ వీడియోలు, డాన్స్ క్లిప్స్, గ్లామరస్ ఫోటోషూట్లతో తరచూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సవాలు ఉన్న పాత్రలతోనే అదా శర్మ తనదైన ముద్ర వేసుకుంటూ బాలీవుడ్‌లో సత్తా చాటుతోంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com